7805

విశ్వాఖిలగ్రంథావళి

౨: ఖండకావ్యములు.

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి

వెల
3—0—0

ప్రభాతముద్రణాలయము;
నెల్లూరు.

కృతజ్ఞత.

బాల్యంబుననె కావ్యవనవీథి విహరించి
కవికోకిలాలాప గతులు మెచ్చి;
సౌందర్యభావనాశబలిత చిత్తుఁడై
స్వర్గతుల్య మొనర్చె స్వభవనమును;
కలిమికి సహజమౌ గర్వంబువిడి మిత్ర
బృందమ్మాత్ప్రీతిక నెక్కుఁ గలిగె;
అర్థికి గౌరవహాని దోఁపింపని
దానశిల్పములోని తత్త్వమెఱిఁగె;
మాటలకుఁ జేఁతలకు మాఱుపాటులేమి
వఱలె నీయందు రేబాలవంశచంద్ర
యనుచు నెల్లరుఁ బొగడంగ నలరినావు
రమ్యగుణమూర్తి శ్రీసుబ్బరామిరెడ్డి!

కృత్తికిఁ గావ్యకళా సం
పత్తికి మొగదారులైన మనతొంటి నృపుల్
ఇత్తఱి నరుదేయైనను
బొత్తిగ విడిపోవు మనలఁ బూర్వాభిరుచుల్.

కొండవీటి రాజ్యేందిర కున్ంకిపోయె
నకట! దురదృష్టవశమున, నైననేమి?
నేఁడు సిరిగల ప్రతి రెడ్డిపీడుకూడ
పండితులపాలిటికి "పిల్లకొండవీడు."

"జనకుని స్మృత్యర్థము నే
నను కొంటిని నీదుకృతుల నచ్చొత్తింపన్
అనుమానమేల? నీవా
ననవోయిన యున్నతీరు "లా" నశిపించెన్.

నీ రసికత, నీమైత్రియు,
నీరమ్యకళానుభూతి నిరతము శిల్ప
ప్రేరకమై నవకవితో
దారకమై పెంపు చెందుతన్ బ్రియమిత్రా!

నేను నీవును సకలంబు నిశ్చయముగఁ
గాలవాహిని నొకనాఁడు గలయఁగలము;
కాని, రమ్యమైన యపూర్వ కావ్యసృష్టి
అమరతం గూర్చుఁ గర్తకు నాశ్రితునకు!

సిరికిందగిన వదాన్యత,
పరువము, లలితాభిరుచుల బలిసిన భావ
స్ఫురణము, భోగప్రీతియు
విరిసెను నీబ్రతుకుఁ దీవ విరులటు మిత్రా!

V

ధనముండుట పరిపాటియె;
ధనమే సర్వంబుగాదు; ధనముండియు స
ద్వినియోగ బుద్ధిగలిగిన
మనుజునిభాగ్యంబె లోకమాన్యతగాంచున్.

రమయు వాణియుఁ బక్షపాతమువహించి
కూర్చి రర్థంబు విద్యయుఁ గొదవలేక;
అట్టియొద్దిక యందఱ కబ్బదోయి,
జీవితార్థంబు నిరుకేలఁ జిక్కఁబట్ట!

విన్నపము.

1916 మొదలు 1933 వఱకు నేను రచించిన ఖండ కావ్యము లన్నియు ఈ సంపుటమున సమకూర్పఁబడినవి. వ్రాత ప్రతులను బట్టి, ఆయా ఖండకావ్యములను రచించిన తేదులను ఇందు పొందుపఱచితిని. 1921 లో 'నక్షత్రమాల' ప్రకటింపఁ బడినపుడు ఆసంపుటమునకు నేను రచించిన ఉపోద్ఘాతము ఈ ఖండకావ్య సంపుటమునకును ఉచితముగ నుండును గాన దాని నట్లే యుండనిచ్చితిని.

మోపూరు నివాసులును కళోపాసకులును కవితా రసజ్ఞులును నాకు మిత్రులును అగు

శ్రీయుత రేబాల సుబ్బరామిరెడ్డిగారు

ఒకనాఁడు ప్రస్తావ వశమున నిట్లనిరి:

"నీగ్రంథములు చెల్లా చెదరుగ నున్నవి. మాసపత్రికలలో ప్రకటింపబడిన కొన్ని కావ్యములు గ్రంథరూపమున వెలువడనే లేదు. తుదకు నీపుస్తకములు ఎచ్చట దొరకునోయను సంగతికూడ చాలమందికి తెలియదు. నీకృతులన్నియు ఒకే సంపుటముగ నచ్చొత్తించిన బాగుగనుండును. నీ విష్టపడుదువేని నేనందుకు వలసిన యేర్పాటు కావించెదను."

శ్రీయుతులు రేబాల సుబ్బరామిరెడ్డిగారు.

శ్రీ. శే. దేబాల సుబ్రమణిగారు,

సుబ్బరామిరెడ్డిగారి కవితా ప్రియత్వము, ఔదార్యము నన్ను ముగ్ధుని గావించినవి. అర్థింపఁబడియు కవులకు సహాయము చేయు కవితాపోషకులు అరుదైన ఈకాలమున సుబ్బరామిరెడ్డిగారి ఈయయాచిత సాహాయ్యము ప్రశంసా పాత్రమని వేఱుగ చెప్పనక్కఱలేదు. నేను వారికెంతయు కృతజ్ఞుఁడను.

సుబ్బరామిరెడ్డిగారి జనకులు

కీ. శే. రేబాల సుబ్బారెడ్డిగారి స్మృత్యర్థము

ఈ కవికోకిల గ్రంథావళి యచ్చొత్తింపఁబడినది.

నేను నెల్లూరిలోనుండి అచ్చుప్రూఫులు స్వయముగ దిద్దికొన వీలులేకయున్నందున నామిత్రులును, మృదుమధుర కవితారచయితలునగు సోనుగుంట పున్నయ్యగారును, చిర కాలమిత్రులును "హాలిక" లాంఛన విశ్రుతులును ప్రభాత ముద్రణాలయాధికారులును అగు మరుపూరు కోదండరామ రెడ్డిగారును ప్రూఫులుదిద్ది శ్రద్ధతో మిత్రకార్యము నెరవేర్చిరి. వారిసాహాయ్యమునకు నేనెంతయు కృతజ్ఞుడను.

నెల్లూరు,
2—12—1935

దువ్వూరి రామిరెడ్డి

విషయసూచిక.

—: నక్షత్రమాల :—

		పుట
1	కవిమనోరథము	13
2	ప్రణయాంజలి	15
3	సంధ్య	18
4	కవి	20
5	కుసుమాశ్రువులు	22
6	రెడ్డికులప్రబోధము	24
7	సోదరీస్మృతి	30
8	కోయిల	32
9	స్వాతంత్ర్యరథము	33
10	ప్రణయాహ్వానము	36
11	కొండవీడు	38
12	కవితా ప్రణయిని	42
13	ద్రౌపదీ సందేశము	47
14	దుర్యోధనుఁడు	51
15	రాధయుత్కంఠ	54
16	ఎంత మోసము	57

17	అజ్ఞాతకవి	60
18	ముసలిమాలెత	61
19	జాతీయగీతము	68
20	రాట్నపు పాట	70
21	ఏలపాట	72

—: నైవేద్యము :—

22	నైవేద్యము	79
23	కర్ణధారి	81
24	బాటసారి	83
25	మర్మకవి	84
26	రాధాకృష్ణులు	86
27	వాల్మీకి	90
28	కవి: సన్న్యాసి	93
29	మాతృమందిరము	97
30	హృదయాభిలాష	104
31	భవిష్యద్దర్శనము	105
32	సమరతృష్ణ	108
33	మేలుకొలుపు	112
34	వానకాలపు వరిచేలు	113
35	హతాశ	114

36	శైశవస్మృతి	116
37	అభిసారిక	119
38	గణిక	121
39	దీపనిర్వాణము	122
40	వీణాప్రియ	124
41	సేవ	126
42	ప్రబోధశంకము	127
43	రజని	129
44	అభిసారిక	131
45	ఆగంతుకి	132
46	పిచ్చి బికారి	134
47	బాష్పదాత్యము	136
48	అతిథి	138
49	మోహినీప్రకృతి	139
50	జీవనద్వేషి	140
51	ఆనంద సత్రము	143
52	ఆమని నిషా	145
53	లూఠీ	147
54	పూర్వజన్మస్మృతి	148
55	రాజభిక్షుకుఁడు	153
56	మాతుఁను	155

57	బిడ్డ: బాటసారి	159
58	మేలుకొలుపు	161
59	వసంతోదయము	163
60	పండితప్రతిజ్ఞ	164
61	అనార్కలి	178
62	వానాకాలపు పల్లీజీవితము	186
63	కవి సంశయావస్థ	188

—: భగ్నహృదయము :—

64	ప్రియావియోగము	197
65	స్మృతికణము	202
66	శిశు వియోగము	203
67	కవితా చితి	207
68	మనో విప్లవము	210
69	కవి యలౌకికత	212
70	నిస్సహాయత	213
71	ప్రణయబలి	214
72	అధ్యాయాంతము	219

—: పరిశిష్టము :—

73	కంటకారు: సాయంకాలము	223
74	జాతీయత	225

75	మంచుకాలపుఁ బ్రొద్దుపొడుపు	227
76	గాంధి	230
77	కళా పరిపూర్ణుఁడు	234
	—: ప్రథమకవిత్వము :—	
78	రసికజనానందము	241
79	ఋతుసంహారము	257
80	పుష్పబాణవిలాసము	262
81	అహల్యానురాగము	267
82	శ్రీకృష్ణునిరాయబారము	269
83	సింహప్రబోధము	288
84	కవి	290
85	సంక్రాంతిపండుగ	292
86	భారతమాతృప్రబోధము	294
87	విమర్శకుఁడు	296
88	దేశమాతృస్తవము	300
89	జలజము	304
90	ఆశీర్వాదము	305
91	బంభర శుక కీట సంవాదము	306
92	మాతృశతకము	308

శుద్ధిపత్రము.

ఉపోద్ఘాతము

పుట.	పద్యము.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
6		1	ఇంతవఱకు	ఇంతవఱకు ప్రికృతి

నక్షత్రమాల

పుట.	పద్యము.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
16	3	2	నిఝరిణి	నిర్ఝరిణి
18	3	2	బాహువు	బాహువుల్
34	4	1	ప్రోజ్జలంపు	ప్రోజ్జ్వలంపు
37	3	4	కడగివైచెద	కడిగివైచెద
38	2	3	లార్భకుండు	లార్భకుఁడు
42	4	2	వులగుత్తుల్,	ఫులగుత్తుల్
44	2	4	గఁడిపితిన్నా	గఁడపితిన్నా
46	2	4	వలయించి	నలయించి
47	2	1	వగఁచినట్లుఁడ	వగఁచినట్లుండ
47	2	2	తెఁవలెనున్న	తెగవలెనన్న
49	2	4	భితుకులకు	భిక్షుకులకు
62	1	11	నెరయుచుండ	నెరియుచుండ
67	1	8	నిఁకమీఁద	ఇఁకమీఁద

నైవేద్యము

పత్రిమాంకము		3 వ పంక్తి	తప్పు,	ఒప్పు
,,		4 ,,	యింద్రజాలికుం	యైంద్రజాలికుం
79	2	3	భిక్షుకుండేని	భిక్షుకుండేని
82		16	పాథోధి	పాథోధి
84	1	15	పుష్పకంపు	పుష్పకంబు
85		5	దగ్గఱఁజేతి	దగ్గఱఁజేరి
109		9	యన్యాయ్య	యన్యాయ
110		3	వెఁట	వెంట
111		8	నానాంద	నానంద
113		1	క్రొక్కాఱు	క్రొక్కారు
124		10	వదనబు	వదనంబు
135		4	విడచి	విడిచి
138		7	సమత్థిత	సముత్థిత
141		7	గానవే	గాకవే
141		17	నాహృదయుం	నాకుహృదయుం
144		4	నన్నింటిరెఁ	నన్నిట్టిఁ
147		9	యర్చవేదిక	యర్చనవేదిక
168	2	1	యింద్రజాలి	యైంద్రజాలి
170	2	11	వడిసితి	వడసితి
186	2	1	కాలుమెయిళ్ళ	కాలుమొయిళ్ళ.
186	2	3	సూర్మరశ్మి	సూర్యరశ్మి

భగ్నహృదయము.

206	2	3	గడుపంగనేల	గడపంగనేల

206	3	3	నీకు;	నీకుఁ
208	5	2	నిక్కముగానిఁ	నిక్కముగాని
209	1	2	కండిది	కడింది
210	4	2	దెకలించి	బెకలించి
218	1	4	సాఁగుతక్	సాగుతక్
235	2	6	పందిఁళ్ళ	పఁదిళ్ళ

ప్రథమకవిత్వము.

277	2	1	డెక్కముల్లో	డెక్కములో
283	2	1	స్వాంతుడు	స్వాంతుఁడు
285	1	1	గితీక్షయు	దితిక్షయు
302	1	4	జిహ్మలతలు	జిహ్వలతలు
312	4	2	పనులెంతే	జనులెంతే
316	1	3	దెలవాఱ	దెల్లవాఱ
317	3	3	ననలవ్యాపార	ననలవ్యాపాద
319	2	1	సంతాఁబులం	సంతానంబులం
319	5	3	స్వచ్ఛాభస్త్ర	స్వచ్ఛాభ్రస
320	2	1	గీస్	గ్రీస్

నక్షత్రమాల

1918 -1921

"Poetry has been to me its own exceeding great reward. It has soothed my afflictions; it has multiplied and refined my enjoyments; it has endeared solitude; and it has given me the habit of wishing to discover the good and beautiful in all that meets and surrounds me"

—COLERIDGE.

ఉపోద్ఘాతము.

మానవహృదయమును దైనిక కలకలమునుండి తొలఁగించి విషయభార విముక్తముచేసి, ప్రాపంచిక సీమాంతముల కవ్వల భావసృష్టి కల్పితమైన నక్షత్రమండలమున సంచరింపఁజేయుటకు శిల్పము సహాయకారి. శిల్పములలోఁ బ్రతిక్షణ భావవ్యక్తికి నాలవాలమైనది కావ్యశిల్పము. ఇతరశిల్పములకును గావ్యశిల్పమునకును జాల వ్యత్యాసముగలదు. ఒకచిత్రపటమును దర్శింతమనుకొనుఁడు. ఆ పటమునందు ఒక్కభావము, ఒక్కస్థితి, ఒక్కవిధమైన రసానుభూతి యలవడును. కాని, కావ్యశిల్పమునం దిట్టినిశ్చలత యుండదు. అనుక్షణము భావములు పరిసరదృశ్యములు అనుభూతియు మెఱుఁగుతీఁగవలె మాఱుచుండును. కావ్యమును ఇప్పటి సినిమాకుఁ బోల్పవచ్చును.

కవులు సృష్టికర్తలు. వీరి ప్రధానకార్యము సృష్టి. ఇట్టిసృష్టివలనఁ బ్రయోజన మేమియని కొందఱు ముగ్ధహృదయులు, కొందఱు శుష్కరస హృదయులు ప్రశ్నింపవచ్చును. కావ్యసృష్టివలన నమూల్యమైన ప్రయోజనము గలదు. రామణీయకము పరిపూర్ణముగ వికసింపని యీప్రపంచమునుండి సర్వతోముఖ రమణీయమైన కల్పనా ప్రపంచమున, గంగాతరంగ శీతలవాః కణ పూరితమును, నందనవన సద్యోవికసిత కుసుమ సౌరభ్య పులకితమునగు మందమారుత స్పర్శకడోలికల రసార్ద్రమైన మానవహృదయమును గావ్యము ఉయ్యెల లూఁపుచుండును.

శింపాలతాంగిని అస్పృశాంశుముఖిని ఇంతవఱకు సృజింపలేదు. కాని శిల్పియుఁ గవియు సృజించిరి. ప్రకృతిలోపమును బూరించుటయే కళయొక్క ముఖ్యప్రయోజనము. వివిధవస్తు సంయోగము నందుఁ బ్రకృతికన్నను గవులు ముందంజ వేసియున్నారు. "చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము గలిగినటు" "Melody of flowers" మున్నగుకల్పన లిందునకుఁ దార్కాణములు. కావ్యము ఆనందమయము. కావుననే యానంద దాయకము. కావ్య ప్రయోజనములలో "సద్యః పరనిర్వృతయే" అను లాక్షణిక నిర్వచనము ప్రధానమైనది.

నిజమైన కవిత్వము ఆకృతిబద్ధముగాదు. ఏయాకృతియుఁ గవితారస ప్రవాహమును బట్టియుంచలేదు. మూర్తీభవింపని కవిత్వమే అస్పష్టమైన కవిత్వము. ఈ కవిత్వము ఏకాంతమునందు రసార్ద్రమైన మానవహృదయముచే ననుభవింపఁబడుచున్నది. ప్రశాంతమను అక్షరములతో వ్రాయఁబడిన యీ కవిత్వమందుఁ జెవికి వినఁబడని గానమున్నది. ఈ గానమనోహరత్వమును మార్దవమును గర్ణేంద్రియ సహాయములేక హృదయమే స్వయముగ ననుభవించుచున్నది. కావుననే నొగూచి యను జపానుదేశపుఁ బ్రఖ్యాతకవి "వ్రాయఁబడిన కవిత్వమునకన్నను వ్రాయఁబడని కవిత్వమే మధురమైన" దని నుడివియున్నాఁడు. కీట్సు అను ఆంగ్లేయ కవియు, "Heard melodies are sweet, but those unheard are sweeter" అని వ్రాసియున్నాఁడు. కవి యనుభవించు ఆనందము అతని భావవీథినిఁ బొడకట్టుదృశ్యము, స్థూలమైన భాషయందు గర్భీకరింపఁబడినపుడు అత్మ సౌందర్యమును సగము కోలుపోవును. ఎందువలననఁగా భావములు సున్నితములైనవి; భాష స్థూలమైనది. కావునఁ గవిత్వమునందు అంతర్భూతమైన భావకాంతయు బహిర్భూతమైన భాషకాంతయు సమ్మిళితమై యుండును. కవిత్వమును నిఘంటు మూలమునఁ దెలిసికొనఁ గోరు నతఁడు రసహీనమైన

శల్యపంజరమును మాత్రము చూడఁగల్గును. కాని యందలి యానందమును సౌందర్యమును ననుభవింపలేఁడు. కవిత్వమందలి ప్రతిపదముచుట్టును నిఘంటువు నిర్ణయమున కతీతమైన భావరోచి యావరించియుండును.

పద్యములు భావప్రేరకములు. భావములు ప్రతిబింబించుటయు, విరివియగుటయుఁ, బాఠకుని హృదయసంస్కారము ననుసరించి పరిపరివిధములుగ నుండును. కావుననే పాఠకులుగూడ కవులవలెనే రసార్ద్ర హృదయులుగా నుండవలయునను. తామరపాకుపైఁ జౌరలాడు మంచుబొట్టు ప్రొద్దుపొడుపు మొదలు ప్రొద్దెక్కుకొలఁది కిరణవర్ణభేదముల ననుసరించి బహువర్ణములు దాల్చునట్లు పాఠకుల సంస్కారభేదముల ననుసరించి కవితయు వివిధాకృతులతోఁ బొడకట్టుచుండును. ఇందుకీక్రింది దృష్టాంతము గనుఁడు. సూర్యుఁడస్తమించెను. సంజకెంజాయలు జలదశకలములపై నలమికొని పశ్చిమదిశను నొకచిత్రప్రదర్శనశాలగ మార్చివైచెను. వరిచేలు పండి యొరగి చల్లగాలికి సముద్రతరంగములవలె నల్ల నల్లన నాడుచుండెను. ఇట్టి దృశ్యమును నొక చిత్రకారుఁడును మఱియొక పల్లెటూరి కాఁపును సందర్శించుచుండిరనుకొందము. చిత్రకారుని చిత్తము ఊహాతీతమైన యా వర్ణసమ్మేళనముయొక్క సౌందర్యమున నిమగ్నమయి పోయియుండును. కాఁపువాని హృదయము బంగారు ట్రిసుకవలె పండి యొరగియున్న వరిచేనుగాంచి నంత ఉవ్విళ్ళూరుచుండును. అతని మనము నాకర్షించుటకుఁ బడమటిదెస యందేమియును వింత తోఁచలేదు. దృశ్య మొక్కటియే యైనను, వారి హృదయఫలకములందు భిన్నముగఁ బ్రతిఫలించెను.

పూర్వులలోఁ గొందఱు కవిత్వమును శాస్త్రముగఁ బరిగణించిరి. ఇది చాల గొప్ప పొరపాటు. శాస్త్రమున నానందములేదు; నగ్న సత్యము కలదు. శాస్త్రకారునికిని శిల్పికిని జాల వ్యత్యాసము గలదు. వారి మార్గములు ధ్రువములవలెఁ బరస్పర భిన్నములనిన సత్యబాహ్యముగాదు. కవియును

శాస్త్రకారుఁడును ఒకహృదయమును బరీక్షింపవలసిన యెడల కవి రసము, అనుభూతి, భావము మున్నగు వానికై వెదకుచుండును. శాస్త్రకారుఁడా హృదయమును గోసి అందెన్ని క్రోవులున్నవి, ఎన్నియరలున్నవి, నెత్తురే మార్గమున సంచరించునను విషయములను బరీక్షించుచుండును.

తెలుఁగు కవులలోఁ, గవిత్వము శిల్పమని ప్రథమమునఁ గనిపెట్టిన తత్త్వవేత్త మహాకవి తిక్కన. కావుననే యాకవి బ్రహ్మ "కవిత్వ శిల్పమునం బారగుఁడన్" అని చెప్పుకొని యున్నాఁడు.

స్వాతంత్ర్యమునఁ గొంత సాహసముగలదు. సాహస మనునది మానవ ప్రకృతిని నవీన మార్గావలంబనమునకుఁ బురికొల్పును. మానవ సంఘము రాజకీయ సాంఘిక మత నైతిక దాస్యమునం బడి యాచారశృంఖలల మూలమున యంత్ర చలితమగు నొక ప్రతిభాశూన్య విగ్రహమువలె నున్నపుడు అట్టి సంఘముయొక్క మనము నవీనకల్పనలకుఁ జొరఁ బాఱదు. ఆస్థితినిఁ గల్లోలించి భావదాస్య భారమున మ్రగ్గుచున్న హృదయమునకు విశాల ప్రపంచ దృశ్యము కనఁ బడునట్లు విప్లవము జరుగనిదే మానవప్రకృతి నిర్ణిద్రముగాదు. కృష్ణదేవరాయల కాలమునందు నూత్న కావ్య సృష్టికింగూడ నీలాటి విప్లవమే కారణము.

ప్రపంచ చరిత్రమును బరిశోధించి చూచినయెడల, పూర్వులకు భవిష్యత్సంతతి వారినిఁ దమతమ అభిప్రాయాచార మూలమున బంధించు చాపల్యము అమితముగ నుండినట్లు దోఁచుచున్నది. ఇట్టి యధికార చాపల్యము అన్ని మానవజాతులలోను నున్నది. ఇది యసంగతమేగాక హాస్యాస్పదమును. ఇట్టి యారోపితాధికారము మతసాంఘిక రాజకీయ విషయములందే కాక కవిత్వమునంగూడ నాటుకొనియుండినది. కావ్యలక్షణము ప్రథమమునఁ గవుల రచనలనుండియే యుద్భవించిన దయ్యుఁ బ్రత్యేక లాక్షణికుల

యధికారముద్రవలన ఆలక్షణమే కవులను నిగళబద్ధులను గావించినది.

కావ్యములలో నేయేవర్ణనము లుండ వలసినదియు నెట్టినాయికా నాయకు లుండవలసినదియు లాక్షణికులే తీర్మానించిరి. కాన కవిసృష్టికిఁ గొన్ని హద్దులేర్పడినవి. పూర్వకవులకు రాజులే యాశ్రయులు. రాజులు పండితులను సులోచనముల మూలమునఁ గావ్యపరీక్ష గావించుచుండిరి. ఇఁకఁ బండితులు రసార్ద్రచిత్తముతోఁ గాక శుష్కమైన లాక్షణిక మానదండము తోఁ గావ్యశిల్పమును గొలతివేయుచుండిరి. లాక్షణిక ప్రమాణమునకు వెంట్రుకపోసంతి తగ్గినను ఆ కావ్యము గ్రాహ్యముగాదు. కావుననే యాంధ్రప్రబంధము లన్నియు నొకే యచ్చున గుద్దినట్లు లొకేతీరున నున్నవి. ఒక కావ్యమును సాంతముగఁ జదివిన మఱియొక కావ్యమును జదువ నవసర ముండదు. అదేనాయిక; అదేనాయకుఁడు; అదే యుద్యానవనము; అదే మోహము; అదే విరహము; అదేశీతలోపచారము; అదే చెలికత్తె; అదేసూర్యోదయము, అస్తమయము!

కాని, యిప్పటి కాలస్వభావము, పరిస్థితులు మాఱినవి. ముద్రణ యంత్రములు కాగితములు ప్రబలినవి. కావున గ్రంథములు సర్వజనసామాన్యమునకు సులభము లగుచున్నవి. ఇప్పుడు కవులను పోషించు వారు ప్రజలు. ప్రజల యభిరుచియు మాఱినది. ఇందుకుఁ జాల చారిత్రక కారణములు గలవు. పాశ్చాత్య సారస్వత సంబంధము వలనను, తన్నాగరకతా సంపర్కము వలనను ప్రజల భావములు ఆదర్శకములు మాఱఁజొచ్చినవి. సంఘమునందుఁ గొంత జీవచలనము ప్రారంభమయినది. ఈ నవీనపరిణామము కవుల హృదయములఁ బ్రతిఫలించి ఆంధ్రసారస్వతమునఁ జొచ్చినది. కావుననే నేఁడు హృదయమోహనమైన ఆధునిక సారస్వతము తఱితీపు తెలుఁగునందు బయలు దేఱినది.

ఈకావ్యములను నేను విమర్శింపఁబూనుకొనలేను. కవియే తాను రచియించిన కావ్యములను, విమర్శకుఁడుగ నవతారమెత్తి పరిశీలించుట యసంభవము. స్వాభిమానము వలన ననవసర ప్రశంస గావించుకొనుటయో లేక వినయము వలన ఉచిత ప్రశంస చేయకుండుటయో సహజముగఁ దటస్థించును. కావున నీకావ్యములయొక్క గుణాగుణవిమర్శనము రసైక పక్షపాతులైన సహృదయులకు వదలుచున్నాను.

కవులయెడ సమకాలికులకు నిరాదరణము అన్నికాలములందును ఉండినట్లు తోఁచుచున్నది. ఈర్ష్యయుఁ "దనపెరటిచెట్టు మందు గాద" నెడు సామాన్య జనుల మనస్తత్వమును, పరిచయమువలనఁ గలుగు నౌదాసీన్యమును ఇందుకుఁ గారణములుగ నుండవచ్చును. "సమకాలము వారలు మెచ్చరే గదా" యని చేమకూర వేంకన్న వ్రాసిన యీ చిన్ని వాక్యమునందు అతని హృదయ వేదన యంతయు నిమిడి యున్నది. సమకాలికులచే నిరాదరింపఁబడిన మహాకవి భవభూతియొక్క వేడినిట్టూర్పులు

యే నామ కేచిదిహ నః ప్రథయం త్యవజ్ఞాం
జానంతి తే కిమపి తాన్ప్రతి నైష యత్నః
ఉత్పత్స్యతేఽస్తి మమ కోఽపి సమానధర్మా
కాలో హ్యయం నిరవధి, ర్విపులా చ పృథ్వీ.

అను నీశ్లోకమునందు నేఁటికిని ఆవిళ్ళువాఱుచున్నవి. తాను రచియించిన "ఇస బెల్లా" యను కావ్యము పైదాడి వెడలిన యీర్ష్యాపూరిత విమర్శనము వలన భగ్నచిత్తుఁడై కీట్సు అను నాంగ్లేయకవి స్నేహితుఁడైన షెల్లీకి "నేను మరణించిన యనంతరము గొప్పకవి నయ్యెదను కాఁబోలు" అనివ్రాసిన లేఖను జదివిన కిరాతుని హృదయమునందైనఁ గరుణ మొలుకును. ఇట్టి నిరుత్సాహకర సందర్భములందు " O! I sing for the mere

joy of singing'' అను ఉద్దేశమే కవిని ఆనంద కవచునిగ నొనరించు చున్నది.

ఓరి బాలక నీమురళీ రవంబు
వ్యర్థమైనదని చిత్తతాపంబువలదు;
రాగపరిచితుఁ డెవ్వఁడో రమ్యగీతి
వినియెయుండు నానందంబు వెల్లివిరియ.

పెమ్మారెడ్డిపాళెం
1921

ఇట్లు
దువ్వూరి రామిరెడ్డి.



నక్షత్రమాల.

క వి మ నో ర థ ము.

సాంధ్యకిస్మేరవర్ణవస్త్రములు దాల్చి
గిరితటవిహారశృంగారకేళి సొలసి
రమణఁ జరియించుజలధరార్భకుని గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు ?

ప్రత్యుషఃస్నేహమున విచ్చు ప్రసవమాదుఁ
దరుణసూర్యాంశుమాలికా తరళకాంతి
మిళితమై రాలు తుహినాంబుకళిక గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు ?

శిలలఁ బ్రవహించి, శీకరంబులను జల్లి
ప్రకృతిహృద్గతభావంబు బయలుపఱచు
గానముం జేయు మలయూఁటకాల్వ గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు ?

శారదేందుమయూఖ సంస్పర్శనముల
దైనిక స్వప్నమాంద్యమ్ముఁ దలఁగఁ ద్రోసి
మొలకనవ్వుల మేల్కను కలువ గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు ?

యామినీ వ్యోమమండల ప్రాంగణమున
సుకవియానంద రాజ్యంబుఁ జొచ్చువేళ
శోభ వెదచల్లు మురిపెంపుఁ జుక్క గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు ?

ప్రణయాంజలి.

ఎవ్వతెయందు నామది లయించి తదన్యము చింత సేయదో
యెవ్వతె ప్రేమపుష్పము సహింపఁగరాని వియోగగంధమున్
నివ్వటిల్లంగఁ జేసెడినొ, నిష్ఠురలం దనుభావ్యమైన యా
జవ్వని మన్మనఃప్రణయసాక్షిగ మంగళ మొందుఁగావుతన్!

అల్లియుఁబూలు పూవని లతావళు లట్టుల నాదుకోరికల్
గొల్లగ కేఁగియుం గుడుపుగూడకపోయె; మదీయపాపముల్
వెల్లువ లౌచు నిద్దఱను వేఱొనరింపఁగ, దైవదూషణం
బొల్లను; బూర్వకర్మఫలితోత్థితముల్ గదమోదఖేదముల్.

బయలం బ్రాఁకని ఆపకోఁతలకు నాభావంబు శుష్కించి లో
సంఋషన్ రాని విషాదకశ్మలతచే సంతోషలోకంబె యం
ధ యుతంబై కళదప్ప, యౌవనపుటుత్సాహంబు జీర్ణింప, స్వ
ప్న యథార్థత్వము లౌకికంబ నెడిత్రోవంబోయి చింతించుదున్.

నిమిషమైన రహస్యంబు నిలుపలేని
యద్దపుంబెట్టెలే మనయాత్మ లైన
బట్టబయలుగ నిరువురిభావవృత్తు
లెఱుకపడునేమొ కన్నియా, యింపు గలుగ.

కామదగ్ధంబునై, శాంతి గాంచి యున్న
భావభూతిని నిర్మలప్రణయ లతిక
లల్లుకొని పూలు పూచె, నా యార్ద్రగంధ
మిరువుర మనుభవింపలేమే లతాంగి?

పండిపండని కోరికపంటభూమిఁ
బొరలి ప్రవహించు విరహనిర్ఝరిణి తటులఁ
బ్రణయబంధంబు విచ్చి, పరస్పరాను
చింతలకు జలాంజలి యీయ సిద్ధపడెదో?

అట్లుగాక వెన్నెల గాయునట్టి రేల
వలపు మధువాని చిత్తంబు భ్రమయుచుండఁ
జుక్కపూవులపందిరి సొగయుఁ, జేతఁ
బట్టెదో వట్టివేళుల వ్యజన మబల!

తలిదండ్రులే మనకోరికల్ సమయు యత్నంబింతగావించియుం
గలలం గల్గు మనోహరప్రణయసఖ్యంబుం దొలంగించిరే?
చెలియా, యిద్దరిప్రేమబంధనము విచ్ఛిన్నంబుగాకున్నఁ గాం
క్షలుదుస్సాధ్యములయ్యుఁగొంతదనుకన్ సంతోషమేకూర్చెడిన్

ఇంక నీలోకమున మన కిద్దఱకును
హృదయరక్తికి నాలంబ మొదవకున్నఁ
బ్రణయమెల్ల ఫలించు స్వర్గమ్మునందు
ననుభవింత మానంద రసామృతంబు.

కనులం గాటుకచీఁకటుల్ నెఱయఁ గ్రిగంట న్విలోకించి నా
మనమున్ మానఁగరానిగాయములనొంపన్ స్వప్నమల్లోల చ
క్రనిదానా, పొడగట్టె దీవు? నను నింకం జిమ్మచీఁకట్ల వీ
ణను వాయించి వియోగగీతి లయ మొందంబాడనిమ్మోటిగన్.

సంధ్య.

అరుణుఁడు పశ్చిమాద్రిశిఖరాంగణమున్ డిగఁబోవ వారిదో
త్కరశకలంబులన్ రుధిరకాంతులు వెల్లరన్ దిశాంతముల్
పరఁగెఁ బరస్పరంబు నిరువాగుల వారలు ఘోర, రక్త ని
ర్ఘరముల, నాగఖండములఁ గ్రాలు రణస్థలు లట్లు దోఁచెడిన్.

భారతవీరపుంగవులు భాస్కరతేజు లపూర్వ శౌర్యగ
ర్వాఢులు ధార్తరాష్ట్రులును పాండునృపాలతనూజు లుద్వే
ఘోరరణంబు సల్ప నటఁ గూలిన సైనికభగ్నకాయముల్
పేరిన యుద్ధరంగముల పోలఁ దెలంగను బశ్చిమాశయున్.

క్షాత్రయుగంబునన్ భరతశౌర్యరమామణి వాఁడికేల్చుకీన్
శత్రుల శీర్షముల్ జలజషండము గాఁగ విభిన్న బాహువు
చిత్రమృణాలవల్లులుగఁ జెల్వగు శోణితపూర్ణసాగర
క్షేత్రసరోవరంబు విలసిల్లెనొ నా నపరాశ శోభిలున్.

కాంచఁగనే జపారుచిరకాంతులు మెల్లన నెల్ల లీనమై
కాంచనదీధితుల్ దిశలఁ గ్రమ్మఁ బురాతనభారతోర్వియా
సంచిత జాళువా గనిగ సంపదలం దులతూఁగుచుండెఁ బో
యంచుఁ దలంప హేమమయమయ్యె నజాండము చూడనందమై

ఎరలకు నేఁగు పక్షికులమెల్లఁ గులాయములంటి యాతురం
బఱచుచు వచ్చుటం గనఁగ భారతదేశ సువర్ణసంపదం
బరధరణీజనుల్ గని యపారముదంబున దానిఁ దోఁచుకోఁ
బరుగిడి వచ్చిరో యనఁగ భావమునం బొడకట్టు వింతగన్.

అంతఁ గ్రమముగఁ గాంచనకాంతి దిశల
మఱుఁగ, నిబిడాంధకారంబు మల్లడించె
నతులభాగ్యంబు శౌర్యంబు నంతరింప
సొంపు దఱిగిన యార్యవసుంధర నటు.

ఎప్పుడు గాఢసంతమస మీవసుధ న్విడుఁ, బ్రాచ్యదేశ మిం
కెప్పుడు శోణితార్ద్ర రుచి నింపులుచిల్కను, బాలభాస్కరుం
డెప్పుడు పూర్వముట్టల రహించుఁ బ్రతాప సముజ్జ్వలంబుగా
నెప్పుడు మాయునో జలజశృంఖలరాయిడి బంధరాళికిన్.

కవి.

వేగుజామున వికసించు విరులయందు
ఱేకు లెడలించు సంజ పూరెమ్మలందుఁ
గావ్యమునఁ బోలెఁ బఠియింతుఁ గౌతుకమునఁ
ప్రకృతిసామ్రాజ్య పాలనా పద్ధతులను.

చటుల కల్లోల రసనల సాగరంబు
పవలు రేయి నాలాపించు పాటలందు
ననితర గ్రాహ్యధర్మంబులై చెలంగు
విశ్వసృష్టి ప్రకారముల్ వినుచునుందు.

శ్యామలాకాశ ఫలకమునందుఁ దరళ
కాంతి వెదచల్లు తారకాక్షరము లొనర
విశ్వవైశాల్య బోధక విద్య నేర్తు
శర్వరీగర్భశాంతి యొజ్జగ విధింప.

గజురు తుంపరముత్యాలు కాన్క లిడుచుఁ
దరలు సెలయేటిపాటలో దాఁగియున్న
రాగతత్త్వంబు నామనిరాత్రులందుఁ
గూయుకోయిలకడ నేర్చికొందు వనుల.

స్వీయచరిత రహస్యంబు వ్రాయఁబడిన
హృదయపుస్తకపుటముల ముదముతోడఁ
బ్రకృతి నాప్రోల విప్పఁ బ్రభాతరాగ
రంజితం బైన తూర్పుతీరంబు నందు.

కుసుమాశ్రువులు.

'కమలా, లెమ్ము కుటీరకుడ్యముల బంగారంపు టేఁ బూఁతలం
గొమరారన్ రచియించె సూర్యకిరణాంకూరంబు లిప్పట్టునన్;
సుమముల్ గోయఁగఁబొమ్ము, నాన్న జలముల్ జొబ్బిల్లు నిర్ఝరావివ
ర్త్రముతో స్నానముచేసి వచ్చెడిని పూజాసక్త చిత్తమ్మునన్.

అని జనయిత్రి పల్కఁ విని యాతఁ గుమారిక లేచి దంతధా
వన మొనరించి బృందకును భక్తిఁ బ్రదక్షిణ మాచరించి చ
ల్లని మలగాలిసోఁకి యొడలం బులక ల్మొలకెత్తఁ బైటకొం
గును బిగియించి తోఁటకడకుం జనుదెంచె ననంటిడొప్పుతోన్'.

లేఁత పచ్చికతలలఁ జలించుచున్న
మంచు తుంపరముత్యాలు మగువ నడచు
నపుడు నటునిటుఁ జిందఁగ నంఘ్రితలము
చలికి మొద్దువాఱెనో యన జలదరించు.

అరుణ మయూఖ రంజితములైన హిమాంబు కణాళి ముత్యపున్
సరములు ద్రెవ్వెనో వరుసజాఱెడి పోలికఁ బూవు రేకులం
దొరఁగుటఁగాంచి యేమియునుదోఁపక యాకమనీయ దృశ్యబం
ధురత మనంబునగ్నమయి తొయ్యలి యాయనుభూతినుండఁగన్

అమ్మ కమలా, బిరాన రావమ్మ యనుచుఁ
దల్లి పిలిచెనుగాని, నితాంత పార
వశ్యమున నున్న కమల యా పలుకులయిన
వినక తలపోయుచుండె నా విధములెల్ల.

ఎట్టులు చేతులాడునొకో యీకుసుమంబులఁ గోయ? గాలువల్
గట్టెడు నశ్రుబిందులటు గాఱెడుఁ బువ్వులనుండి మంచు బొ
ట్లట్టిటు గాలికిం గదలినప్పుడు, పుష్పాల మధ్యనుండి సొం
పుట్టగ నవ్వెనాఁ బ్రకృతి, యుల్లము తాండవమాడు వేడుకన్.

కన్నుల విందుసేయు సుమకాండముఁ ద్రుంచి విచిత్రశోభలన్
జెన్నొలికించు నీప్రకృతి చిత్తము నెత్తురులొల్కఁజేయ నే
నెన్నఁడుఁబూన; లేఁబొడుపుటెండలు సోఁకినఁ బుల్కరించు పూఁ
బిన్నల హత్యచేయఁ దలపెట్టుట క్రూరము నన్నుఁబోఁటికిన్.

ప్రకృతి రామణీయకమును బాడువెట్టి
దైవపూజకుఁ దొడఁగెను దండ్రియేమొ!
ఆత్మకుసుమ సమర్పణం బాచరించి
వేదవేద్యునిఁ బూజింప వేడికొందు.

రెడ్డికులప్రబోధము.

రెడ్లుగాఁబుట్టిన ఋణముఁదీర్చికొనంగ
వీక్షించితిరె కొండవీటికోటఁ?
దలఁచిన యంతఁ జిత్తమున రోషము రేఁపు
కత్తుల కూపంబుఁ గాంచినారె?
రెడ్డివీరకుమార హృదయ రక్తంబులఁ
దోఁగిన రణభూమిఁ ద్రొక్కినారె?
యాంధ్రశౌర్యేందిర కకలంక భూషణం
బౌ రెడ్ల చరిత విన్నారె? యన్న

లార, యూరక రెడ్డికులాన జన్మ
మెత్తితిమఁటన్న నాదాయ మేమిగలదు?
తల్లిమొగము నెఱుంగని తనయు లవత
రించియును లేనివారలే యెంచిచూడ!

సచ్చిదానంద దర్శనుఁడు వేమనయోగి
మనకులంబునఁ బుట్టెననినఁ జాలు;
షట్చక్రవర్తి సచ్చారిత్ర నిర్మాత
మనవాఁడెయన్న యాఘనతచాలు;

రెడ్డికులప్రబోధము

Telugu Institute Library
Acc No. 12001
Hyderabad-27

ఆంధ్ర వీరాంగన యైన నాయకురాలు
మన కులస్త్రీ యన్న
ఔదార్య ధుర్యాత్ముఁ డనవేమ భూపుఁడు
మావాఁడె యన్న సంబరము చాలు;
ఇంక నెందఱెందఱో యహీనయశులఁ
గాంచి లోకైక విఖ్యాతి గన్నయట్టి
రెడ్డికులపుఁ జారిత్రంబు శ్రేష్ఠమనుట
కేమి లోపంబుగలదు? మీ రెఱుఁగరయ్య.

ఘనసైన్యంబులఁ గూర్చి, బాహుబల విక్రాంతి న్విశేషించి పద్మ నృపాలాళికి గుండెగాలముగ, విద్యానాథులై కొండవీటను నద్రంకిని రాజమహేంద్రిపురిఁ గోటల్గట్టి శౌర్యంబునన్ మును బాలించిన రెడ్డిరాజుల యశంబుల్ నేఁటికిం గ్రాలవే?

మాత్తుర రాజ్యరమామణుల్ చెఱఁబడి
గోడుగుడిచిన చోటు కొండవీడు;
ఆంధ్రదేశ మతల్లి యలికంబునం దాల్చు
మండన తిలకంబు కొండవీడు;
కవితారసాలోల కల్లోలినిం దోఁగు
పండితాఢ్యుల నాడు కొండవీడు;
ఖండితారాతిరాణ్మండన మండిత
ఖండలచాపంబు కొండవీడు;

అట్టిపేటను బెన్గోట గట్టి నట్టి
మేటిదిట్టలు మనఁగొంటి పోటరులెక !
నేఁటికిని రెడ్డి వీరుల నెత్తురచట
శౌర్యసౌరభ్యములు వెదజల్లుచుండు.

అరివీరకంఠనాళాస్ర ప్రవాహంబు
గవిసి త్రుప్పెత్తిన ఖడ్గధార;
భూగర్భమున రక్తపూరవిలీనమై
విశ్రమించిన బాహువీర్య మహిమ;
కావ్యసంపుటబద్ధ గాథాశ్రయంబున
గ్రుక్కిళ్ళువోవు నకుంఠకీర్తి;
బహుకాల విశ్లేషభరమున శోషిల్లి
రమణవాసినయట్టి రాజ్యలక్ష్మి;
యింక నెప్పుడు పూర్వశౌర్యాంక సరణి
రెడ్డికులవీర దోర్బల శ్రీసమాశ్ర
యంబుగాంచి వర్ధిల్లునో ? యట్టి యదను
గల్గునో ? మన కంత భాగ్యంబు గలదా ?

పోయిరివీరభద్రుఁ డనపోతమహీపతి వేమయోగియుం,
బోయెను మల్లరెడ్డికవి, పోయెను గాటయవేముఁడుఁ, రణా
జేయ కుమారవీరులును జెల్లిరి; రెడ్డికులంబు డొల్లయై
పోయెసటన్నలాఘవము పొందనికీర్తి యశంబునిల్పుఁడీ!

పోయి రేగాని వారల భూతినుండి
రేఁగుచున్నది వెండియు రెడ్డిశక్తి;
యిఁక నొకమాఱులోకంబు నెల్ల నాత్మ
దివ్యతేజంబున న్మించి తేల్పఁగలదు.

పచ్చినెత్తురుటలల్ పైఁ రేఁగు రణభూమి
జయనావ నడిపించు శౌర్యలక్ష్మి;
మోహనసౌరభ్యము ల్విసాళింపఁగఁ
గవితాలతాంగితోఁ గలయునేర్పు;
కీర్తివల్లికలుఁ గ్రిక్కిఱిసి దిక్కులకల్లఁ
గృతులందుకొన్న సాహిత్యరక్తి;
చేమొగ్గి యర్థులు జేపెట్ట సర్వస్వ
మైన నిచ్చెడు నుదారాశయంబు;
హోమధూమావృతం బగ్నిహోత్రమటుల
సన్నగిల్లియుఁ, జానదు-చావలేదు
ఇప్పటికి రెడ్డికులమందు; నింకఁ జావఁ
బోదు మననెత్రుకడపటి బొట్టువఱకు!

కొండవీటి దుర్గంబునఁ గ్రుంకినట్టి
రెడ్డిసూర్యుండు కాళరాత్రిని దరించి
యభినవాంశు ప్రసారంబు లలరుచుండఁ
దూర్పుదిక్కున నల్లదే దోఁచువాఁడు!

అనుమానంబొకయింతలేక గనుఁడీ, యావచ్చు బాలార్కబిం
బ నవాంశుల్ ఘనమాలఁ జీల్చికొని సైఁప్రాని కాంతిచ్ఛటం
గనులంగట్టుఁ; బ్రబోధగీతము లుషఃకళ్యాణి తారస్వరం
బున నాలాపము సేయుచున్న యది పెంపుం బొందనుత్సాహముల్.

వీడిపోయిన తంత్రులు బిగియఁగట్టి
హృదయమందుఁ బ్రతిధ్వను లెసఁగునటుల
వీణసారించుచున్నాఁడు ప్రియసుతుండు
లెమ్మునిద్దుర, రెడ్డికులమ్మ, యింక.

అరుగో! యూర్ధ్వపథంబునం గనుఁడు, దివ్యాకారముల్ దాల్చికీ
ర్తి రమాకాంతులు, రెడ్డివీరులు రణోర్వన్ దేహముల్వీడి ని
ర్జరలోకంబున సౌఖ్యముల్ పొరయు స్వార్థత్యాగు, లానందని
ర్భరచిత్తంబులఁ బుత్రులం గనఁగఁ జేరవచ్చి, మందారపు
ష్ప రసౌఘాకుల బంభరారవ మిళద్భవ్యామలాశీ రవం బు
రహింపన్ వెదజల్లువారలు సుమంబుల్ మోద బాష్పార్ద్రముల్

నేఁడు పవిత్రవాసరము నిర్మల చిత్తముతోడ నంగఱూ
గూడి కులాభివృద్ధికొఱకుం బనిసేయఁగ దీక్షఁబూని మీ
వాడలఁ బల్లెలన్ నగరవాటికలందుఁ బ్రబోధగీతముల్
పాడుఁడు, కంకణాలు మణిబంధములన్ ధరియింపుఁడర్థిమై.

ధనదాన్యంబులుప్రాజ్యభోగములువిద్యాబుద్ధులుం గీర్తియు
న్ఘనశౌర్యంబు నుదారతాగరిమ చక్కంగల్గి తంగేడుపూ
చిన చందాన సతంబు నూత్నరుచులం జెన్నారుతన్ విశ్వమో
హనమై రెడ్డికులంబు సర్వజన నిత్యానందసంధాయిగన్ !

సోదరీస్మృతి.

చెల్లెలా, నీవుస్వర్గమ్మునఁ జేరి కొన్ని
వత్సరంబులు గడచియుఁ బ్రకృతియందు
నీదుచిహ్నంబు లెల్లెడ నింపినావె
యనుదినంబును నాకు దర్శన మొసంగ?

శారదాంబుదమాలిక సడలిపోవఁ
గళలుదేఱిన శశిరేఖఁ గాంచినంతఁ
బొత్తిగుడ్డలు దొలఁగింపఁ బొసఁగు నీదు
నాస్యబింబము తలఁపున నవతరించు.

ప్రత్యూషంబున మంచుతుంపరలతోడ,
విచ్చు పన్నీటిపువ్వు సేవించినంతఁ,
దల్లికౌఁగిట మురిపెంబు వెల్లిగొలుపు
నీదు ముద్దుమొగంబు వర్ణింపఁజేయు.

సంజెవేళలఁ బలుచని జలదములను
బూతపూచెడి చెంగావి పూలసౌరు
నవ్వు నెడ నీకు చెక్కుల నాట్యమాడు
కాంతిమంజిమ మఱు నాకుఁ గానిపించు.

భౌతికంపు సంబంధము వాసియును ని
రంతరాధ్యాత్మిక ప్రణయంబు మనలఁ
గడవరాని బంధంబులఁ గట్టివైచె,
స్వప్నవీధికి వచ్చెదే ప్రతిదినంబు!

కోయిల.

పైరుకోఁతలఁ గష్టించి పల్లెచెలులు
కొంత విశ్రాంతిఁ గొన్నారు, కోయిలా, ర
సార్ద్రకంఠంబు నెత్తి గానామృతంబుఁ
జల్లుమా వారిమనములు చల్లవడఁగ.

చిత్తరంజక రాగనిశ్రేణి వైచి
దివ్యగానంబు భూమికి దింపరావె !
తంత్రు లెడలిన వల్లకీదండ మట్లుఁ
గూజిత విహీనమై తోఁచు గున్నమావి.

నీవు లేకున్న గగనవనీ నికుంజ
తలములును బాదుపడినవిధానఁ దోఁచు !
నేడ కేఁగితో కోయిల యెమ్మెలాఁడి ?
పాడరావమ్మ, యొకమాఱు ప్రణయగీతి.

తేనెలూరెడి నీపలుకు తియ్యఁదనముఁ
గోరి విరహులపోలికఁ గుందువారు
కవివతంసులు; వాసంతకాల లాంఛ
నంబవయి రావె కోయిలా, సంబరముగ.

స్వాతంత్ర్యరథము

అంబుదంబుల నమృతపూరంబు లొలుక
నింద్రచాపంపుఁ దోరణ మింపుఁగులుకఁ
గారుమెఱుఁగులు నెల్లెడఁ గడలుకొనఁగ
వెడలె స్వాతంత్ర్యరథము విన్వీధియందు.

జలధరమాలఁ జీల్చికొని, స్యందనకాంతి నభోంతరాళ ము
జ్జ్వలితముచేసి, యంధతమసంబులు వాఱిన మూలలైన శో
భల ననలెత్తఁజేయుచుఁ బ్రభాతవిభాకర బింబమట్లు సొం
పిలుచు నవీనజీవనము వింతగ నింపె సమస్తసృష్టిలోన్.

ఆరథమందు దీప్తిమయమై కనుపట్టె నిజప్రభావ దు
ర్వారపవిత్రమూర్తి కనుపండువు సేయుచు, ధర్మజీవనా
కారమొ! శాంతిబింబమొ! యకల్మష సత్యనికేతనంబొ! సం
సారఫలస్వరూపమొ! ప్రజాహృదయంబొ! యనన్ వెలుంగుచున్

ఒకచేతను రుధిరంపుఁ బాత్రమును, వేఱొక్కంటఁ బీయూష పాత్రికయుం గైకొని సభ్యతామిషమునను దేశంబులందెల్ల నింతకు ధర్మంబులు గాఁగ నెన్నఁబడు నన్యాయంబు లీనాఁటితో వికలంబై చనుఁగాక యంచుఁ గరుణావేశమ్ము దీపింపఁగన్.

పచ్చినెత్తురు నమృతంపుఁ బాత్రఁబోసి
దివ్యదుగ్ధంబుగా మార్చె దేవిమహిమ,
హాలహాలగర్భమందైన నమృతరసము
సంభవించు నటం చిలఁ జాటనేమొ!

నిలువను స్యందనంబు ధరణీపతిపాలన దండభీతిచే, నిలువ దనాథబాష్పములు నిల్చిన పల్లపునేల, మోసగింపుల మఱపించు కిర్రించుఁదనపుం జతురాత్ముల కాఁగఁబో దనర్గళజవమొప్ప నేఁగెడిని గన్నులకుం గనరాని చోటికిన్.

పూర్వసింహాసనంబులు, ప్రోజ్జలంపు
మణిమయ కిరీటములు భోగమందిరములు
చక్రిసంఘర్షణంబునఁ జదిసిపోయి
యవి యివి యనంగరాక రూపఱెడు నేఁడు.

లేవు దివ్యతురంగముల్, లేవు కరులు,
ప్రజలె యా తేరుమోకులఁ బట్టువారు;
వాయుజవమునఁ దారకాధ్వమున నేఁగు
నంతరాయశతంబులనైన దాఁటి.

తేరుజాడల నెత్తురు పాఱిపాఱి
బంగరుంబంటఁ బండించె బక్క నేలఁ;
జక్రనేములు దాఁకిన స్థలములెల్ల
సస్యలక్ష్మికిఁ గళ్యాణశాల లయ్యె.

స్యందనాసీన యగుదేవి 'శాంతి శాంతి'
యనుచు మంజులగానమ్ము నలరఁజేసి,
నవ్యనక్షత్ర వీణాస్వనమ్ములందు
మేళవించెను జనులు విస్మితులు గాఁగ.

ప్రణయాహ్వానము.

చెలియా, వెన్నెలబైల మంచుతడిఁ బూచీపూవకున్నట్టి పువ్వులనెత్తావులు మోచిమోచి నిడియూర్పులోర్వవు నుద్యానకోమల మందానిలపోతముల్ మనల సమ్మానింప వాతాయనంబుల డాయఁజని ముద్దుఁగౌఁగిలి సుఖంబుంగూర్చి సేవించెడిన్.

చదలుపందిట వెన్నెలజాజితీవఁ
జుక్కలను పూలుపూచి యో సుందరాంగి,
ప్రణయమోహనమైన యీ ప్రకృతినెల్ల
సురభిళోచ్ఛ్వాస వీచుల సొగయనూఁచు.

పరిసరోద్యానమునఁ జూతవాటియందుఁ
గలరవంబులు సల్పి పికద్వయంబు
నిస్తరంగ సరస్సటు నెగడురాత్రి
గర్భ నిశ్శబ్దతకును భంగంబుఁగొల్పు.

చంద్రికాముగ్ధ శర్వరీఛాయలందు
జీవలోకంబు సుఖసుప్తిఁ జెందుచుండఁ,
గవిమనంబును బ్రకృతియుఁ గలయుచుండఁ,
బోదమా కాంత, సెలయేటి పొదలదరికి?

పులుఁగులు గూళులం జెదరిపోయిన టెక్కలనొత్తికొంచు గొం
తులను బరస్పరంబు బిగితోఁ బెనవైచెడివేళ, నెప్పుడుం
దెలుపని హృద్రహస్యములఁ దిన్నగ వీనుల విందు సేయ నాఁ
జెలి, సెలయేటి సైకతముఁ జేరుదమా మన కేలియాఁతలన్?

జిలిబిలి కమ్మగానములు చేసెడి యాసెలయేటి యొడ్డునన్
బులకల విస్తరిల్లి నునుఁబోడిమిఁ జూపెడు నీదు బుగ్గలన్
దొలఁకెడి సిగ్గుడాలుఁ గడదోఁపని ముద్దులఁ గుమ్మరించి యా
వ్వల మధురోక్తులం గడగివైచెదఁ గోమలి, రమ్ము మెల్లగన్.

కొండవీడు.

సాంధ్యరాగాంకితాంభోద శకలచయము
లనెడి కీలల నిర్మగ్నుఁ డయ్యె నినుఁడు;
శర్వరీకాంత కుంతలచ్ఛాయ లంత
నెలవుకొనె విషాదపు రామణీయకంబు.

కొండవీటి దుర్గంబునకు సమీప
మున నొకానొక కేదారమునఁ గృషీవ
లార్భకుండు దున్నుచుండి సూర్యాస్తమయము
గాఁగఁ దలపోయుచుండె నాగలిని విప్ప.

ఇటుతలపోసి, పూనుకొను నెద్దుల నిల్పఁగ మేడి నూనినం
తట మొనకఱ్ఱు లోఁదవిలి ధారుణిఁ జీల్పఁగ నందు వెండిసం
పుట మఱు పుర్రె పైకుబుక భూతమటంచును గేకవైచి యు
చ్చుటఁ బనిసేయుతండ్రిఁ దనచక్కికి రాఁబిలిచెన్ భయంబునన్.

తనయుని వెఱ్ఱికేకలకుఁ దందరలాడుచు వృద్ధుఁ 'డేమిరా?'
యని పరుగెత్త సీరపథమందునఁ బుర్రనుజూపి బాలకుం
డను: 'నిదియేమితండ్రి? తలయాకృతిగల్గిన రాయి దున్నుచుం
డిన వసుధార్ద్రగర్భము వడి న్వెడలెం గనుఁగొమ్ము' నావుడున్:

కృషికుఁ డంతటఁ బుడ్కను గేలనెత్తి
యశ్రుధారాభిషేకంబు నాచరించి,
భయమునను సంభ్రమంబునఁ బెబికికున్న
తనయునిం గాంచి గద్గదధ్వని వచించె:

'మాతృదేశపరాయణ మానసులయి
సలిపి రిచ్చోట రెడ్డివీరులు రణంబు;
కత్తిగంట్ల నమూల్యరక్తంబు దొరఁగి
కీర్తివల్లిక పాదు క్రిక్కిఱిసి నిండ.

'శ్యామలాకాశవీధి నక్షత్రము లటు
కాలవాహినీతటములఁ గానిపించు
రెడ్డివీరకుమార చరిత్రపాద
చిహ్నములు, మృతశౌర్యంబు చివురువెట్ట.

'అరివీరుల్, పులిగర్జలన్ విని కురంగానీకముల్ కాననాం
తరముం జొచ్చెడుపోలికన్ రణమునన్ ధైర్యంబువోనాడి యే
డ్తెఱఁ బర్వన్, భుజవిక్రమంబు బలమున్ దీపింపఁ బోరాడి కీ
ర్తి రమం గాంచి ధరిత్రిగర్భమున శాంతింబొందువారల్ నృపుల్

'అట్టిశూరాగ్రగణ్యులయందు నొక్క
పురుషశిరముగఁ దోఁచు నీపుఱ్ఱ తనయ,
దీని వీక్షించినంతనే స్తిమితమైన
నాదు రక్తంబు సైత ముష్ణముగఁ బాఱు.'

అనవిని బాలకుండు, 'జనకా, మనవారలెవారు? వారికిన్
మనకును బూర్వ మెన్నఁడయినం గలచుట్టఱికంబుఁ దెల్పుమా'
యనఁ, దలయూఁచి వృద్ధుఁడు: 'దిగస్తములన్నులమయ్యెఁ జీఁకటుల్
మనము గృహంబు సేరునెడ మార్గమునన్ వచియింతునంతయున్'

అని యెద్దులఁ బోఁదోలుచుఁ
దనయుండును దాను నింటిదారి నడచుచున్
మును గొండవీటి నేలిన
జనవంద్యుల రెడ్ల పూర్వచరితలు వినిచెన్.

'పూర్వవీరుల ధమనులఁ బొంగినట్టి
రక్తపూరంబె మనలోనఁ బ్రజ్వరిల్లుఁ
గాని, కాలభరంబునఁ గండలెల్ల
శాంతకర్షకవృత్తి దాస్యమునఁ దవిలె.

కత్తికి నష్టులేక రిపు ఖండనలీలల నారితేరి భూ
పోత్తములన్ యశంబు గని యుర్విని బాలనచేసినట్టి రె
డ్ల తతి సీరచోదకపు వృత్తి గ్రహించిరి; పోటుకత్తులన్
నెత్తుటఁ ద్రుప్పుపట్టి చెడనే చెడె శూరత యంతరించుటన్!

'పరవీరావళి హృత్పుటంబులను జీల్పన్ శక్తిమంతంబులై
దురమందున్ మెఱుపట్లు శోభిలిన కత్తుల్ నేఁడు దూరాంతర
స్ఫురణన్ సీరములందుఁ గఱ్ఱులుగ నేపున్ సొంపుచో నాడి యీ
ధరణీగర్భముఁ జీల్చుచున్నయవి శాంతప్రక్రియం గోరుచున్!

'ఒక్క క్షణంబునన్ గగన ముల్లసితంబుగఁ జేసి యుల్క వే
ఱొక్కక్షణంబులో మఱుఁగునోజగ రెడ్ల ప్రతాపవహ్ని న
ల్దిక్కులనిండి యాంధ్రమహి తేజము నిమ్మడిచేసి, మోసపుం
డకుక్క లెఱుంగకుంట నకటా! యలకత్తులబాఁపెఁ జెన్నతన్.

ఇటులఁ జెప్పెడినంతలో నిల్లుసేరి
యెద్దులను దొడ్డిదోలిరి యిరువు రపుడు;
కొడుకు మనమున నిసియెల్లఁ గొండవీటి
స్వప్నమేతప్ప మఱియొండు స్మరణలేదు.

కవితాప్రణయిని.

'సరస కవిత్వశారద, నిశాముఖమందు సుధాంశుమండలీ
కిరణతతుల్ శరజ్జలదకీర్ణములై మెలమెల్ల దిక్కులన్
నెఱసెడి రాత్రివేళ రమణీయ సముజ్జ్వల తారకావళీ
భరిత నభంపుఛాయలఁ గృపామతిఁ జేరవె నన్నుఁ జూడఁగన్?

'కలయన్ స్వర్గమునందు నీవు రుచిరాకారంబు వీక్షించి చం
చలమై ద్రిమ్మరు నామనంబు నినుఁ గాంచం గ్రన్నఁ గోమలీ,
కలకంఠంబులు గూసినం, గిసలయాగ్రంబుల్ పిసాళించినన్,
వలపుం జల్లెడిపూవు పూచినను నీ నామంబె చింతింతుమున్.

'పల్లవకోమలంబులగు పాదము లీవలమోట్టుచుండు నా
చల్లనిచప్పుడుల్ హృదయ సంచలనంబుల శబ్దముల్లు రం
జిల్లఁగఁ జేయునుల్లమును; సిగ్గు నా ప్రణయంబుఁ జెప్పికోఁ
బల్లవపాణి, నీకృపకుఁ బాత్రుఁడనంచుఁ దలంచి వేఁడెదన్.

'తళుకున్ బంగరుకేటి సైకతములం దావుల్ గుబాళించు పూ
వులగుత్తుల్, వెదచల్లు పుష్పాదులసొంపుం జిల్కు నీపాదచి
హ్నాల వీక్షించి ప్రమోదబాష్ప సలిలస్నాతంబులం జేసి ము
ద్దులు వర్షించితిఁ జంచలాక్షి,మదియందుం బ్రేమ చిప్పిల్లఁగన్.

'నీవు వసియించునీచటకు నేనుగూడ
వచ్చెదను వేగఁ గొనిపొమ్ము వలపులాఁడి,
శీతలామృతవర్షంబుఁ జిందు నీదు
సరస వీక్షా ప్రసాద భిక్షంబు నెట్టి.'

అని యువకుండుపల్క విని, యాకవితాలలితాంగి ముద్దు మోమునఁ జిఱునవ్వుదొంతరలు పొంపిరివోవఁగఁ బాణిపల్లవంబున వలిపంపుఁబయ్యెదను బొల్పుగనొత్తుచుఁగాలియందె ఘుల్లని రవళింప నేలపయి నల్లనఁ దా బొటవ్రేలు రాచుచున్:

వలపుల తేనెతుంపరలఁ బచ్చనిమోసులనెత్తు చిత్తపుం
గలఁతను దోఁపనీక కలకంఠమునా వచియించె: 'మోహనా,
పలికెదవోయి నీప్రణయబంధము; నెవ్వఁడవీవు? స్వర్గపుం
గాలముల సంచరించు మముబోఁటుల సంగతిఁ గోరివచ్చితే?

'నాదు బహిరాకృతిఁ గని యానందవార్ధి
నోలలాడిన వారెందరో గలారు
గాని, యెడలేని ప్రేమ శృంఖలలఁ జిక్కి
నామనముఁగొన్న ప్రియులు గానంగ నరుదు.

'అవనిపై సంచరించు నీవంటివారు
దివ్య నక్షత్రమండలిఁ దిరుగఁగలరె?
అందరానిఫలంబుల కాసయేల?
పొమ్ము, ననుఁబోలువారు మీభూమిఁ గలరు.'

అనవిని, యా యువకుఁడు 'కా
మిని, యిట్టులఁ ద్రోసిపుచ్చ మేలే? నీకై
యనురాగవశత నెట్టుల
దినములు గడిపితినో దానిఁ దెలిపెద వినుమా.

'అప్పుడైన నీహృదయంబు నందుఁ గొంత
నెనరు గల్గి నన్నేలెదో చనవులాడి,
వినియు నీప్రేమకుం దగ ననుచు భ్రుకుటి
భంగమాత్ర నసమ్మతిఁ బయలుపఱతొ.

'కవితాకోమలి, నీమనం బిడక యాకారంబుఁ గాన్పించి కై
తవలీలల్ పచరించి నాప్రణయగంధమ్మున్ వృథాపుచ్చెదే?
యువకుండ న్మధురార్ద్రచిత్తుఁడను స్నేహోల్లాసధుర్యుండఁ బ్రా
భవకాంక్షిన్ ననుమోసగించి యరుగన్ భావించితే నిర్దయా?

'ప్రత్యుషస్సుల నూత్నపత్రములు విచ్చి
విమల హిమబిందువులు రాల్చు సుమ వితతుల
తోడఁ బ్రమదాశ్రువులు వీడి పాడుచుందుఁ
గలికి, నీమనం బంటెడు గానములను.

'సందెమబ్బుల చిఱువేరు చాయదీసి
పండువెన్నెల పసరునఁ బదనుచేసి
తరుణి, నీపట్టు ముసుఁగు నద్దకము వైవ
విఫల యత్నంబులం జల్పి వెఱ్ఱినైతి.

'పారిజాతపుష్పంబులు పవనహతిని
మృదులతృణముల రాలెడునెడల, నీదు
చరణవిన్యాస కోమల శబ్దమనుచు
నడుగుగుర్తులఁ బలుమాఱు నరయుచుందు.

'సాలెగూళ్ళల ముత్తెంపు సరములటుల
లేఁతగాలికి నల్లఁ జలించు మంచు
నీటిబొట్ల మాలనుగట్టి నీదుమెడను
వైవఁ దలపోసి యెగతాళిపడితి చెలియ.

'గాఢ నిశ్శబ్ద శర్వరి గగనమందు
నీవు పలికించు పల్లకీ నినదములను
వినుచుఁ బ్రమదాశ్రుపూరంబు కనులఁ దొరఁగఁ
గాంచుచుందు గభీర నక్షత్రవీథి.

'వలపులు పండుపండమికి వందురు చుండెదు చిత్తమందు నె
త్రు లొలుక నష్ఠుమాటలను తూపుల నొంచెదె యాత్మహత్యకుం
దలకొన దారిఁ జూపెదవె? ధర్మమె నమ్మినవాని మోసగిం
పుల వలయించి చంప? నినుబోఁటికి నింతటి క్రూరచిత్తమే!

'గ్రామవాసిని, ఎఱుఁగను కైతవంబు,
ప్రకృతి తల్లి స్తన్యంబునఁ బ్రబలినాఁడ,
పొలముల విహరించుచుఁ బ్రొద్దుఁ బుచ్చుచుందు,
నట్టి నాముద్దువలపును నరయలేవె?'

అని యువకుండు పల్కఁగ నసార్ద్రమనంబున రేఁగుభావముల్
దొనికెను బాహ్యరూపములతోననఁ బ్రార్థన కొప్పికోలుగాఁ
జనపు మెయిక మృణాలసదృశంబగు బాహువులెత్తి ప్రేయసుం
దన కవుఁగింటనొత్తెఁ గవితా లలితాంగి విముగ్ధచిత్తయై.

ద్రౌపదీసందేశము.

సంజయా, యింకఁ జాలు నీశాంతిమార్గ,
మడవిఁ బడరాని యిడుమలఁ బడితిమయ్య;
బోధలొనరించి హక్కులఁ బులిమిపుచ్చ
నిన్నుఁబంపెనె కురురాజు నేర్పుతోడ.?

నగచినట్లుండవలయును, వాని యాలి
త్రాడు తెగవలెనున్న విధాన నీవు
పూర్వకష్టంబులకు సానుభూతి చూపి
తేనెపూసిన కత్తిని దింపఁదలఁతె.

కపటమార్గంబులం బన్ని కనుల మూసి
రాజ్యభాగంబుకొన్న ధైర్యంబు కతన
నేఁడు సైతము మాటల నిద్రపుచ్చి
వనికి వెడలింపఁ గుట్రలు పన్నువారె?

మున్నటి దినాలు గావివి, మోసములకుఁ
దవిలి తలయూఁచునే నేఁడు ధర్మరాజు?
పరిభవానల కీలలు పాండుసుతుల
హృదయముల రగిలింపవే రేపుమాపు?

నను సభలోని కీడిచి, కన న్వినరాని పరాభవంబుచే
సినఁ గనులారఁ గాంచియు నిసీ! పతులేవురు ధర్మబద్ధులై
మును పగఁదీర్పకుంటఁ గురుభూపతి మమ్ములఁ జుల్కనాడెనం
టు! నిరతమొక్కరీతిఁ జనునా మనకాలము సంజయా, యెటుల్?

అంతంబొందెనె పాండుపుత్ర దృఢబాహాశక్తి రోషంబు? దు
ర్దాంత ప్రక్రియ వైరివీరమథన ప్రారంభ కౌతూహల
స్వాంతుల్శాంతులుగారు, కాలమెపుడో వచ్చుంగదా యంచు న
త్యంతాసక్తిఁ బ్రతీక్షచేసెదరు శౌర్యాలంబులౌ మత్సుతుల్.

రాయబారంబులేల యీరచ్చలేల?
పాలుఁగొనక శాంతింతురే పాండుసుతులు?
ఊరకిమ్మన్న నిచ్చునా యుర్వి నృపుఁడు?
పిల్లిశాపంబులకు నుట్లు ప్రిదిలి పడునె?

తెలుపుము సంజయా, విరటుధేనువులం బరిముట్టువేళ ను
జ్జ్వలభుజవిక్రమముల్ కురునృపాలవరుల్ చవిగొన్న పార్థుతూ
పుల దొనలింక రిత్తవడిపోవవు; గాండివి చిత్తమట్ల వై
రుల రుధిరంబుఁజూఱఁగొన రోషముఁ గ్రుక్కి శరంబులేనియున్.

రాజ్య మేనాఁటికిని వీరభోజ్యమనుచు
జనులు పల్కెడిమాట నిశ్చయము సుమ్ము,
పరమసుఖములఁ దులదూఁగు నరవరుండు
పిలిచి రాజ్యంబులిచ్చునే భిక్షుకులకు?

బొల్లి మొగాలపైఁ జెమటబొట్టులు గ్రమ్మ నురక్షతంబులన్
బెల్లుగ నెత్తురోడికలు పేర్చఁగ మిమ్ము పృథాసుతుండు వి
ద్యుల్లతికాభ బాణములఁ దూల నదల్చి వధించుదాఁక మీ
యుల్లము రాజ్యభాగమున కొప్పునొయొప్పదొ సూతనందనా.

వైగ విభీషణాకృతిని వాయుసుతుండు గదన్ ధరించి దు
ర్వార మదేభ మృగ్యునిపైఁ బడురీతిఁ గురూర్వనాథులం
బేరు దలంపరానియటు పీచుఁగుపెంటలు సేయునప్పుడై
నా రవమేని నెంతురె మనంబునఁ బాండుతనూజశౌర్యమున్?

కవలనఁ బిల్లవారలటుగాఁ దలపోయుదు రేమొ! మీ పయిం
గవిసిన యప్డె వారి భుజగర్వము శౌర్యముగానవచ్చు; మ
బ్బు విడిచివచ్చుసూర్యుని సముజ్జ్వల తేజమునాఁగఁ జూడఁగా
నెవరును జాలరయ్య రణమేడ్తెఱ సల్పెడి బాలవీరులన్.

ఉత్తమాటలనేమి ప్రయోజనంబు?
అవని యొసఁగుటో, లేకున్న నని సలుపుటో
చెప్పిపంపుఁడు; నా మేన జీవమున్న
దనుక సంధియత్నంబులు దలఁగుఁడయ్య.

దుర్యోధనుఁడు.

రాజరాజ దుర్యోధనా, రాజ్యలక్ష్మి
నట్టనడియేటియందు నీపుట్టిముంచె
నయ్య, విధి తిరస్కారంపు టవధివోలె
నీకు నంత్యపతన మింత నీచమగునె!

ఏలితి వీ ధరావలయ మెంతటివీరుల కేని గుండెలో
గాలముగాఁగ, వైరిబలగంబులకున్ యమదర్శనంబుగన్;
పాలకుఁ బోరువెట్టు పసిపాపలు 'వచ్చెను రాజరాజ' నన్
డోలిక నిద్రవోదురు కడున్వెఱపెత్తఁగఁ బేరువిన్కలిన్.

ఎఱుఁగవె భీతియన్న 'నదియెట్టుల నుండు' నటంచుఁ బల్కు నీ
వెఱవమి,విక్రమక్రమము, వీర్యము నెక్కడపోయెనోయి? యా
సరసున డాఁగినాఁడవు? విచారము లేదె? యశంబుకన్న న
శ్వరమగు ప్రాణముల్ మధురసంబులె? భారతకీర్తి నెంచవే?

హృదయముఁ గోసియిమ్మనినఁ బ్రీతిగ నిచ్చెడు ప్రాణమిత్రుఁడే
యదవదలేక నీకయి రణావనిఁ గూలిన కర్ణయోధ నీ
మదిఁ బొడకట్టఁడే? యిటుల మాన్యతఁ బోవిడి తుచ్ఛజీవముం
బదిలము సేయనేల నరపాలక, వంశయశంబు నెంచుమా.

ఎంతకాలంబు బ్రతికిన నెప్పుడైన
మరణమొందక మానఁడు మానవుండు;
క్షత్రియుఁడు వ్యాధిబాధలఁ జచ్చుకన్నఁ
గత్తిపోటుల మడయుటే కరముప్రియము.

సాటిలేని విరోధులఁ జదిపినట్టి
పరభయంకర గద చేతఁ బట్టినావు;
లెమ్ము లెమ్ము, దుర్యోధనా, లెమ్ము లెమ్ము
క్షత్రియత్వము రూపింప శక్తిలేదె?

ప్రవహింపదే నీదు రక్తనాళంబులఁ
బూర్వుల శోణితపూర మిపుడు?
ప్రజ్వలింపదె నీదు భావకుండంబున
నవమానరోష హోమానలంబు?

తీఱెనె నేఁటితో దిక్కులవిలసిల్లు
భారత క్షత్రియ వంశకీర్తి?
గొడ్డువోయెనె నేఁడు కురురాజ్ఞి గాంధారి
కదనవీరశతంబుఁ గన్నతల్లి?
లెమ్ము, దుర్యోధనా, యింక లెమ్ము లెమ్ము,
సరసితటమున నున్నారు సమరకాంక్షు
లైన పాండవేయులును మురాంతకుండు;
ప్రాణములపైన మోహంబు వదలుమయ్య.

ప్రాణమిత్రుండు కర్ణుండు స్వర్గమేఁగె;
నంపశయ్యను గాంగేయుఁ డస్తమించెఁ;
కొడుకులును దమ్ములునుగూడఁ గూలినారు;
అంత యభిమానమే దేహమందు రాజ?

గెలిచితివా యకల్మషపుఁగీర్తియురాజ్యమునబ్బుఁ, బ్రాణముల్
దొలఁగితివా నిలింపపురి తోఁటలలో విహరింతువయ్య; శూ
రులకు రణంబు పండువు; విరోధుల గీటడగించి సర్వభూ
వలయము నైనఁ జావయిన భారతరాజ్యగ్రహింపు మిత్తఱిన్.

రాధయుత్కంఠ.

చల్లని పన్నీట జలకంబులాడి
యగరుధూపము వెట్టి యలకంబులార్చి
నుదుటఁ గస్తురి బొట్టు కుదుటుగాఁదీర్చి
కన్నుఁదమ్ములఁ గ్రొత్త కాటుక దిద్ది
గోరంటపూగుత్తి కొప్పునఁ దురిమి
కమ్మతావులనీను కలపంబునలఁది
పొడికప్పురంబులఁ బడకింటఁ జల్లి
పాన్పుపైఁ బువ్వులు పఱపుగాఁ బఱచి
యేలరాఁడో సామి యింకేలరాఁడొ
యనుచుఁ బోరము నానుకొని వేచియుంటి.

* * *

స్వాంత మాలస్యంబు సైరింపలేక
వేదనాభరమున వ్రీలంగఁజొచ్చెఁ
గనికని దారులు కన్నులు నొచ్చె
నాసామి కృష్ణుండు ననుఁ గాంచరాఁడు.

* * *

సంజకెంజాయలు శమియించిపోయెఁ

బక్షులు గూళ్ళకుఁ బరుగిడసాగె
మందల కాపులు మరలిపోయెడిని
వేణుగానంబులు వీనులసోఁకె
కోయిల క్రొమ్మావి గుబురులోఁ గూసె
సందెచీఁకటి పొగ చదలావరించెఁ
జుక్కల రసగుండ్ల జొంపంబు లలరె
నేలరాఁడో కృష్ణుఁ డింకేల రాఁడో!

* * *

కప్పురపుం దివ్వె కడముట్టవెల్గె
బాన్పుపైఁ బువ్వులు వసివాళ్ళువాడె
మంచిగందపుఁబూఁత మైఁ జిట్లిపోయె
నిద్రమాంద్యమ్మున నేత్రము ల్మాగెడెఁ
బడమటి దెసకేఁగు నుడు గణంబులను
గనుచు ద్వారముకడఁ గన్నుగూర్కితిని.

* * *

నాసిగ్గు పుచ్చంగ నలిన బాంధవుఁడు
వెయ్యి దివ్వెలతోడ వెలుఁగుచు వచ్చె.

* * *

కూర్కులేమిని గన్నుఁగొన లెఱ్ఱవాఱ
బొరలుచిట్టిన మేనిపూఁతలు రాలఁ
జెమ్మట ముత్యాలు చెక్కిళ్ళజాఱ

ఘల్లుఘల్లని చేతిగాజులు మ్రోయ
మజ్జిగ జిల్కుచు మధురగీతములఁ
గాంతుఁ డొనర్చిన కఠినంపుఁ జేఁతఁ
దుమ్మెద పైఁ బెట్టి దూఱుచునుండ
నాముద్దు కృష్ణుండు నావెనుక నిలిచి
ముసిముసి నవ్వుల మురియుచునుండె.

*   *   *

వేచియుండిన యప్డు విభుఁడరుదేఁడు,
వేసవివానల విధముగా నతఁడు
కలవలె వచ్చును గనిపించిపోవు.

ఎంత మోసము!

బాటసారి

చీలుదారులఁ గూర్చుండి చిన్నదాన,
కన్నులను నీరు నించెదు కరుణమొలుక,
నేపథంబున నేఁగ నీ కిచ్చ గలదు?
ఇరులు గ్రమ్మకమున్నె నిన్నిల్లు సేర్తు.

చెట్లనీడలు విరివియై చేరెఁ దూర్పు;
సంజకెంజాయ పడమటఁ జక్కనలమెఁ;
బైరుకోఁతల కేఁగిన పల్లెపడుచు
లింటి కరుగుచుఁ బాడువా రేలపాట.

గాలితాఁకున వెన్నులు కదలునపుడు,
తిరుగఁ బాఱిన వరిచేలు తీయు రాగ
మదిగో! వినఁబడుచున్నది, యలల మర్మ
రములు సంధ్యా ప్రశాంతగర్భమునఁ బోలె.

యువతి

గోపికామోహనుఁడు నందగోపసుతుఁడు
వచ్చు నీదారి నని సఖి పలుక వింటిఁ;
బ్రొద్దువొడుపున నుండి యీపొన్నక్రింద
వేచి వేచి యీదారులు చూచుచుంటి.

రత్నఖచిత కిరీటంబు రాజుశిరము
నందు వెలుఁగొందుచుండు నటంచు వింటిఁ,
బట్టుపీతాంబరము వల్లెవాటువైచి
మత్తకరి నెక్కి వచ్చు నన్మాట వింటి.

బాటసారి

చిన్నికృష్ణుని సేవింపఁ బొన్నక్రింద
వేచియున్నావె? నీముందు వెళ్ళినట్టి
వేణుధారినిఁ గాంచవే? విశ్వమోహ
నంపుగానంబు వినవె యో నళినవదన?

నెమ్మిపించెము క్రొమ్ముడిఁ జిమ్మజిగులు
చిన్నికూఁకట్లు మెడపైనఁ జిందులాడు
బొజ్జనటికును వ్రేలు క్రొంబూలమాల
యతని పదశబ్దముల ఛంద మమరుచుండు.

ఆమహాత్ముచ్ఛాయలు సోఁకినంతమాత్ర
జీర్ణ తరు లతావళికూడఁ జివురు వెట్టు;
ఆ మురళి మోహనారావ మలరినంత
రెల్లుపుల్లల సైతము రేఁగు గీతి.

యు వ తి

ఇపుడు స్మృతియందు నావ్యక్తి మెసఁగుచుండు
భగ్నమైన యింద్రధనుస్సువగిది నహహా!
యెగిరిపోయెడు కలయట్టు లీక్షణముల
నాఁటి యింద్రజాల మదృశ్యమయ్యె నపుడె!

వేణుగానంబు దేనినో విన్నయట్లై
దోఁచుచున్నది, దూరానఁ దోయదములఁ
దారకావీణ లొనరించు ధ్వను లనంగ;
నెంతమోసంబు జరిగెనోయీ సఖుండ!

బా ట సా రి

అదియె తెలియరాని విచిత్ర మతివమిన్న.

అజ్ఞాతకవి.

క్రిసలయగుచ్ఛమధ్యములఁ గీల్కొని నే దినకాంతిఁగాంచలే
నిసి! యని మంచుబాష్పముల నేడ్చు సుమంబటు సత్కవీశ, క
ర్కశ పడనేల? తావిఁగొనుగాడ్పులరీతి విమర్శకుల్ కృతిన్
రసముఁగ్రహించి నీయశము రాజిలఁజేయుదురయ్య యెల్లెడన్.

పొలుపుగ రేపవల్ నిలువఁబోక మనోజ్ఞ నిసర్గగానముల్
సలిపెడు నిర్ఝరంబ, గిరిసానుతటంబున నిన్ను నెవ్వరుం
దలఁప రటంచు నొంచెదవొ, తాలిమినూనుము బాటసారి నీ
కలరవ మాధురీమహిమఁ గాంచి నినుం బ్రకటించు నిద్ధరన్.

డాఁగియుండు వసంతంబు డాయుదనుక
వేఱ ప్రకటన నీకేల వినుమ పికమ,
స్వర్గగానంబు భూతలస్థంబుచేయు
నీ పికస్వరకంఠంబు నెగడుచుండ?

ఓరి బాలక, నీమురళీరవంబు
వ్యర్థమౌనని చిత్తతాపంబువలదు,
రాగపరిచితుఁ డెవ్వఁడో రమ్యగీతి
వినియెయుండు నానందంబు వెల్లివిరియ.

ముసలిమాలెత.

మిడిమిడి యెండ సోలుచు శమింపని తాపముతోడ నూరుపుల్
వెడలఁగ డొల్లలై కడుపు వెన్నుముకం గర మంటియుండఁగన్
బుడిబుడి మిట్టపల్లములఁ బూనికఁ గాలిడఁబోయి తొట్రిలం
బడుచు గతి శ్రమన్ ముసలిమాలెత వచ్చుచునుండె నొంటిగన్.

కాల కఠోరసీర మలికంబను ధారుణిదున్న లోఁతుగం
జాళులు వాఱెనా వళులుసాగి శ్రమాంబులు పిక్కటిల్లి, స్వే
తాలక వృత్తముల్ నొసలి కావలనీవల వ్రేల నందు ము
త్యాలవిధంబునం దొరఁగు నాముదివగ్గు తలం జలింపఁగన్.

ఒంటిపూఁటైన నాఁకటిమంట దీఱఁ
గుడువ నొక కడియన్నంబు గూడకున్కి
నస్థిపంజరమైన దేహంబుగూడ
మోవలేదన సోలును ముసలియవ్వ.

దారిద్ర్యదేవత తనరూపు గనుపింప
వగ్గువాలకమూని వచ్చెనో కో!
భేతాళునాజ్ఞ గావించు పిశాచంబు
పీనుఁగు నొడలితో వెడలెనో కో!
స్వార్థ పరస్వాంతుఁడౌ రాజుచేఁ బడి
లావుదూలిన దేశలక్ష్మి యొకో!
సకలవస్తు ప్రదర్శన శాలలో నిడ్డ
ముదిమి యవధిఁదెల్పు మూర్తియొకో!
యనఁగఁ జేయూఁతకఱ్ఱను నవనినూని
నడువఁజాలక తడఁబడి యడుగులిడుచు
నెండవేఁడికి మేనెల్ల నెరయుచుండఁ
జెట్టునీడకుఁ దానల్లఁ జేరవచ్చి;

నను నచ్చోటనుగాంచి, కూలఁబడి ప్రాణంబుల్ వెలింబాఱునో
యన నిశ్చేష్టతనుండి తేఱి కడుదాహంబెత్తె నీరమ్ముఁ దె
మ్మను నర్థంబుగ దోసిలిం బెదవి డాయంబట్టి చూపింప నం
తనె తద్భావమెఱింగి తాళదళపాత్రంబందు శీతాంబువుల్,

కొని తెచ్చి యీయఁ బెనుదగ
తనియంగాఁ ద్రావి యలఁత దఱిగినపిదపన్
నను దీనదృష్టిఁ గనుఁగొని
వినయముతో నిట్టులనియె వృద్ధాంగనయున్:

'నోటఁదడిలేక మాటాడుదీటులేక
గాసివడియున్న ననుఁగాంచి కనికరమున
నీరు తాగించి ప్రాణంబు నిలిపినట్టి
నిన్ను నేమని పొగడుదుఁ గన్నతండ్రి!'

అని కృతజ్ఞతాసౌరభ మార్ద్రవచన
కుసుమములఁ జల్ల, నేనును గుతుకమొంది
యవ్వచరితంబుఁ గనుఁగొను నాసతోడ
నిట్టులంటిని నాదరం బుట్టిపడఁగ:

'ఎవ్వరిదాన వీవు? మఱియిచ్చటికిం జనుదెంచుటేల? నీ
కెవ్వరు చుట్టపక్కము? లిఁకెయ్యెడకుం జననిచ్చగల్గె నో
యవ్వ? సమస్తముం దెలుపుమా' యనఁ గన్నుల బాష్పపూరముల్
నివ్వటిలంగ నాత్మకథ నిట్టనఁ దెల్పెను గద్గదోక్తులన్:

'పడమటి మెట్టదేశములఁ బైరులు పంటలు వానలేమికిన్
వడఁబడి యెండి కాటకమువచ్చిన సన్నజనంబు మంటలం
బడియెడి దోమగుంపటుల మాడి దినంబున కొక్కసారియున్
గడికబళంబు లేక కడుకష్టము నొందుచు నుండి రచ్చటన్.

'డెల్టాభూములఁ బైరులు
గలవని యచ్చోటిజనులు కౌతుకపడుచున్
వలసలువచ్చిరి ప్రాణం
బులు నిలువంబెట్టు నాస పొంపిరివోవన్.

'నాకూఁతురు నాకొడుకును
నాఁకలి యెట్టిదియొ యెఱుఁగనట్టుల నన్నున్
సాఁకుచునుండిరి వేళకు
ఆకో అంబలియొ గలుగునంతకు నిడుచున్.

'ముసలితనమునందు ముప్పతిప్పలుగల్గెఁ
దమ్మిచూలివ్రాలు వమ్ముపడునె?
కొడుకుఁగూఁతు మొన్నఁ గ్రొత్తజ్వరంబుల
వాతఁబెట్టి నేన బ్రతికియుంటి.

'పండుటాకులురాల్పక పసరులొలుకు
పిన్నకనటల వెదకెఁ బాపిష్టిబ్రహ్మ!
ముసలిముదుకకు సంజీవి మెసవఁబెట్టి
విసముఁ దినఁబెట్టెఁ బ్రాయంపుఁ బిల్లలకును!

'క్రుంగువేరు దెగియుఁ గూలని ముదిచెట్టు
పగిది నయ్యొ నాదు బ్రతుకదేమొ!
యెవరికొఱకు మనుదు నిఁకమీఁద నిలలోన?
భారభూతమైన ప్రాణమేల?'

అనుచుం బట్టిన నిల్పరాని వెత యాస్యంబందుఁ దొలఁకాడ దృష్టి నిరోధంబొనరించు బాష్పకణముల్ చెక్కుళ్ళపై జాఱ, పండిన కేశంబులు వాయుతాడితములై నీరంధ్ర ఘర్మాంబు సేచనముం బొందఁగ నార్తమూర్తియయి సంస్తంభించియున్నంతటన్

వృద్ధనారి దైన్య మీక్షించి మద్హృద
యాబ్జమొలికెఁ గరుణ మనెడు మధువు;
ఆర్ద్రహృదయమునకు నార్తభావమునకు
నెట్టిపరిచయంబు లెసఁగియున్నొ!

అవ్వ కొంతసేపు నట్టులే కూర్చుండి
యేమితలఁచెనేమొ యేఁగునిచ్చఁ
గట్టఁదడవుచుండఁ గని నేను బల్కితిఁ
దోడ్పడంగఁ గోర్కె తొందరింప:

'కాయముజూడ దుర్బలము, కన్నులపాటవముం దొలంగె, నే
సాయమొనర్ప బంధువులు సైతము లేరిట నెట్లుకాలముం
ద్రోయుదు వవ్వ? యీకలుపు దుంపలు తీయను సత్తువైన లే
దే! యటుగాక నీకడుపు నెట్టుల నింపెద విట్టిపల్లెలన్?'

ఎండుటాకుల వెన్నెల పండినటులఁ
బెదవిమూలలఁ జిఱునవ్వు పొదలుకొనఁగ
నవ్వ యిట్లనె: 'నాయనా, యైననేమి?
పుట్టఁజేసిన దేవుండు పూరియిడునె?

'గొడ్డుకాటకమున బందుగులను జేరి
యదవ త్రావుడు త్రావంగ నాస లేదు;
అట్టులోటను ఆకైన నంబలైనఁ
గూలియొనరించి కుడుచుటే మేలునాకు.

'కన్నకన్నవారల యిండ్ల కడపఁద్రొక్కి
బిచ్చమెత్తుట యన్న నాకిచ్చ లేదు;
కాలుసేతులు నున్నంత కాల మొరుల
చేతికూటికి నాసింపఁ జిన్నతనము!'

అనవిని, యవ్వ నైతిక గుణాతిశయంబున కబ్బురంబునొం
ది నెనరుమై వచించితిని: ‘ నీదగు నీతికి సంతసంబు గ
ల్గెను; నీకమీఁద నీవెచటికిం జననెంచక ప్రత్యహంబు గై
కొనుము మదీయగేహమునఁ గోరినయట్లుల మజ్జిగన్నమున్.’

అనిన సంతసించి యవ్వయిట్లనె: ‘ నయ్య,
కూలిచూపి నాకుఁ గూడుపెట్టు,
తిరిపెమెత్తి తిన్నఁ దీఱునా యాఁకలి?
రమ్ము పల్లెఁజేర జిమ్మదీసె. ’

జాతీయ గీతము.

జోహార్! జోహార్! భారతమాతా,
జోహార్! జోహార్! జోహార్!
శారద శుభ్ర వియత్తల పథమున
సంచరించు నీరథము,
నీ మృదు వీణాగాన ప్రబుద్ధము
నిత్యము మామనము.
జోహార్! జోహార్! భారతమాతా,
జోహార్! జోహార్! జోహార్!

ప్రత్యుషలక్ష్మీ మకుటమణి ప్రభం
బాసె తమోగణము,
నీపదపంకజ నూపుర ఝుంకృతి
నిద్రారహితము జనము.
జోహార్! జోహార్! భారతమాతా,
జోహార్! జోహార్! జోహార్!

విప్లవ ఝంఝా విచలిత జీవన
వీచి నికాయమున,
స్థిర విజయోడుప కర్ణధారణము
సేయుము శౌర్యమున.
జోహార్! జోహార్! భారతమాతా,
జోహార్! జోహార్! జోహార్!

ముకుళితహస్తులు నీప్రియపుత్రులు
మోదదృష్టిఁ గనుము,
నీకరుణామృత నిర్ఝరపూరము
నింపు మమ్ము సతము
జోహార్! జోహార్! భారతమాతా,
జోహార్! జోహార్! జోహార్!

నీపదపీఠిని ప్రాణసుమంబులు
నిల్పి భజించెదము,
గర్హిత దాస్య భరంబును మాన్పి
సుఖంబులు మా కిడుము.
జోహార్! జోహార్! భారతమాతా,
జోహార్! జోహార్! జోహార్!

రాట్నపుపాట.

పొద్దుపొడుపూ చుక్క పొడిచింది రాట్నమా,
గూళ్ళలో పక్షులు కూసేను రాట్నమా
అరుణకిరణాలతో ఆటలాడే నూలు
తమ్మికాడలలోని తంతులంటీ నూలు
మంచినీళ్ళల్లోన మఱిగిపొయ్యే నూలు
పాలీడుపోగుతో సరసమాడే నూలు
గాలితరంగలలోన తేలిపొయ్యే నూలు
వడకవే రాట్నమా, వజ్రాలదూది
నడవవే రాట్నమా, నక్షత్రవీధి.

పొద్దుపొడుపూచుక్క పొడిచింది రాట్నమా,
గూళ్ళలోపక్షులూ కూసేను రాట్నమా
ముద్దులొలికేపాట ముత్యాలపాట
పరువు నిల్పేపాట బంగారుపాట
మత్తుమాపేపాట మధురంపుపాట

నిద్రలేపేపాట   నిద్దంపుపాట
కడుపు నింపేపాట   కనికరపుపాట
పాడవేరాట్నమా భావిభారతము
ఆడవేరాట్నమా యాంధ్రనాటకము.

పొద్దుపొడుపూ చుక్క పొడిచింది   రాట్నమా
గూళ్ళలో పక్షులూ కూసేను   రాట్నమా
కట్టగుడ్డా లేక   కటకటా పడుచు
కుడువకూడూ లేక   గోడుగోడనుచు
దాస్యవారాశిలో   దరిగాన లేక
బెదరిబెదరీచూచు   పిరికిపందలను
ఆత్మనిందలతోడ   నడలు బేలలను
పురికొల్పశంఖంబు   పూరించి రేపి
తిప్పవేరాట్నమా   దేశచక్రంబు
విప్పవేరాట్నమా   విజయకేతనము.

ఏల పాట.

వస్తావంటే చక్కనిదానా
వలపుచిందే చూపూదానా
మల్లెపువ్వుల కోనకుపోయీ మల్లీవస్తాము.
గండుకోయిలా కూసేచోట
గండుమల్లెలూ పూసేబాట
ముద్దుముచ్చటా దీర్చూకొంటా మురిపేమాడేము.
చెంపచేయీ పెట్టుకోని
చింతపొయ్యే చిన్నాదానా
కళ్ళనిండా కాటుకనీళ్ళూ గారూతొంటుకే?
పక్కపక్కా రాసుకొంటా
పదములెత్తి పాడూకొంటా
అల్లో నేరేటీచెట్లానీడ ఆడుకొందామె.
పూలగుత్తులూ కోసీయిస్తా
పుట్టతేనెలూ తీసిపెడ్తా
చల్లనీటీ కొండా యేట జలకమాడేమె.
వస్తావంటే చక్కనిదానా
వలపుచిందే చూపూదానా
మల్లెపువ్వుల కోనకుపోయీ మల్లీవస్తాము.

నైవేద్యము.

1921—1925

విన్నపము.

ద్విపదరచనయందు సంప్రదాయసిద్ధములగు గణములే గాక చంద్రగణములలోని 'నలలము' 'భలము ' అను పంచమాత్రిక గణములను, అప్రయత్నపూర్వకముగ పడినచోట అంగీకరించితిని. అట్టి గణభేదమువలన ద్విపదయొక్క యేకగతియందలి విసుగుచేసటలు తొలఁగునని నాయుద్దేశము. శీర్షికలకడ చుక్కగుర్తులుగల కావ్యములన్నియును గేయములు. వానివాని గతిప్రసరణముల ననుసరించి చదువవలయును.

దువ్వూరి రామిరెడ్డి.

ప్రేమాంకము.

దాఁగినిఁ బోవుచుండ నొకతట్టున రత్న మయూచితంబు చే
కూరినరీతి నాయెడఁదకున్ సరిదాఁకిన మిత్రుఁడున్ మనో
హారి, కళాతపస్వి, సరసాత్ముఁడు, మోమునఁ బ్రేమమాధురీ
సారము చిప్పిలం బరులస్వాంతము లాగెడి యింద్రజాలికుం
డై రమణీయభావకవితాంచితుఁడై చెలువారు రాజమ
న్నారు సఖుండుగాదొరకె నాకుఁ, దదాప్తత కానవాలుగన్
కోరివొసంగితిం గృతినిఁ గూరిమినెచ్చెలి కంకితంబుగన్.

22-12-1924.
పెమ్మారెడ్డిపాళెము.

ప్రియమిత్రుఁడు,
దువ్వూరి రామిరెడ్డి.



నైవేద్యము.

తల్లి, నీయుత్సవముఁగాంచఁ దరలినార
లనుఁగుఁ దనయులు నైవేద్య హస్తులగుచు;
ధన్యులెల్లరు నాత్మోచితంపుఁ గాన్క
లర్పణము సేయవచ్చిరి; యందికొమ్మ.

స్వర్ణసుమముల నర్చన సలుపువారు
భాగ్యవంతులు నీపాద పద్మములకు;
ఏమి లేనట్టి భిక్షుకుం డేని నేఁడు
కంటి క్రొన్నీటి ముత్యాల కాన్క లిడును.

పూజ్యు లధములు, ధనికులు పుట్టుబీద
లనెడి యెడలేక యెత్తిరి హారతులను;
భక్తిపరవశులైన యాప్రజలగీతి
దిక్కుదిక్కులయందుఁ బ్రతిధ్వనించు.

అమ్మరో, నీదు మందిర ప్రాంగణమున
మండుచున్నది కర్పూర ఖండగణము!
త్యాగపరిశుద్ధమగు నాత్మఁ దలఁగిపోవు
కామమటు ధూమరేఖలు గడలుకొనఁగ.

ప్రొద్దుపొడుపున నీ పాదపూజకొఱకు
కవిని, తెచ్చితి దోసిటఁ గన్నెపూలు;
బలి వితర్దిక నిరతంబు వెలుఁగునటుల
హృదయపు సుగంధదీప మర్పింతుఁ గొనుము.

ఫిబ్రవరి 1921.

* కర్ణధారి.

సందెచీఁకటి దెసలఁ జక్క నలమెం;
గాఢమబ్బులు చుక్కగములఁ గ్రమ్మెం;
ప్రబల వేగాన దుఫాను వీచెన్;
ఆకసము గీకసం బావిలింపన్
గర్జించె మేఘాలు కంపమెత్తన్;
నటియించు భైరవు జట లోకో నాన్
నురుగుఁ గ్రక్కెడి కడలి తరఁగగుంపుల్
చెలియలికట్టపైఁ జిందులాడన్;
ఉన్మత్తప్రకృతి నృత్యోత్సవంబుల్
మింటిని మంటిని మేళవింపన్
గడిమి విడువకు కర్ణధారీ,
పడవ నడుపుము భయముదీఱి.

నడిసముద్రంబునఁ బడితినంచున్
జడివాన నిలువంగ జాలనంచున్
పడగండ్ల 'బాంబులు' పడునో యంచున్
కటికచీఁకటి కన్ను గాననంచున్
ఒంటినైతిని సాయ ముండదంచుం
బరిపరి విధముల భావింపఁగం
బ్రాణ సంశయమునఁ బలవింపఁగన్

సమయంబు గాదిది జడచిత్తుఁడా,
చినిఁగిన తెఱచాప చెఱఁగులెల్లన్
సవరించి, యాత్మవిశ్వాసంబునం
గడిమి విడువకు కర్ణధారీ,
పడవ నడుపుము భయముదీఱి.

పుడమిఁబ్రాఁకెడు చిన్న పురుగువోలెం
గష్టనిష్ఠురవిధి కాలిక్రిందం
బడి చిందుచింపులై ప్రాణమేదం
బుట్టలేదోయి యే పురుషుఁడైనం
గ్రిందికి దింపకు కేతనంబున్;
'సెర్చిలైటులు' వోలెఁ జీఁకట్లలోన్
మెఱసెడిఁ జూడు! క్రొమ్మెఱుఁగుఁదీఁగల్
దారిఁజూపెడు ధ్రువతార పైనన్
మిణుకుమిణుకున వెల్గు మేఘాలలోన్.
జీవనదీపమై చెలఁగు నాసన్
మలపక పాథోధి మధ్యంబునం
గడిమి విడువకు కర్ణధారీ,
పడవ నడుపుము భయముదీఱి.

29-5-1922

బాటసారి.

నిశ్శబ్దయామిని నీరవ వీణ
తంతులఁ గదలించు తరుణీలలామ,
యెంత తటాలున నేల నిల్పితివి
రమ్యమూర్ఛన లీను రాగంబులెత్తి?
యానందమదిర పొంగారు పాత్రంబుఁ
బెదవులకంటించి పెఱికివైచితివి.
ఆ క్షణం బానిన యనుభూతివలన
హృదయంబు పిచ్చెత్తి యెగురు నెందెందొ!
యర్ధరాత్రం బాయె; నంధకారంబు
దిక్కుల వ్యాపించెఁ; జుక్కల గములు
మబ్బుచాటునదాఁగి మాయమైపోయె;
జల్లుజల్లున వాన జడివెట్టి కురిసె;
బాటసారిని, వన్యపథమందుఁ జిక్కి
దిక్కుదోఁపక యొంటి ద్రిమ్మరువాఁడ;
ఆరుపఁబోకు గవాక్షంబునందుఁ
గాంతిల్లు దివ్య సుగంధదీపంబుఁ;
దలుపుదీయుము దీర్ఘ దైనిక శ్రమము
స్వప్న శీత స్పర్శ సమసి సుఖింపఁ,
గాంత, యొక్కింత నేఁ గన్నుమోడ్చెదను.

మ ర్త్య క వి .

అనవరతంబు నీ వంతఃప్రపంచ
గంభీర నిర్మల గగనంబునందు
నెగిరిపోవుద వోయి, యెటులఁబట్టినను
ఓ మర్త్యకవిమౌళి, యూహ వంచించి
యేకాననంబున, నే మూలయందొ,
యేపూవుఁబొదరింట నేయాకు సందొ,
వినరాక కనరాక వికసించి తావి
యూర్చెడు క్రొంబువ్వు నోజ నెయ్యెడనో
వసియించెదవుగాని, వన కుటీరమున
నీ యపూర్వపు సృష్టి నీలాంబరమున
రతనాల విల్లునా రమ్యమైతోఁచు.
అప్సరోవీణల యం దుద్భవించు
రాగంపుగఱులు స్వర్గద్వారమునకు
హృదయంబుఁ గొంపోవు రీతి, నీకావ్య
పుష్పకంపు రసార్ద్రి పులకితాత్మలను
జీవన యాథార్థ్య సీమలం దుండి
కొనిపోవు నందన వన గంధవహము
వీతెంచుకల్పనా శీత నగంపుఁ

గడపటిశృంగంబు కడకొక్క త్రుటిని.
చంద్రకిరణంబుల జనియించినట్టి
యా స్వప్నలోకంపు టచ్చెఱబోఁట్లు
పటికంపుఁబాత్రల పైయంచు పొరల
ద్రాక్షాసవముఁ దెచ్చి దగ్గఱఁ జేఱి
యందీయఁ దమిదీఱ నాని, మత్తెక్కి
యఱగన్నుమోడిచి, యన్నికష్టముల
మఱచి సుఖింతు నీమహిమంబు వలన.
మిన్నుపైఁబడినను మేలుకొల్పకుము;
ఆనంద రసవార్ధి యా దీఁదనిమ్ము.
కవికులాభరణ, నీకావ్యమాధురికి
వినిమయంబుగ నీయ విశ్వంబునందు
నేమియుఁ గన్పట్ట దీఁడైనయటుల!
ప్రార్థనాంజలి పుటి బాష్పముత్యముల
యుపహార మిచ్చి నేనొక్క వందనము
నర్పించుచున్నాఁడ నందికోవయ్య.

30-5-1922

రాధాకృష్ణులు.

రాధ

ఏమోయి శ్రీకృష్ణ, యింతపొద్దాయెఁ
గనులకు నీరూపు కఱవాయెనేమొ!
సంజరంగులలోన సడసె గోధూళి;
వేణుసంగీతంబు వినువీథి ముట్టెఁ;
కాళింది మడుగులోఁ గలఁ బూచియున్న
కలువపూనెత్తావి గాడ్పులు విసరె;
ఆమనితోఁటకు నతిథియౌ పికము
ప్రేమప్రవాహంబు వెలికుబ్బపాఱ
హృదయ తటాకంపుఁ దుదితూముఁ దెఱచె;
నీయందు లీనమై, నినుఁగాంచు వేడ్క-
నాతురపడు మతి నాఁపంగలేక
వాకిట నిలుచుండి వనవీథి నెపుడుఁ;
గనికని నాకన్నుఁగవ నీరుగ్రమ్మె.
ఇంతకక్కస మేల? యింత కసియేల?
చంపనెంచిన నింత చాటుఁదనమేల?
నీ నవ్వు విన్నంత నిన్ను గన్నంత
వచ్చె నాప్రియుఁడంచు భావింతుఁగాని,

యవ్వేల స్మృతిదక్క నంతయు నిందఱి
జాల మట్లేడకో జాఱిపోయెదవు!
నిన్ను నమ్మినదాని, నిన్నేలచుదాని,
నీపదంబులఁ జిత్త నీరేజ కళిక
నిడు తపస్విని జీవనేందిరాపాంబు
ఖండించెదేమోయి, కఠినహృదయుండ!

కృష్ణుఁడు

ఓముద్దరాల, నన్నూరక యేల
కానిమాటలు పల్కి కటకటించెదవు?
యమున గట్టులనుండి యాల మరలించి
వచ్చితి నిప్పుడే వనసీమదాఁటి;
కాంవి దుమారంబు గ్రమ్మిన చేల
మైనఁ దీలేదింక నరయు మోచెలియ.
నిష్కారణపు శంక నిందింపఁ దగదు,
తథ్యమారసి నన్ను దండింపరాదె?
లావణ్యసరసిలో లాస్యంబు లాడు
నీమోముదమ్మి యే నిమిషంబెకాని
చూడకుండిన నాకు శూన్యమా జగము.
మున్నటి వలపులు, ముద్దుముచ్చటలు
మఱచి యిట్లాడెదో మతిలేనిదాన!

రాధ

ఔగాని, శ్రీకృష్ణ, యా మాయవలపు
బయలయ్యె, నింతగా వర్ణింపనేల?
వలిపపు వలెవాటుపైఁ బసపుగుర్తు
లతికినట్టుల నేల యయ్యెనో చెపుమ?

కృష్ణుఁడు

మోదుగాకులుగోయ ముదిమోక లెక్కఁ
బువ్వుల రసమంటి పుట్ట మిట్లాయె.

రాధ

తాఁకినఁ గందెడు తనువుపై నేల
గోటిగిచ్చులుఁ బడ్డ గుర్తు లగుపట్టె?

కృష్ణుఁడు

ఇందుకే శంకించితే! పువ్వుఁబోఁడి,
కోరిందపొదలోనఁ గోడెమూ దేఁగ
వెన్నంటి పోయెడివేళఁ గంటకము
లంటి గీతలుపడె, ననుమానమేల?

రాధ.

చివురుటాకులువోని చెక్కిళ్ళసొబగు
కలఁగిన రుచి దోఁచు కారణంబేమి?

కృష్ణుఁడు

మావిగున్నల నీడ మధ్యాహ్నవేళ
నలసి నిద్రించెడు నప్పుడు గఱిక
యొఱయిక నొక్కింత యొత్తిగిలె నేమొ.

రాధ

అందాల కెందమ్మి యధరబింబమునఁ
గాఁటుక మరకలు గనుపట్టె నేల?

కృష్ణుఁడు

నీకన్నులకు సాటి నిలిచి నలపింప
ముదముతోఁ గల్వల ముద్దిడికొంటి;
ఆ రంగు పెదవుల కంటెనో యేమొ!
ఏ నొక్క తప్పిదం బెఱుఁగ నో సకియ.

10-5-1922

వాల్మీకి.

వాల్మీకి కవిచక్రవర్తి, నీవెవరు?
సరస కవితాలతా శాఖలందుండి
యామనికోయిల యట్లు గూసెదవు?
ఎచ్చోటఁ బుట్టితి వేడ పెరిగితివి?
యేతల్లి చనుఁబాల నింత మహిమంబుఁ
గాంచితో చెప్పుమ కవిసార్వభౌమ;
నింగిని భేదించు నీమహాసృష్టి
యెదుట నీచారిత్ర మెం దడఁగిపోయె?
గంగానదీ శీతగర్భంబునందు
నిదురించుచున్నదా నీచరిత్రంబు?
అభ్రంకష హిమాచలాంతర కటక
గంభీర గహ్వరాగాధ శూన్యమున
మాఱుమ్రోసెడునె నీమహనీయ వాణి?
ఓ యాదికవిరాజ, యోదివ్యవాగ్మి,
యెన్ని యేండ్లనుబూండ్లు నేఁగెనోకాని,
మున్ను హిమాలయ మోహనాటవుల
నీవుమీటిన కావ్య నిర్ణిద్రవీణ
నేఁటికి వినఁబడు నిఖిలదేశముల!
భావ కిరణంబులు పడుగుపేకలుగ

నీ వల్లినట్టి రమణీయదృశ్యంబు
బంగారుస్వప్నంబు ప్రజలనెల్లపుడు
నానంద రసవార్ధియందుఁ దేలించు.
నీచేయి సోఁకిన నిమిషంబునందె
బంకమన్నైన రూపముఁదాల్చి నిలుచు!
ఈ యింద్రజాలంబు నేడ నేర్చితివి?
యీశిల్పనైపుణి యెట్టు లలవడియె?
ప్రకృతిభాండారంపు ద్వారంబు దెఱచి
గుప్తరత్నంబులఁ గొల్లగొట్టితివి!
ఆకాశమునఁగల యన్నితారకలు
కడలి గర్భమునందుఁ గల జీవమణులు
సరితూఁగలేవు నీ సౌభాగ్యమునకు!
భావవారిధిఁ బూల పడవ నడిపించి,
ముత్యాలరేవులో మునిఁగి యడుగంటి,
పలురంగు మణులను వలలీడ్చి తెచ్చి,
నవ్యమౌ కావ్యమండన మొండొనర్చి
విశ్వసాహిత్యంబు వెలిఁగించినావు!
కవితా నభో రవీ, కవిచంద్రులెల్ల
నీకాంతిపూరంబు నిండారఁ ద్రావి
తమ కళ పెంపొంద దైవాఱుచుండ్రు.
నీ మనోవల్లకీ నినదంబుఁ గాంచ

సాధ్యంబుగామి నాశారద వీణ
నేమూలవైచెనో యెఱుఁగంగరాదు.
నీసృష్టి కెదురుగా నిలిచి నిట్టూర్చి
తమ్మిచూలియునైనఁ దలవంప వలయు.
పుట్టించితివి పో యపూర్వమూర్తులను
హైందవ సామ్రాజి కాదర్శములను;
రామాయణము నీకు రమణీయ భావ
నందన వనిఁ బోలు నవ్యనిర్ఝరము;
హైందవసంఘ మీ యమృతంపుటూటఁ
దరతరంబులనుండి తమిదీఱ నాని
నవజీవనపు శక్తి, నవధర్మరక్తిఁ
గాంచి లౌకికయాత్ర గడిపెడి నహహా!
జాతీయకవి, నమస్కారశతంబు
లర్పించి నీచరణాబ్జ రేణువులఁ
దలఁదాల్చితినిఁ; జాంద్ర తారకా భరిత
నీల గగనముక్రింద నిలుచున్నయప్పుడు
మనుజుని యల్పత మదిఁదోఁచునటుల
నీ ప్రతిభావాహినికి ముందునిల్చి
నా కవిగర్వంబు, నాభావశక్తి
దుమ్ముదుమారమై తూలిపోయెడిని.

24-5-1922

కవి: సన్న్యాసి

[అస్తమయము: సముద్రతీరము. ఒకసన్న్యాసి యింద్రధనువు రంగులు గల గుల్లలను నొడినిండ నేరికొని, సముద్రతరంగములు పాదముల నభిషేకించునట్లు తీరమునఁగూర్చుండి, గుల్లపడవలను దేలించుచుండును. ఇంతలో నొక దివ్యపురుషుఁడు వేణువును మ్రోయించుచు నాకసమునుండి యచ్చోటికి దిగును.]

సన్న్యాసి

(స్వగతము)

సాంధ్యవర్ణాంకిత జలధరదూత
యనఁగ నెవ్వండీతఁ డంబరమునుండి
తీరసైకతమున దిగుచున్నవాఁడు!

(ప్రకాశముగ)

ఎవ్వండవోయి, నీ వివ్వేళయందు
ఱెక్కలుపుట్టి చరించెడు నింద్ర
జాలంపు మురళివై స్వర్గంబునుండి
యవతరించెదవు మానవలోకమునకు?

కవి

సన్న్యాసితిలక, నే స్వప్నపురవాసి
శిల్పినిగాని,—నీచేష్టలు గాంచ
నుబుసుపోకకు వచ్చి యుదధి వీచికల
గుల్ల పడవలు తేల్చి క్రుంగంగ నవియుఁ
గన్నీరు నించినగతిఁ గానిపించు.

సన్న్యాసి

స్వప్న పురవాసి, నే జాలరిభంగిఁ
గడలిమధ్యంబునఁ బడవ నడిపించి
మంచిముత్యంబుల మణుల గడింపఁ
బలుమాఱు వలలీడ్వ వత్తు నేగాని,
చటుల ఝంఝూవాత సంక్షుబ్ధ వార్ధి
కల్లోలములఁజిక్కి— కడగాన లేక
పడవ తుత్తునియలై పగులునో యంచు
నూహించి, భయపడి యొడ్డుకు నెట్టి,
శూన్యభానంబున శుక్తిపోతములఁ
దీర వీచులయందుఁ దేలించుకొనుచుఁ
గాలంబుఁ గడపెదఁ గపటసంతృప్తి.
ఔ గాని, నీవేమి యాచరించెదవు?
వేణువాదనమె నీవృత్తియా యేమి?

కవి

అంబర చరులైన యధ్వగుల కొఱకు
విశ్వంబునంగల వివిధ నక్షత్ర
గణముల నొండొంటిఁ గలుప రత్నాల
వింటి వంతెనలు కల్పింతు రమ్యముగఁ;
గడలిఁదచ్చిన గాథకావ్యంబు లల్లి

యున్మత్తవీచుల యుద్ఘోషలెల్ల
నిశ్శబ్ద రజనీ వినీలగర్భమున
శ్రావ్యమౌ యప్సరస్సంగీత మటుల
నొనరింప వేణువు నూఁదుచుండెదను.

సన్న్యాసి

ఓమంత్రకాఁడ, నీవేమేమొ నుడివి
మోసగించెదవు సమ్మోహంబుఁగొలిపి.
ఒకచేత నమృత మింకొకచేత విషము
నాను మాను మటంచు నందియిచ్చెదవు!

కవి

అదియె జీవనరహస్యంబు సన్న్యాసి,
చేఁదుతీపులు రెండుఁ జేరియే యుండు,
నొకటి యుండినచోట నుండు రెండవది.
పడవ వ్రీలునటంచు భయపడెదవేని
జలధి దున్నెడు కోర్కెఁ దలపోయఁబోకు.
అలల రాపిళ్ళకు నాఁగలేవేని
ముత్యాలపై నాస పుట్టఁగనేల?
పన్నీరుపువ్వును బడయ నెంచినను
ముల్లు దాఁకునటంచు నల్లాటమేమి?
నీ నీడ నెడఁబాయు నిఖిల యత్నములు
వ్యర్థమౌనని వేఱ వచియింప వలెనె?

సన్న్యాసి

అల్లైన నోశిల్పి, యల్లవిగో గనుము!
భగ్నమై పడియున్న పడవచెక్కలను
యాత్రకు యోగ్యమౌనటుల జోడించి
తెరచాపలం గట్టి తెడ్ల నందిమ్ము.

9-6-1922

మాతృమందిరము.

[మాతృమందిర సందర్శన తత్పరులైన కొందఱు యాత్రికులు, కొండ నెత్తమున నొకనాఁటి రేయి గడపి, ప్రొద్దుపొడుపున మేల్కాందురు. కను చూపుదూరమున వారికి మాతృమందిరము కనుపట్టును.]

మొదటి యాత్రికుఁడు

ఆవనీధరంబుపై ననిల డోలికల
నల్లనల్లన నూఁగు నంబుదార్భకులు
బంగారుకలలలోఁ బడి చిక్కుకొనిరి.
మంచుముత్తెపుఁ దెరలు చించి తొలఁగించి
పడకింటి కిటికీని బాగుగాఁ దెరచి
నవ వధూతిలకంబు నాఁ దొంగిచూచు
దిన రమామణి తూర్పు తీరంబు నందు.

రెండవ యాత్రికుఁడు

విరిసెడి క్రొంబూల వింత నెత్తావి,
చుట్టుపట్టుల నున్న సొగసైన గిరులు,
కర్ణపేయంబైన ఖగపాళి రుతము,
ఆనందజనకమై యలరు నిచ్చోట!

మూఁడవ యాత్రికుఁడు

మాతృమందిరమున మంగళధ్వనులు,
బంగారు గంటలు పలికించు రవము,
శంఖ నినాదంబు, సామగానంబు
నాలకింపుఁడు! కాలహరణంబు తగదు.

నాల్గవ యాత్రికుఁడు

అమలసౌరభ మీను నగరు ధూపంబు
కర్పూరఖండంబు గనిపించు త్యాగ
మాత్మలో వెలిఁగించు నమృతదీపంబు!

ఐదవ యాత్రికుఁడు

అల్లదే! సోదర యాత్రికులార,
పర్వతశిఖరంబుపై మాతృమంది
రంబు సూర్యాంశుల రమణీయమగుచు
మణిమయ మకుటంబు మాదిరిఁ దోఁచు;
పూజసల్పఁగ ఫల పుష్ప చయంబు
దోసిళ్ళఁ గొని తెచ్చి త్రోవపట్టుదము.
మందిర మార్గంబు మహితవృక్షముల
నీడలఁ జల్లగా నిమిరించుచుండు.

పలువన్నెమణులను బఱచిన పోల్కి
రాలిన పువ్వుల రాజిల్లు నేల
సూర్యతాపంబున స్రుక్కక మున్న
మాతృసాన్నిధ్యంబు మనము చేరుదము.

ఆ కా శ వా ణి

నిలుఁడోయి, నిలుఁడోయి, నిశ్చింతులార,
సత్యమెఱుఁగరు బాల్య చాపల్యమునను;
సరణి యెల్లను బుష్పసంకీర్ణ మనుచుఁ
జల్లనీడలఁ బోవు సమతలం బనుచు
భావించెదరుగాని పరిచితిలేమి,
నిదియె యాత్రికులఁ బరీక్షించు పథము!
మెఱసెడి నదియెల్ల మేలిమిగాదు,
బాహ్యచిహ్నంబుల భక్తుఁడు గాఁడు;
ఎందఱెందఱో యాత్రి కేఁగుదెంచెదరు
విజయ మొందెడివాఁడు వేయింటి కొకఁడు,
అధమ లోహములెల్ల నగ్నిపుటాన
నంతరించును నొక్క యపరంజి దక్క.
దుర్బలచిత్తులు, దుష్ట చేష్టితులు,
కార్యశూన్యులు, మోసగాండ్రును, జడులు
మార్గమధ్యమునుండి మరలెదరు గాని,

తిలకింపలేరు మందిర పుణ్యభూమి.
ధర్మజీవనుల పాదస్పర్శచేత
ననుదిన పావనంబైన దీ పథము!
ఆత్మసమర్పకులౌ వీరవరుల
యస్థులచేఁ బూతమైనదీ పథము!
త్యాగవ్రతుల శోణిత ప్రవాహమునఁ
గడుగంగఁబడిన దీ కఠినంపుఁ బథము!
దీని తత్త్వంబును దెలిసికోలేక
యాటపట్టని యెంచి యరుదెంచినారె?
భోగలాలసులార, పొండు మీపురికి.

[ఇంతలో దారిప్రక్కనఁ బడియున్న యొక పునుక యాత్రికులను జూచి, కలకలనవ్వి, యిటులఁ జెప్పసాగను:]

పు ను క

ఏండ్లు పూండ్లాయె మేమిచ్చోట నొరగి,
దుమ్ము దుమారంబు తొట్టెల నిండి
పుట్టగొడుగులు పచ్చపూరియు మొలిచె;
మాయెమ్ము లెచ్చోట మట్టిలోఁ జివుకు
నచ్చోటఁ దీవియ లల్లి పుష్పించు;
ఆ సుమ మకరంద మానిన నరుఁడు
పరమ విజ్ఞానియై పరిఢవిల్లెడిని.

జననమొందిన యప్డె చావు నిశ్చితము,
మాతృదేవీ బలిమంటప మందు
యజ్ఞ పశువుగ నిల్చు నంతటిభాగ్య
మెవనికి సిద్ధించు నిందఱిలోన,
నా మహాపురుషుని యకాలి దుర్మృ
ప్రజల శిరం బెక్కి భవ్యంబుసేయు;
ఆతని కన్నుల యం దుద్భవించు
బాష్ప బిందులు దేవభాండారములను
వెలలేని ముత్యాల విధమున నుండు.
ఆ యశస్వి చిర నామాక్షరపం క్తి
యప్సరో గేయమై యలరారుచుండు;
ఆ ధీరు క్రొన్నెత్తు రన్నిదిక్కులను
విజయాంకములు వ్రాసి వ్రేలాడఁగట్టు.
యాత్రికులార, మీయందఱిలోన
నట్టి వీరుండున్న నడుగు పెట్టుండు.

[యాత్రికు లొకరిమొగ మొకరు చూచుకొని దిగాలుపడుదురు; కొందఱు తలకొక్క దారిపట్టుదురు; మఱికొందఱు వేషధారులు నోటఁ దడిలేక వెనుకంజవేయుదురు; ఇంకఁ గొందఱు దుర్బలహృదయులు అందఱికన్న ముందుగ వెనుకకు మరలుటకు యత్నించి గిరిసానువునుండి కూలఁబడుదురు. కాని, యొక్క యువకుఁడు మాత్రము, సజల నయనుండును, పులకిత శరీరుండును, పుష్పాంజలి బద్ధుండునై నిలుచుండి పుషక కిట్లు విన్నవించును:]

కడపటి యాత్రికుఁడు

ఆటపట్టగు నాకు నఖిల విశ్వంబు,
విశ్రామభూములై వెలయు గ్రహంబు,
లంగంబు చెండుగా నాటాడుచుందు!
విత్తు నశింపంగ వెలువడుఁ జెట్టు;
వత్తి కాలకయున్న వఱలునే కాంతి?
యభ్యుదయ హేతువై యలరుఁ ద్యాగంబు;
అట్టిత్యాగము నాకు నాదర్శకంబు!
బాధలే నా కాప్త బంధువర్గంబు;
బీదతనంబె నాప్రియమైన హక్కు;
లోకహితంబు నాలోచించు పనియె
కఠినంపు విధి; దైవఘటితంబు నదియు.
స్వాతంత్ర్య రథ మెక్కి సంసిద్ధుఁడనుగ
మఃనుకొంటి; గుఱ్ఱాలఁ బూనింతు నిపుడె.
విజయాపజయములు విధిమూలకములు;
యత్నంబె మనచేత నైన కార్యంబు.
మాతృపాదంబులం బడు భాగ్యమున్న
గిరులైన నన్నడ్డగింపఁ దరంబె?
మార్గ మధ్యంబున మడసితి నేని
మీవలె నెమ్ములు మేదిని పైచి

నక్షత్రములలోన నటియించు చుందు.

పు ను క

ఓయి కుమార, నీయుత్త మాశయము
వెలిపుచ్చితివి త్యాగవీరుండ వీవు!
మాతృమందిర బలిమంటప వేది
నాత్మకర్పూరంబు నంటింప వోయి.

ఆ కా శ వా ణి

పూజారి వాఁడుగో! పువ్వుటెత్తులను
దెచ్చి ద్వారముకడఁ దిలకించు వాఁడు.
కాల మమూల్యంబు కదలు కుమార,
కాలిగుర్తు లనంతకాల సికతములఁ
బూర్వవీరుల పోల్కి ముద్రించి పొమ్ము!

5-10-1922

హృదయాభిలాష.

శ్రీగోపపాల, యాశ్రితభక్త జాల,
దివ్య వేణువినోది, దీన శరణ్య,
నలినాక్ష, నాజీవనంపుం బాత్రమున
నీ గానసారంబు నిండింపుమయ్య.
ఆనందమున నందు నంగంబుగరంగి
గీతారస స్రుతి రీతి ననంత
కాలసాగరమునం గలసి పోయెదను.
విశ్వ కావ్య కవీశ, వేదాంతవేద్య,
విజ్ఞాన మయమైన విస్ఫులింగమున
నంటింపు నాహృదయంపుం గప్పురము.
నిరతంబు నీపాద నీరేజపీఠి
నెత్తావిం జల్లుచు నేను వెల్గెదను.
ఓ జగజ్జ్యోతి, నీ యుజ్జ్వలశోభ
నా మనో నేత్రంబునకుం దోంపనిమ్ము,
కన్నులం బ్రమదాశ్రు కణములు దొరంగి
పూజకుం బువ్వులై పొసఁగునో దేవ!

7-10-1922

భవిష్యద్దర్శనము.

సందెముత్తైదువ, సరిగవలివంబు
వరివెన్ను పాపలు పట్టిలాగంగ
వాత్సల్యమునఁ బైకి వంగెనో యనఁగఁ
జెంగావి నిగ్గులు చేలపై నలమె.
ఈ రామణీయక మీక్షించి యుంటఁ
గాలునిలువక యూరి కిడపటనున్న
పొలమున విహరింపఁ బోతి నొంటరిగ.
తిన్నతిన్నగ వీచు తెమ్మెరల వలన
వెన్నులు బంగారు వీచులై రేఁగె!
కాంతియు గానంబుఁ గలసి యనూహ్య
మగు నింద్రియవిషయమై కానిపించె.
అచ్చోట నానంద మనుభవించుచును
నొక్కింత కూర్చుండియుంటి నిశ్చలత.
అంతలోఁ గెంజాయ లంతరింపంగఁ
గప్పెను బ్రకృతి నక్షత్ర సంఖచిత
కోమల తిమి రావగుంఠ నాంబరము;
గాలి వీచుటమానెఁ, గదల వాకులును;
అమ్మ పేరెదనాడి యలసి కనుమోడ్చు
పసికూనలటు సరోవర మధ్యమందు

నిశ్చలశాంతిమై నిదురించు నలలు;
గాంభీర్యమును దాల్చె గగనతలంబు;
సగము జాగ్రదవస్థ సగము స్వప్నమున
భావించుచును గట్టుపైన గూర్చుంటి.
సత్యమో, భ్రాంతియో, స్వప్నంబొగాని,
ఇంద్రజాలము వోలె నెదుటఁగన్పట్టె.
అది సత్యమైయున్న నాశ్చర్యకరము!
అది కలయేయైన నానందమయము!

* * *

మావితోఁటను బర్ణమంటపమందు
జనరంజకంబైన సభ యొండు జరిగె.
మొగలిరేకులు తమ్మి పూఁదోరణంబు
లందంబు నెత్తావి నర్పించుచుండె.
రారాజు క్రొంబచ్చఱా గద్దె డిగ్గి
యందఱితోఁ బాటె యవనిఁ గూర్చుండెఁ;
బనిపాటు లేనట్టి బంటుసిపాయి
త్రుప్పుపట్టినకత్తి తొంటిపై రాయఁ
దనపూర్వ జయములఁ దలపోయుచుండె;
బురదచిట్టలు షడ్గ పుట్టములఁ గాఁపు
వర్తించె నృపపరివారంబుఁ గలసి;
కూలినాలి యొనర్చి కుడుచు నిరుపేద

యజమాని సరిబంతి నాసీనుఁడయ్యె.
సకల మానవజాతి సంతతులు కుల
వర్ణభేదంబులఁ బాటింపఁ బోక
యొక్కకడుపునఁ బుట్టి యొకచన్నుఁబాలు
ద్రావినరీతి సోదర్యంబు గలిగి
యన్యోన్య సాహాయ్య మర్థించువారు.
స్ఫటికపాత్రంబున శాంత్యాసవంబు
ధర్మదేవత తెచ్చి తనిపె నందఱిని;
ఏక కుటుంబమై యీప్రపంచంబు
స్వర్గంబు భూమిపై స్థాపింపఁ బడియె.
అభ్యుదయాంశువు లన్నిమూలలను
నవసమోజ్జ్వల జీవనంపు దీపముల
వెలిఁగించుచుండె; నీ విశ్వమంతయును
మానవకళ్యాణ మందిరం బయ్యె.
అంతలో లౌకిక యాథార్థ్యములను
భావంబు వ్రాలెను బక్షివిధాన;
బొగ్గుకంబము లట్లు పొడకట్టుచుండెఁ
దత్ప్రాంతముల నున్న తాళవృక్షములు!
చిమ్మచీఁకటి నోంటిఁ జిక్కొనియుంటి.

7-10-1922

సమరతృష్ణ

సంగరతృష్ణచే స్వాంతంబు రగులఁ
బటు దురాశావేశ పారవశ్యమున
నధికారదాసులై యనవిఁ బీడించు
మనుజ సంతతులార, కనికరము లేక
బలహీన జాతులఁ బట్టిచంపెదరు.
దేహంబు నలుపైనఁ దెలుపు పసుపైన
నాత్మబంధులుగారె యఖిలజనంబు?
కామంబు, క్రోధంబు, గర్వంబు, జాతి,
దేశంబు, భాషయన్ దెరలు చింపంగ
సర్వసామాన్యమై చను మానవత్వ
మొక్కటే తీరునఁ గాక యున్నె వేర్వేఱ?
మానవరక్త సంభార విక్రియము
గావించు నస్త్రశస్త్ర ఘాతుకులార,
విజయ మదిరాపాన వివశచిత్తమున
నేల పావనమూర్తి నేసు మహాత్ము
మఱియొకమాఱు కర్మాగారపంక్తి
చిమ్నీల పైకెక్కి సిలువ వేసెదరు?

నిస్సహాయయు, దాస్య నిగళబద్ధయును
నగు సమాయికజాతి యస్థిపునాదిఁ
గనకమందిరములఁ గట్టుచున్నారె?
యూలపోయెడివారి యుసురు నిట్టూర్పు
విసరదే మీఁచితి వేఁడిమంటలను?
సొంత యక్కఱకన్న నెంతో యెక్కుడుగ
వస్తుల నిర్మించి వాని వెలపుచ్చ
జనసంఘముల బానిసలుగఁ జేయుదురె?
ఇట్టి యన్యాయ్య మింకెంతకాలంబు
అవును గాదనకుండ రవులుకొనఁ గలదు?
ఐశ్వర్యవంతుల యఱచేతి ఫలమ,
కష్టజీవుల పాలి కంఠపాశంబ,
ఓ నాగరకత, నీయున్నతాదర్శ
మిదియె యైయుండిన నింకఁ జాల్చాలు!
మానవ హృదయమ్ము మంటవెట్టకుము.
చీఁకట్లుపెనుగాలిఁ జిమ్ముతెక్కలను
భూమిపై పైఁగప్పి పొదుగంగఁబోకు
కాలకూట జ్వాల గ్రక్కు సర్పముల
వాణిజ్య దేవతా, వాయుసామ్రాజ్య
మందుఁ జరించు మాయల మంత్రికత్తె,
అతిదురాశా తృషఁ బతితులౌ జనుల

బంగారు పావలకుఁ బట్టి బంధించి
కొండలం గానలఁ గోనల గుహాల
మింటను మంటను వెంటఁ జీఱాడ
నీడ్చికోఁ బోయెద వేమి నీ మహిమ?
నీపాదచిహ్నాల రాపాడి వచ్చు
సంగర పశుశక్తి చచ్చి చావకయ
యాత్మకృతాపరాధాంకమై నిలిచి
బహుళ పశ్చాత్తప్త బాష్పపూరములఁ
దన మనోవికృతుల దాహంబుఁ దీర్చు.
శాంతి నానాజాతి సమితి చేకూర్చఁ
జాలునే చిత్తముల సలసలం గ్రాగు
పాషాణ రసములు పైకిఁ బొంగంగ?
సమర పరాజిత శత్రువర్గముల
కొల్ల ద్రవ్యము పంచుకొనువేడ్కఁ బెద్ద
భాగంబులకుఁ బోరు 'పరమ సౌహార్ద
చక్రవర్తుల' కేల శాంతిపీడనము?
ఖండాంతరంబుల కపటనాటకము,
కాలమెప్పటికైనఁ గనికరము లేక
నీముసుంగును జీల్చి నిజమూర్తిఁ జూపు.
భావి సంగర ముష్టిఁ బట్టుపడనీక
జగతినిఁ గాపాడ సకలదేశముల

కవిమహాశయు లోకక్క కట్టుగావలయు.
ఇదియె నాస్వప్నంబు; నిదియె నాయాశ.
కలయు నిక్కంబగు కాలంబు రాదె?
ఓ కవివరులార, యో జగదేక
శాంతి దాయకులార, సర్వజనీన
సేవా సమాసక్త చిత్తాబ్జులార,
అల్లదే! దర్శించు డవతరించెడిని
ఆధ్యాత్మిక యుగంబు! నానాందముఖము!
జ్ఞానహోమాగ్ని మీ కరదీపికలను
వెలిఁగించి, జెండాలు వినువీథి నెగుర
నఖిల మానవ హృదయధ్వంసి కీట
కములకుఁ దల్లియౌ కటిక దురాశ
సమయింప సంగ్రామ సన్నద్ధులగుఁడు
నిభృత శాంత కుటీర నీడములనుండి
కవికోకిలములార, గగనంబు గనుఁడు.
ఎంతవిశాలమై యెంత గాంభీర్య
రామణీయకముల రాజిల్లునదియొ!
లేలెండు తటి యిదే లెండు సఖులార!

25-10-1922

---

* మేలుకొలుపు.

మేలుకో భారతకుమారా,
మేలుకోరా తరుణధీరా,
మేలుకో!

కష్టనిర్భర దాస్యమట్టులఁ
గాఢచీఁకటి సడలిపోయెను,
భావి ప్రత్యూషమును జాటఁగ
వాఁడుగో! శుక్రుఁడు రహించెను,
మేలుకో!

మంగళ ధ్వనులటుల పక్షులు
మంజులాలాపములు సల్పెను,
మాతృభూమి జయాంకమై రవి
మండలం బుదయించెఁ దూర్పున,
మేలుకో!

మేలుకో భారతకుమారా,
మేలుకోరా తరుణధీరా,
మేలుకో!

30-10-1922

వానకాలపు వరిచేలు.

క్రొక్కాఱు మబ్బులు గుంపులుగూడి
యాకసంబునఁ దేలు నట్టి తరుణమునఁ
బసినాఁటి యానంద రసము పొంగంగఁ
బలుమాఱుఁ గాంచితిఁ బచ్చవరిచేలు!
వానముత్తెసరాల వల ముసుఁగుఁ దాల్చి
దినలక్ష్మి కోమల దీధితులు చిల్కె;
జల్లులం దడిసిన సస్యపుంజంబు
దుమ్ము కప్పుదొఱంగి తొలకాడెఁ గాంతి;
గాలిలోఁ దడిపచ్చికల తావి విరిసె.
పొగవన్నె మబ్బుపై నెగిరెడి కొంగ
బారు భౌతికరూప బంధంబు లెడపి
పుణ్యలోకముఁ జేరు ముక్తాత్మ మాల
యన భావవీథిఁ దోఁచెను విచిత్రముగ.
వానచినుకులు సేయు గానంబు నేఁడు
అఖిల లీలామనోహరమైన బాల్య
కాలంపు స్వప్నంబుఁ గనులఁగట్టించు;
నింద్రజాలమురీతి నిగురొత్తఁ జేసె
నెన్నఁడో మఱచిన పిన్నతనంపుఁ
బొరపొచ్చెములు లేని బుజ్జికోరికెల.

1-11-1922

హా తా శ.

అర్ధరాత్రపువేళ, నంబరవీథిఁ
దారలు వికసించు తరుణంబునందు,
స్వర్ణమయంబైన స్వప్నమోహమున
మానవలోకంబు మగ్నమైనపుడు,
ఒంటిగావచ్చి నా యుటజంబు కడకుఁ
దలుపుఁ దట్టుమటంచుఁ జెలికిఁ జెప్పితిని;
'అల్లపో' యని తలయూడించె సకియు.
రెండుజాములు దాఁటె రెండేండ్ల పగిది,
వేచియుంటిని—మది విసిగి వేసారె;
నింకైన నరుదేర దేమి కారణమొ?
రమణి దగ్గఱలేని రాత్రిలయాముఁ
గడతెంపఁ గారాని కాలభారంబు
సీసంపుగోలుసునాఁ జిత్తాంతరమున
వ్రేలెడి నిసి!—యెట్లు వేగింతు నిశను?
ఇంక మాకుఁ బరస్పరేక్షణ ప్రాప్తి
గలుగుట నిజమేని, కన్నీటిబొట్ల
మాలను రచియించి మాయలమారి
చేడియ కర్పించి శిక్షగావింతు.

నా యవివేకంబు నాకుఁ దోఁపింప
నరుణుఁడు తూర్పున నావిర్భవించెఁ;
బొలఁతి రానూవచ్చెఁ బోవనుంబోయె!
పచ్చి లత్తుకపూఁతఁ బైదలి యడుగు
ముద్రలు వాకిటి ముంగలం దనరె!
సకియ మేలిముసుంగు సందడి వినియుఁ
బవన కంపిత పర్ణరవ మనుకొంటెఁ;
బ్రియసి చేతి దీపిక కాంతిఁ గాంచి
యమలతారాశోభ యని భ్రాంతిపడితి;
నెంత ముగ్ధుఁడ నైతి! నెంత పొరపడితి!
అభిశప్త జీవనుం డైన నే నేడ?
సకియ కంఠాశ్లేష సౌఖ్యమదియేడ?

3-11-1922

శైశవస్మృతి.

శైశవ స్మృతి! యిహ స్వర్గానుభూతి!

వానమబ్బులపై సవారిచేయుచును
వర్షాగమంబున వచ్చితే నీవు!
నవసెడి మనచిన్ననాఁటి నేస్తముల
వానచినుకులు సల్పు గానములగుండఁ
జెవిలోన గుసగుస చెప్పుచున్నావె?
అల్లిబిల్లులు దిరుగ, నాటలాడంగ,
వాఁగులై వీథులఁ బ్రవహించునీటఁ
గాళ్ళడ్డముగఁ బెట్టి కట్టలుగట్టఁ
బ్రీతి వానకాలంబు బాల్యంబుఁదాల్ప
నుల్ల మెవ్వేళ నువ్విళ్లూరు చుండు.
ఉల్లాసమున నాడు నోమబ్బులార,
జ్ఞప్తిలేదా మీకు నాముద్దుమొగము?—
మటుమాయలెఱుఁగని మందహాసములఁ
జిందు సుకుమారంపుఁ జిన్నారి మొగము!
భావింపలేరె నా పసినాఁటి కనుల?—
ఆశ్చర్య మిళిత దివ్యానందమునను

మిమ్ముఁ గన్నట్టి యాకమ్మని కనుల!
మఱవరు గద నాదు చిఱుకేలుగవను?—
పొద్దు నిగ్గులు పైడి పూఁత పూయంగ
సరిగపేటు విధాన మెఱయు మీయంచు
జాలరుం బడయు కోసము చాఁపి చాఁపి
పలువ్రాఱు వేసటపడిన కేల్గవను!
అట్టి శైశవ మిప్పు డలరునే నాకు?
బాల్యంబు గడచె; యౌవన మంకురించె;
నిరువది యాఱేండ్లు జరిగె నిప్పటికి.
అంబరచరులార, యంబుదములార,
యే దానధర్మంబు లే జపతపముఁ
బూర్వజన్మంబునఁ బొనరించి నారొ!
యిట్టి నిర్మలవృత్తి, యిట్టి జీవనము,
నెడలేని శైశవం బీపుట్టు వందుఁ
బడసినారలు మీరు పావనాత్మకులు!
కాల హాలంబు నా కనుబొమలపైన
నడ్డఁచాళులు దున్నె; నైన మీరేమొ
పసినాఁటి చిన్నారి ప్రాయంబు విడక
యనుదిన నవ్యులై యలరుచుండెదరు!
మిన్నునఁ జరియించు మిమ్ముఁ గన్నపుడు

నా వయస్సు గియస్సు భావింపఁ బోక,
వానచినుకుల నాడ వలతునేగాని,
పరుల యూషికలకు భయపడి, యింటఁ
బట్టి బంధించిన పగిది నుండెదను.

మే ఘ ము లు

ఓ మిత్రమా, విధి కుమ్మలింపకుము
ఇంట నీవుండిన నేమి, నీయెడఁద
పిన్నటవలె మాదు బిగి కౌఁగిలింత
స్పర్శా సుఖంబును బడయుటలేదె?
కాల దౌర్జన్యంబు కాయమును దక్క
నీహృదయం బంటనే యంట లేదు;
ఓయి బాల్యసఖుండ, పోయివచ్చెదము,
మఱల నేడాదికి మనకు దర్శనము.

3-11-1922

అభిసారిక.

మల్లెపూవుల దండ లల్లు సుకుమారి,
పరవశంబైన భావంబున మఱచి
యేల పూఱేకుల నిట్లు చిదిపెదవు?
కడుమెత్తనైన నీ కన్నెమనంబు
నెవ్వాఁడు హరియించె నీ నిశీథమున?
ఈ పూవుఁ బొదరింటి కేఁగెద నంచు
బాసచేసి ప్రియుండు మోసగించెడినో?
యటుగాక, నీ మృదులాంతరంగమును
బీడించువేదన వెలియార్ప నొక్క
నిర్జన శాంతంబు నిభృతంబునైన
స్థలమునుగోరి యిచ్చటకు వచ్చితివో?
ప్రణయ దీపము వెల్గి బాట గాన్పింప
నర్ధరాత్రమునందు నభిసరించితివో?
నీ యంద చందంబు, నీ నీటు గోటు,
నీ ముద్దు మురిపెంబు, నీ విలాసంబు
నెంత వ్యర్థంబాయె నింతిరో నేఁడు!
చెమరించు నీమోము చిన్నెలయందుఁ
బ్రతిఫలించు నగాధ భావఘూర్ణనము!

భగ్నాశ నీ విటు పరితపింపంగ
నెడలేక తొరఁగిన కడగంటినీటఁ
దడిసె నీవు రచించు దండ, పూఁబోఁడి.
తనచేతఁ దలపోసి తలవంచు కొనఁగఁ
బ్రొద్దువొడుపున నీ పువ్వుల మాలఁ
బ్రేమదూతి యనంగఁ బ్రియునకుఁ బంపి
మంచికాలము రాక మది నెంచి కొనుము.

3-12-1922

గఱిక.

దారికోవల క్రేవఁ దనరారు గఱిక,
యెంతమెత్తందన! మెంతటి ప్రోది!
యెంతక్రొత్తందన మిగురొత్త నీవు
మొన్నగాఁ గురిసిన ముత్యాల జడికి
మూరిపాల గుబురువై పెరుగుచున్నావె?
దైవసృష్టిని నీకుఁ దావొండుగలదు;
నేనును నీపైన నెనరూనియుందు.
ఏను నీవైతినో యెవరికిందెలియు
మున్నుగతించిన పుట్టువులందు!
ఈవు నేనౌదువో యెవ రెఱుంగుదురు
రాఁబోవుజన్మాల రాకపోకలకు!
గుసగుస చెప్పెదు, గునిసి యాడెదవు.
నీలోన వెలిఁగెడు నిర్మలజ్యోతి
వెలికొత్తఁ బోరాట పెట్టుచున్నదియొ?
నీ యందచందంబు, నీ సంతసంబు
నందఁ బాల్గొన నాదు డెంద ముప్పొంగు!
పంచవన్నె ముసుంగు వలిపంబుక్రింద
నొకవేళ నిరువుర మొకరమే యేమొ!

దీపనిర్వాణము.

ఏదిక్కుఁ జూచిన నిసుక యెడారి,
నిబిడాంధకారంబు, నిస్సీమ తలము!
జగతి గర్భంబెల్ల చైతన్య రహిత
గంభీరశూన్యమై కనుపట్టుచుండె.
ఒంటిగా నేనొక్క యొంటెపై నెక్కి
యీ బయలు తరింప నేఁగుచున్నాఁడ.
రేయిఁ బాంథునకు దారిని జూపుచుక్క
లాకసంబున నెందు నగపడవేమొ!
ఒంటెపదముల చప్పు డొకటియు, గాలి
నిట్టూర్పు సడిదప్ప నిశ్శబ్దవీథి
వేఱు సందడి యొండు వీనులఁ బడదు.
హృదయదౌర్బల్యంబు వదలించి నూత
నోత్సాహముం గొల్పు నొక్క కోకిలయు
నమృత తుల్యంబైన యానందగీతిఁ
బాడ దక్కట! నాదు పాప మేమందు?
పలుమాఱు నాచేతి బంగారుదివ్వె
వెలిఁగింతుఁ గాని, కంపిలి యా నిమేష

మందె పఱ్ఱ్యర పీచి యాఁకిపోయెడిని!
వెలిఁగించి వెలిఁగించి విసిగి వేసారి,
పెను దుపాను కెరళ్ళ గునిసి త్రుళ్ళింత
లాడు చుక్కాని లేనట్టి పోతంబు
తీరున, విధి యీడ్చు తెఱఁగులనెల్ల
ధూళి బ్రుంగుచు నేఁడు ద్రొక్కుచున్నాఁడ.

3-12-1922

వీణాప్రియ.

తంత్రులు దెగిన నా ధ్యానవిపంచి
విశ్వమోహనగీతి వెలికూర్చు నీకు
వీణ తంత్రులువేసి బిగియించి మర్మ
నీరవ మూర్ఛన నెఱపించు శ్రుతికి
మేళగించి, రహస్య కేళీగృహంబు
నకుఁ బంపుఁడని ప్రేమ నాప్రాణపతికిఁ
జెప్పిపంపితి దూతిచే నొకనాఁడు.
ఎన్నియో దినములు నేండ్లును బూండ్లు
గలసిపోయె ననంత కాలశూన్యమున!
హృదయేశుఁడేమొ నా వదనంబుఁ గనఁడు,
వీణయుఁ బంపఁడు, వినిపింపఁ డెట్టి
వార్తయునైన; నాపాపమెట్టిదియొ!
నా గానగర్వంబు, నా సోయగంబు,
నా భూషణప్రీతి, నా వచోరీతి,
నా యభిమానంబు, నా గౌరవంబు,
నాదు కౌలీనంబు, నా సిగ్గుసెరము
తొలఁగి, మేలిముసుంగు వలిపంబుఁ దిగిచి

యంతఃపురము వీడి యలజడికోర్చి
బిచ్చుకత్తె విధానఁ బృథ్వి యెల్లెడల
దుమ్ముదుమారంబు గ్రమ్మిన చీర
ధరియించి త్రిమ్మరు తరుణంబునందు
నా ప్రాణనాథుండు, నామనోహరుఁడు
వనకుటీరంబున వసియించి నన్ను
‘రమ్ము నాకోర్కెలరాణి! రమ్మిటకు
నిపు డర్హవైతివి యీదివ్య వీణ
సారింప రమ్ము నాసరస గూర్చుండి.’
అని తియ్యగాఁబల్కి యానందబాష్ప
ములు కన్నులఁ దొరంగ ముద్దాడె నన్ను.

5-12-1922

* సేవ.

మముఁగన్న భారతమాత మందిరమున
దివ్వెలై మన ముందామా, పైఁడి
దివ్వెలై మన ముందామా.
పరమ పావని తల్లి పాదపూజల వాడు
పువ్వులై మన ముందామా, పొన్న
పువ్వులై మన ముందామా.
భారతిదేవి విపంచిక రవళించు
తంత్రులై మన ముందామా, దివ్య
తంత్రులై మన ముందామా.
జన్మభూమీశౌర్య సౌరభ్యములు చల్లు
గీతలై మన ముందామా, భావ
గీతలై మన ముందామా.
కదనవీరులచేతి ఖడ్గ ధారలలోని
మెఱుపులై మన ముందామా, కారు
మెఱుపులై మనముందామా.

16-2-1923

* ప్ర బో ధ శం ఖ ము.

ఏల తెలియక సంశయించెదవు?
భారతకుమారా,
డీలుపడి వెనుకంజ వేసెదవు?
విన్నదనమున మోము వాల్చెదవు?
దాసోఽహ మంచును
జిన్నతనమునఁ గేలుమోడ్చెదవు?

తెల్లచర్మము నీకు లేదనియో,
బలమైననాడులఁ
వెల్లునెత్తురు పాఱలేదనియో!
భారతీయుఁడ ననెడి గర్వమునఁ
దలయెత్తి నిక్కి
తేఱిచూడుము సకల లోకమును.

ఎంతకాలము స్వప్నసింహంబు
దడిపించు నిన్ను?
జింతసేయుము తొలఁగు మోహంబు.

ఏలనోయీ గద్గద స్వనము?
ఆక్రోశగానము
చాలుచాలిఁక విఫల యాచనము!

వీరపూజోత్సవపు సమయమునఁ
బూరింపలెమ్ము
ఘోరభీషణ విజయ శంఖమును!
ఏల తెలియక సంశయించెదవు?
భారతకుమారా,
డీలుపడి వెనుకంజ వేసెదవు?

10-3-1923

* రజని.

నిర్మల నీల నభంబునఁ జుక్కలు
నిండె సజీవ వికాసములన్;
మర్మ విపంచిక నీరవ రజనీ
మానిని మీటెను మూర్ఛనలన్.
ప్రాంత కుటీర లతా ద్రుమసౌధము
లస్ఫుట తారా కాంతిన్,
వింతగఁ గరఁగెడివో యన ఛాయా
క్రాంతములై కనుపట్టెన్.
నిశ్చలశాంతిని నిఖిల జగతి సుఖ
నిశ్వాసము వెడలించున్,
నిశ్చల నిబిడ గభీరానందము
నిండి పొరలె లోకమునన్;
దైనిక కలకల మూర్ఛితభావము
తారా శిశిర స్పర్శన్
మానస గగనమునందు విహంగము
మాదిరి నెగిరెఁ బ్రబుద్ధంబై.
గోడపైని ప్రదీపిక యట్టులఁ
గూర్చుంటిని నే నొంటరిగన్

సారెకు జాగ్రత్స్వప్నము నందుఁ బ్ర
సుప్తుఁడనై మఱిమేల్కాంచుచుఁ.
అహాహా! నామది విశ్వముతోడ ల
యాన్వితమై నటియించుఁ,
అహాహా! విశ్వము నా హృత్పాత్రిక
నాసవ రసమున లయమొందుఁ.

14-3-1923

---

*అభిసారిక.

గాలియడుగుల నెవరికోసరము
--- ఓ మోహశీలా,
కదలివచ్చితి వీ నిశీథమున?
కాలియందెలు ఘల్లు మనుననియొ
ఓ వలపురాణీ,
కేలఁగైకొని మెల్లనడచెదవు!
పులుఁగు తుటుము తటాన కీచనుచు
అర గూఁటి గూళులఁ
బలుక, వెఱపున దెసలు గాంచెదవు
నిలిచి యేమని యాలకించెదవు?
నీ యడుగుసడికే
యులికిపడి 'యెవర' నుచు మఱలెదవు!
తెల్లవెన్నెల నీ దుకూలంబు,
మైపూఁత నిగ్గులు
తెలియరావని యూహ సల్పెదవు!
నీవు నడచెడి బాటయెల్లెడల
వ్యాపించు గంధపుఁ
దావు లెట్టుల గప్పిపుచ్చెదవు?
ఓ ముద్దరాలా,
నీ విహారము బయలు పఱచెదవు. **15-3-1928**

*ఆగంతుకి.

చాలు లజ్జా మధుర వినయము!
ఏల యవగుంఠనము వైచెదు
పూలదండలు గట్టియుఁ మెడఁ
గీలుకొల్పక కేలఁ జిదిపెదు
శోభినీ,
యప్సరగకామినీ!

సందెవేళలఁ బూలతేకులు
క్రింది కురలఁగఁ గాంచి కాంచి మ
రందబిందులు కన్నుఁ దమ్ములఁ
జిందఁ బొగిలెదు ప్రకృతిచేష్టకు,
కామినీ,
సుందరగామినీ!

పలుకరించినఁ బలుకవేమొ!
పులుకుఁ బులుకునఁజూచి, చూపుల
వెలువరించెదు లలిత హృదయా
విల కఠోర వ్యసనభారము!
ఏలనే?
మౌనం బేలనే?

ఎపుడు మౌనవ్రతపు టుద్యా
సపు దినంబులు వచ్చుఁ గోమలి,
యెపుడు విరియునో మూకసందే
శపు నిలీన రహస్య భావము;
పోలునే,
చింతన చాలునే!

తేలివచ్చెడి కల విధంబునఁ
గాలియడుగులు సందడింపక
యేల వచ్చితి వీ వసంత వి
నీల గగన చ్ఛాయ నొంటిగఁ?
బలుకవే,
భావముఁ దెలుపవే!

చీఁకటులు బలమయ్యెఁ; జుక్కల
రాక పోకలనేల తలఁచెదు?
నా కుటీరమునందు వెన్నెల
సోఁకి తమము నశింప దీపము
పెట్టవే,
నామది ముట్టవే.

16-3-1923

పిచ్చిబికారి.

మాయాకుమారి

ఓయి యాగంతుకా, ఓయి విరాగి,
పాములు వ్రేలాడు పగిది జడివాన
కుమ్మరిల నెడలేక కుండపోఁతలుగ,
ఝంఝా మరుత్పృషు చాలితంబగుచుఁ
బెదఁబడి చెట్లెల్లఁ బెల్లగిలి కూలఁ,
గన్నుపొడిచిన యట్లు కాఱుచీఁకట్లు
నలుగడ వ్యాపింపఁ, బలుమాఱు మెఱుఁగు
తీఁగల వెల్గునఁ దీవ్రతర ఘోర
భౌతికోన్మత్త దుర్వార ఖేలనము
కనులకు వ్రేఁగయి కనిపింప, నేమి
బిచ్చంబుఁ గోరి యీ వెఱగొల్పు రాత్రి
వచ్చితి వొంటిగాఁ బిచ్చిబికారి?

బికారి

ఓ యైంద్రజాలిక మాయాకుమారి,
ప్రళయ లీలోద్వృత ప్రకృతిసంగ్రామ

భూమి సింహాసనంబునఁ గొల్వుదీరి
యచల ప్రదీపికయటు వెల్గు నిన్ను
నివ్వేళగాక నే నెవ్వేళఁ గందు?
నీ చేతిభిక్షువై నిఖిలంబు విడచి
కాలవీథిని నొంటిఁ గదలివచ్చితిని.
నీ పాదములకడ నిలిచి వేఁడెదను;
నీ తేనె చిఱునవ్వు నెఱపి ' కొమ్మ 'నుచు
బిచ్చంబు పెట్టుము ప్రేమమై రమణి!

మాయాకుమారి

యేమి బిచ్చంబోయి, యీ నిశీథమున?
ఉత్తచేతుల రాణి; నిత్తఱి నీకు
నేమియ్యఁ గలను?

బి కా రి

ఇం కేమికావలయు?
నీ జడకట్టులో నిద్దుర వాడి
నలఁగిన చంపక దళముల మాల
బిచ్చంబు పెట్టుమీ పిచ్చిబికారి
సంతృప్తి నొందును; జాలించు యాత్ర.

20-3-1923.

* బాష్పదాత్యము.

జీవనగంగా హారిత తటంబునఁ
జింతా వటతరు మూలమునన్,
ఏల యధోముఖివై గడతెంచెద
వివ్వధి యౌవన నిశలన్?
ఆవలిగట్టున స్వప్న పురంబున
నవ్యయ నిర్వృతి వనులన్
డోలాఖేలన రతుఁడౌ ప్రియునిఁ గ
డుంగడు భావన సల్పెదవో?
నీ వయసెల్ల హృదీశుని చింతన
నిర్మల ధూపము పగిదిన్
గాలెడి నబలా, రేయుం బవళులు
గందముఁ జిమ్ముచు నల్గడలన్.
ధావమాన శరదంబుద శకలపు
దాత్యము నమ్మిటు వేచెదవే?
చాలు నిరీక్షణ! చాలిఁకిఁ జింతన!
చాలు రహస్య వియోగహతుల్!

జీవన సంధ్యా పరిణత బాష్ప స
　　చేతన నీరవ దూతికలన్
గాల పయోనిధిఁ బర్ణపుటంబులఁ
　　గదలింపుము ప్రియు కడకున్.
హా! విధివశ్యతఁ జేరుదు రవ్వలి
　　యంబర చుంబి తటంబున్.
బాలతపస్విని, యెపు డేవేళనో
　　వల్లభుఁ డొసఁగును దర్శనమున్,
శ్రావణ నీరద మాలిక లిరువురి
　　శయ్యాడోలికలై యూఁగన్.

22-3-1923

---

* అతిథి .

తెఱచియుంచితిని జీవన మందిరద్వారంబుఁ
దీర్ఘవాసీ, కొను మాతిథేయ సత్కారంబు!
ఓ యాత్రికా, ఓ నక్షత్ర మండల పథికా,
యే యజ్ఞాత సాగర శాంత తట తరువీథి,
నే యానందకూల సమీరణ శిశిరచ్ఛాయ
నేకాకివై తిరిగితివోయి, నిశాముఖ వేళ?

ఏ యలౌకిక మార్గ సముత్థిత కాంచనధూళి
నీ జీర్ణ వస్త్రమిటు కావిరిపట్టె బికారి?
ఏ నిగూఢ విపంచీరాగము వింటివోగాని,
ఏ చిన్మయానుభవ స్వప్నముఁ గంటివోగాని,
యిటు విహరించెదు ముక్తపథంబున నతిథీ!

26-3-1923

---

* మోహినీప్రకృతి.

జిలిబిలి తియ్యని రాగము లెత్తి చేసెను గానము సెలయేఱు,
తళతళ వెన్నెల నిగ్గుల నలలుం దాండవమాడెను మైమఱచి;
కలకల కోకిల రవములు రజనీ గాంభీర్యమునకుఁ దోడ్పడియె;
జలజల దేహము పులకించి వ్రేళులు జాఱెను వీణాతంత్రులను.

ఓరె! నా జీవన శుష్క ఝరంబు
పాఱెఁ గూలంకష పూర్ణముగ;
జాఱెరా, పరలోక జీర్ణతటంబు
పూరసంఘర్షణ శీర్ణముగ!
పగిలెఁ గముండల పాత్రిక!
చిగిరించె సంసార వల్లిక!
తగదింక బైరాగి జీవిక!
జగమెల్ల నందనవాటిక!

27-3-1923

---

* జీవన ద్వేషి.

యామిని

ఏడకయ్యా చిన్నవాఁడా,
కోడెప్రాయపు వన్నెకాఁడా,
యేఁగెదవు నడిరేయి వెలుపడి
వాఁగువఱ్ఱుల దారివంకకు?
ఏలరా?
యీ వింతనడవడి చాలురా!
ఆకసంబునఁ జుక్కదివ్వెలు
చీఁకటులఁ గడు బలుచచేయఁగ
జీవలోకము చల్లనిద్దురఁ
గేవలము మైమఱచి తేలఁగఁ
దల్పముల్
విడి తిరుగఁ గారణమేమిరా?
కన్నుబొమ్మలు వంగి సొంపఱి
చిన్నవోయిన చిన్నె లొలికెడి
నెట్టివేదన లెట్టిచింతన
లిట్టితఱిఁ జెలరేఁగె మదిలోఁ?

దెల్పరా?
నా మెద నెత్తురు లోలెక్కరా.

జీ వ న ద్వే షి

ఓసి వలపుల రేయిసానీ,
ఓసి కల్వల సిరులరాణీ,
విసిగి వేసరి జీవబంధన
విసరమును దెగఁదెంప వచ్చితిఁ
గానవే,
జేనెఁడు తలంబును జూపవే.

యా మి ని

ఓయి ప్రాయపు టందగాఁడా,
ఓయి ముద్దుల మురిపెగాఁడా
ఏల యంటెద చీడపుర్వు వి
శాలజీవన పుష్పదళముల?
మానరా,
యీ పిచ్చియత్నం బేలరా?
సరసి నీటను బ్రాణములు విడఁ
దరలుటయె నిజమేనిఁ జెప్పుమ—
నా హృదయం బంతకన్న న

గాధ, ముంకు మునింగి తాపము
వాపరా,
నీ విసుగువేసట లడఁగురా.

నేలపై నీ తనువుఁ బాపుట
చాల నిష్టంబేనిఁ జెప్పుమ—
నాదు మెత్తని రొమ్ముతలగడ
నాదరంబున మోము నానిచి
తూఁగరా,
యెడలేని యూరట నొందరా.

జీవనము నురిత్రాట వీడుట
నీవు తలఁచెదవేనిఁ జెప్పుము—
జడను నలఁగియుఁ గమ్మతావులఁ
గడలఁ జిమ్మెడు పూలదండను
నిత్తురా,
మరణాభిలాషము మానరా.

28-3-1923.

---

* ఆనంద సత్రము.

ఈ వసంత యౌవన రజని,
　　నీ మృదు తారాకాంతిఁ,
బార హీన గంభీర జలధి
　　వాయు తరంగాహతుల
మ్రోగెరా నాదు హృదయ మురళి
　　మోహన గీతాగతుల!
ఆడెరా నా జీవనపాత్రి
　　నానంద ఫేనిల మదిర!
విరిసెరా నా భావమునందు
　　విశ్వజనీనానుభూతి!
ఆహా! ఈ మనోహర రాత్రి
　　నైతి వసంత సృష్టి.
ఓరే, విరహ విహ్వలకామి,
　　ఓరె, దరిద్ర కుచేల,
ఓరే, నిష్ఠురజీవన పథిక,
　　ఓరె, మానవ ద్వేషి,

రండిరా, రారండి! హిమకర
　　రంజిత గగన చ్ఛాయ
నానంద సత్రద్వారముల
　　నన్నింటినిఁ దెఱచితి, రండి!
అతిథులారా, చెఱియొక పాత్ర
　　యాసవ రస మానెదము!
ఆ మత్తులోనఁ గరఁగిపోవు
　　నైహిక యాత్రా శ్రమము.

30-3-1923.

* ఆమని నిషా.

జాగ్రత్త! జాగ్రత్త! మాయు జగత్తని
శాస్త్రము లెల్లను విప్పెదవు;
భాగ్యము భోగము చంచల మంచును
బైరాగి ధర్మముఁ జెప్పెదవు;
ఎవ్వారు విందురీ పిచ్చి బోధనము
లీ మధుమాస నిశీథమున ?
ద్రాక్షరసాయన పాత్రిక పెదవులఁ
దవులఁ దలంతురె చేఁదనుచు ?
ఓయి యతీశ్వర, చాలిఁక బోధన
మూరక తెల్పకు నీమతము.
ఆనంద భాండము నందు హాలాహాల
మయ్యయ్యో! విరసుఁడ, కలుపకుము,
ఉన్మత్త కోకిల గానము సల్పెడి
నుద్యాన వాటిక మధురముగ.
పొడవాటి లొద్దుగ కొమ్మల నూఁగెడిఁ
బున్నమ చందురుఁ డుయ్యెలలు.

అని మత్తునఁ జైతన్యలోకము
ఆనంద పరవశమై సాగియు;
సరిచేయు మో సఖి, భగ్న విపంచిక
సంధ్యలు పాటలఁ బుచ్చెదము!
సౌఖ్యనదీ రసపూరము:సం దంచ
జంట విధంబున నీఁదుదము!

---

* లూఠీ.

ఎవరురా నావీణా తంత్రుల
నిట్టుల సళ్ళించి పెట్టిరి?
ఎవరురా నా గంగా తీర్థము
నిట్టులఁ గలయంపి చల్లిరి?
ఎవరురా నాపూజామాలిక
నిట్టులఁ దెగఁద్రెంపి వేసిరి?
ఎవరురా నాగీతాపుస్తక
మిట్టులఁ బుటలెల్లఁ జింపిరి?
ఎవరురా నా యర్ఘ్య వేదిక
నిట్టుల దీపము నార్పిరి?
ఎవరురా నా హారతి పళ్ళెర
మిట్టుల బోరల దోసిరి?
చోరుఁ డెవ్వఁడో యతిథి వేషముసఁ
జొచ్చెను నా పర్ణశాలను?
నామూల ధనమెల్ల లూఠీగొట్టి
నన్ను బికారినిఁ జేసెను!

పూర్వజన్మస్మృతి.

శారద చంద్రికా మధుర శర్వరులన్ భవదీయ వేణు గీ
తారవ మాలకించి యెడఁదల్ నిలుపోపక మోహమాధురీ
ప్రేరిత చిత్తలై యభిసరించిన గోపిక లొందినట్టి గం
భీర మనోవ్యథల్ కలఁతవెట్టెడి నన్ను యశోద నందనా!

ఏకాలంబున నేయుగంబుననొ యింకే పూర్వ జన్మంబునన్
నీ కల్యాణ మనోహరాకృతిని నే నిత్యంబు దర్శించిన
ట్లే కన్పట్టెడిఁ గృష్ణ! కాని యెడ నిట్లేలా మనోవీథి నీ
యాకారంబు సువర్ణ ముద్రితముగా నానందముం గొల్పెడిన్?

పోతన శేముషీ మహిమ పూర్ణ సుధారస ధార నాని, నా
చేతము నందు నీస్మృతి విచిత్ర గతిం జివురించె నేమొ! లే
దా తనివార నీచరణ తామరసంబులఁ జింతసేయ నా
కీ తలపోఁతగల్గెనొ గ్రహింప నసాధ్యము లోకమోహనా!

తెలుగుంగైత యొయారిపోఁకడలలోఁ దీపుల్ పిసాళింప ని
శ్చలభక్తిన్ రచియించెఁ బోతన భవచ్చారిత్రముల్; తత్క-
థాకలితానేక విశేషముల్ మనసుఁజక్కన్ రేఁప నాపూర్వజ
న్మలచర్యల్ పొడకట్టు భావమున బింబం బద్దమందుం బలెన్.

పూతన పాలుఁద్రావి విసపు న్నురువుల్ వెలిజాఱ, ముగ్ధశో
బాతరళాక్షులన్ నగవుపట్టఁగ లేక యొకింత మోడ్చుచున్
వ్రేతల గుండియల్ వగులఁ వేడ్కఁ జరించెడు నిన్నుఁగాంచి నే
భీతిలి తల్లి జానువులఁ బెట్టునఁ గౌఁగిలినట్లు దోఁచెడిన్.

తరువులు పెల్లగిల్ల, గిరితండము కొమ్ములు వ్రీల, దిద్దిరం
దిరుగుచు నిండ్లు నిండ్లుగనె నింగి సుడింపఁగ రేఁగి వీచు నా
మరుతమునందు నిన్ గగనమధ్యమునం గనుగొన్న నాఁటి యా
వెఱ పిపుడైనఁగాని ననువీడదు; నిద్దుర నుల్కఁగొల్పెడిన్.

చీటికి మాటికిం దులిపిచేఁతలు చేసెడి నిన్నుఁగాంచి యిం
కాటలు మానరా తనయ, యంచు యశోద వచించి త్రాటితో
ఱోటికి నిన్నుఁగట్ట నెగరొప్పుచు మద్దుల సందుకీడ్చి యు
ద్ఘాటనముంబొనర్చు నిను గన్గొని కాలికి బుద్ధిసెప్పితిన్.

మఱచితి ముద్దుకృష్ణ, యొకమాపటివేళ యశోద మందలోఁ
దిరుగుటఁగాంచి మీఁగడలు దెచ్చి, సకుల్ మనవెంటరాఁగ నం
దఱమును నారగింప, నది తల్లి కనుంగొన, లేచి, మీఁగడే
మెఱుఁగ మటంచు నమ్మయొడియెక్కిన నీచెయిదంబుదోఁచెడిన్

కన్నీటిధారలం గరఁగిన కాటుక
మఱకలు బుగ్గల మెఱయుచుండ;
క్రీఁగంటిచూపుతోఁ గేల్దోయిఁ గౌపీన
మును మెలివెట్టుచు, ముద్దులొలుక

వినయంబు మూర్తీభవించిన తెఱఁగునఁ
దలవంచి నిలఁబడి: 'తల్లి, నేను
ఏమిచేసితినంచు' నేమియెఱుంగని
పసిపాప యట్టులఁ బలికి, విశ్వ
మోహనాలోకనంబుల మోసపుచ్చి,
తప్పులెల్లను మఱపించి, దండనంబుఁ
జేయనుంకించు తల్లి యాశీస్సుఁబడసి
మురిపెముం జిల్కు నిన్ను నే మఱవఁగలనె?

సిగలోని పించెంబు చిన్ని తెమ్మెరలకు
రతనాలవింటి వర్ణముల నీన;
నీలిమబ్బులవంటి నెమ్మేని నిగ్గులు
చల్లని శాంతరసంబు గురియ;
మొలత్రాటఁ జెక్కిన మురళి కొండలగాలి
కొకవింత రాగంబు నూఁదుచుండ;
సగము మెక్కినవెన్క వెగటు గొట్టిన వెన్న
ముద్ద యెండఁ గరంగి బొట్టుగాఱ;
నలువ దాచినయావులఁ జెలులవెదుక
నేఁటిపచ్చిక గట్టుల నేఁగుచున్న
నిన్నుఁ గనుఁగొన్న జ్ఞప్తి నా కున్నదోయి,
యిన్నిజన్మంబులకు నైనఁ జిన్నికృష్ణ!

మటమట యొండలం బసుల మావులక్రిందఁ బరుండఁదోలి చిక్కటి పెరుగన్నమున్ మిరపకాయలు నంజుచు నారగించి యొక్కట గుమిగూడి, యాదవుల గాథలు నీవు వచింపఁగన్ నదీతట పవనంబు వీవఁ గడఁదాఁకిన సంజలు నేఁడుఁ గల్గునే?

కాళింది మడుఁగులో నా
భీల విషజ్వాల లెపుడు వెలిగ్రక్కుచు మా
బాలురఁ బెయ్యలఁ జంపిన
కాళీయఫణి కథలు దలఁపఁ గాయమువడఁకున్.

ఆ సర్పంబు భయంబునం బసులు నీరానన్ విలంబించి యా
కాసారంబును డాయఁబోయి వెనుకోఁగాఁజూచి నాగేంద్ర, చా
వాసన్నంబయియుంట నీ పొగరుఁబోతాటల్ విజృంభించెఁగా
నీ సై లెమ్మని హుంకరించిన నినున్ నేఁడైన నూహించెదన్.

బరబరఁ జేలమున్ నడుముపై బిగియించి, కిశోరసింహ మ
ట్లురవడిఁజూపి, మమ్ముఁగని యోసఖులార, భయంబులేదు; నే
నురగముఁ జంపివత్తు నని యొడ్డుననున్న కుజంబునెక్కి మో
హారమునఁ బాముపై దుమికినప్పటి నీ రభసంబుదోఁచెడిన్.

బుస్సుబుస్సున గాలి భోకొట్టినట్టుల
విసపు నిటూర్పులు దెసలుముట్టఁ,
పాతాళగర్భంబుఁ బగిలించి శేషాహి
పైకిలేచిన రీతి ఫణములెత్తి

తోఁకజాడింపఁగ దోయపరీవాహంబు
అభ్రింకషోర్మిలై యాకులింపఁ,
దరిగొండ మున్నీట గిరికొట్టి నట్టులఁ
గాళింది మడుగెల్లఁ గలదిరుగుచుఁ,
ప్రాణిభీకర విహరణ పారవశ్య
మునఁ జరించెడి కాళీయు ఘన ఫణముల
మణిగణ ద్యుతి యడుగుఁ దామరలఁ బూఁత
వెట్ట నటియింపవే కృష్ణ, విజయి వగుచు!
గోవర్ధన గిరి యెత్తి శ
చీవల్లభు గర్వశాంతిచేసి, మఱుఁగ మా
గోవుల వానలఁ జావక
కావవె శ్రీకృష్ణ, దివ్య కారుణ్యమునన్!

యమునా శ్యామల వీచికా తతుల లాస్యంబుల్, శరచ్చంద్రికా
కమనీయామల సైకతంబు, మురళీగానంబు బృందావన
ద్రుమవల్లీ కృతశోలికల్ మనమునందుందోఁపఁ బూర్వాను భూ
తములౌ కోర్కెలు మోసులెత్తెడిని రాధాకృష్ణ,యీ వెన్నెలన్
చిరవిరహంబునం బసవు స్వీయవిధంబున బృందనేఁడు నీ
చరణ సరోజ సంగతుల సౌఖ్యముఁబాసి కృశించెఁ; గ్రమ్మఱన్
మురళిని మర్మమూర్ఛనలు మ్రోయుచు రమ్మిఁకఁ బ్రేమరాజ్య సం
భరణ మనోహరాంగవిభవంబుల లోకము మోహపుచ్చుచున్.

రాజభిక్షుకుఁడు.

పగ లెల్ల వరిచేలఁ బనిపాటుచేసి
ప్రొద్దు క్రుంకెడివేళఁ బొలమునుపీడి
యిలుసేరి నూకల నిగిరించి, వేఁడి
సంగటిఁ గుడిచెడి సమయంబునందు,
సన్నచీఁకటి రూప సౌందర్యగరిమ
మబ్బువాఱుచునుండ, మా కుటీరంపు
ద్వారంబు కడసల్చి ధరణీవిభుండు
మునిముసి నవ్వుల మొగమందగింప
సందె కబళము వేఁడెఁ!— జకితనై నేను
నొడలు కంపింపంగ నొక్కమాటైనఁ
బలుకఁ జాలక మోమువంచి నిలుచుంటి;
నంతనెచ్చోటికో యరిగె రారాజు.
అవి యీవియని యెంచ నలవిగానట్టి
చిదురుఁ దలంపులు చీకాకువెట్టఁ
జేతిలోఁ గబళంబు చేతనేయుండ
నూరక కూర్చుండి యున్నతరుణమున
నెచ్చటినుండియో వచ్చి బిచ్చకుఁడు

జాలిపుట్టగ వేఁడె సందెకబళంబు;
కనికరంబున నేను గడియన్న మెత్తి
"యిదిగో కొమ్మని" చేత నిడితి; బికారి
యానవాలుగ దీని నర్పింతు ననుచు
నుంగరంబొక్కటి యొసఁగి తా నేఁగె;
నంత దీపపు వెల్గు నందు నే దానిఁ
గన, రాజముద్రిక యనితోఁచె; నేఁడు
రాజు భిక్షార్థియై రాఁగతం బేమొ
మాంబోఁటి నిఱుపేద మాలకొంపలకు?

మృత్యువు.

ఓ మృత్యుదేవతా, యో జగద్రాజ్ఞి,
జంటబిడ్డలపోల్కి జన్మించినారె
జీవితంబును నీవు సృష్ట్యాది యందు!
మనుజుండు నీదివ్య మహనీయమూర్తి
భయసముత్పాదక బహుళవర్ణములఁ
జిత్రించి యాత్మీయ సృష్టిని గాంచి
భీతచేతస్కుఁడై విభ్రాంతినందు!
మూఢభక్తియుఁ గాలమును బడుగుపేక
యనఁగ, భావమునాడె యట్టులఁ దిరుగఁ
బ్రీతిఁ బౌరాణిక విశ్వాసమనెడి
వల నేసి దైవ విపాకంబుకతనఁ
బాపము! తానందుఁబడి చిక్కుకొనియె.
తప్పించుకొనుటకు దారి గన్పడదు.

నీ కన్నుబొమ్మలు నీహారఖండ
శిశిరంబులంట! నిర్జీవధావళ్య
జలదంబు నీకన్ను జంటచుక్కలను
గబళించునంట! యో కాలస్వరూపి

ణీ! మానవునితోడ నీవు నెల్లపుడు
దాఁగిలిమూఁతల తందనాలాడి
చేయిఁ జిక్కకయొకుఁ జేరఁబోయెదవా!
మూఢచిత్తులు నీకు మున్నొసఁగినట్టి
పౌరాణిక విచిత్ర వస్త్రములఁదాల్చి
మహి విహరింతువు మాఱువేసముల!
నీకాలిచప్పుడు సోఁక దిగులొంది
కంపిల్లు మనుజులఁ గని రహస్యముగఁ
జిఱునవ్వు నవ్వెదో చిన్నారిరాణి?
నీ మోసగింపులు, నీ టక్కుఁదనముఁ
జాలింక! నెఱపుము సఖ్యంబు సకియ.
దయ్యాల ముసుఁగేల తాల్చి త్రిమ్మరెదు?
నీ దొంగవేసంబు నే లాగివైతు;
ఎటువంటి నగుమోము, ఎట్టియుందంపు
ముసుఁగుఁజీఁకటిలోన మునిఁగియున్నదిర!
కవితల్లజుండగు కాళిదాసైన
నీమోహనాకృతి నీదివ్యమూర్తి
నభినుతింపగలేక హతమనోరథుఁడు
గావలెనని చెప్పఁగా నన్నుబోఁటి
కర్షక కవియెట్లు కడతేరఁ గలఁడు?
అందంబులకు నెల్ల నందంబ వీవు;

నీకు నీవేసాటి నిఖిల లోకమున!
గారడికొలనులోఁ గలకల నగుచు
నిప్పుడిప్పుడె విచ్చు నిందీవరముల
సరిపోలు మురిపాల చక్కనికనులు

సౌందర్యరాజ్య విజయ లాంఛనములు.
చెమరించు నీలేఁత చెక్కుటద్దముల
పన్నీరుపువ్వుల పస వెల్లివిరియు;
పచ్చిద్రాక్ష రసానఁ బలుమాఱునాన

వైవ మెత్తగనైన పవడంబుచేత
రచియింపఁబడెనో యోరమణి, రసార్ద్ర
మైన నీవాతెఱ! యానందదాయ
కంబైన వాసంత కల్యావో నీవు!

జీవరత్నకలాప చిత్రమకుటంబు
ఖద్యోతకాంతులఁ గనుబొమలపైనఁ
గురిపించు నోపెండ్లికూఁతురా, మనము
ఆశ్చర్య పారవశ్యంబున నీదు

చంద్రశిలా రమ్యశాల, రహస్య
లీల నన్యోన్యముఁ గేలఁగేలూని
విడిపోని మమతల విహరింపలేదె?
ప్రతినిశ గాఢనిద్రావేళ నీదు

సుఖకర నిశ్శబ్ద చుంబన స్పర్శ
ననుభవించుచు నుండు నలసటదీఱ.
జీవనాంభోధి వీచీమార్గ మందుఁ
బ్రాణికోటులఁ బరపారంబుఁ జేర్చు
నుడుపంబు నేర్పుతో నడుపంగఁ, బ్రకృతి
నియమించెనిన్ను; నో నిశ్చలకర్ణ
ధారిణీ! నవమూర్తి ధరియింపు మింక.
విపులపౌరాణిక విపిన సంచారి
ణీ! రుద్రమృత్యువా! నీకు వీడ్కోలుపు.

బిడ్డ : బాటసారి.

బిడ్డ

పై బాటలం బోవు నో బాటసారి,
నిసుగులకును నోట నీరూరునట్లు
దోరగిల్లి పసండి తీరులొలికించు
పండ్లగుత్తులు వీఁపు పైన వ్రేలాడ
నలసట సోలుచు నరుగుదెంచెదవు.
నీపయనం బింక రేపుమాపులను
ముగియదా యేమి యోముసలి తాతయ్య?

బాటసారి

నీవలె నొకనాఁడు, నిండారఁ బూచి
పచ్చితావులు చల్లు పన్నీరుపువ్వు
పోల్కి నవ్వుచు నేనుబుట్టితిఁ; గాని
పుడమి సంతను నాదు పొలుపునెత్తావి
వెదచల్లి, కారాకు విధమున నొంటి
నేఁగుచున్నాఁడ మాయింటికి నేఁడు
యుగయుగంబులనాఁటి సొగసైన పసిఁడి

పండ్లబరువులు వీఁపు పై మోచికొనుచు.
పలు గృహంబులకును బయనంబు చేసి
భవపిపాస హరించు పండ్లుఫలాలు
అలమట పడియైన నార్జించుకొందు.
ఎనలేని యైశ్వర్య మెపుడు గడించి
విశ్వసామ్రాజ్యంబు విలుతునో గాని
యంతదనుకను నేను నటికాళ్ళు లరగఁ
దిరుగుచుండెద నోయి మురిపాల బిడ్డ!

బిడ్డ

అట్లైన నింకెప్పుడలసట కోర్చి
పండ్లగుత్తులు వీఁపు పైనూఁగులాడ
నీవలెఁ జరియింతు నేను నీబాట.

బాటసారి.

చరియించుచున్నావు చక్కనికూన!

బిడ్డ

నీవలె నేనెపుడు నిఖిలవిశ్వంబు
విత్తంబుఁ గడియించి విలుతునో చెప్పుము?

బాటసారి

గడియించుచున్నావు; కడకొక్కనాఁడు
నేను బోయినదారి నీవు రాఁగలవు!

మే లు కొ లు పు .

ప్రత్యూష శ్యాంత నిర్మలాంబరమునందు
నరుణరక్తిమ వ్రాసె జయాంకములను;
జిమ్మచీఁకటి తెరలను జింపి వైచి
మేలుకొనుమమ్మ! యింకనైన మేలుకొనుము!

పవలు రేయు నతీంద్రియ స్వప్నములను
గనుచు నవియెల్ల సత్యమంచని తలంతె?
కలఁకును వీడుకోలుగాఁ బులుఁగు లిపుడు
గానములు సేయుచున్నవి; కనవొ? వినవొ?

నిద్రయే జీవనంబని నీకు మున్ను
నూరిపోసిరి మాయలమారు లెవరొ!
మచ్చు మందుల మతకమ్ము విచ్చిపోవఁ
గడపఁ గాల్మెట్టి లేయెండఁ గ్రాఁగుమమ్మ!

అపయశః పంకిలంబైన యాత్మకన్న
చచ్చుటే కొంత మానరక్షణము సుమ్మ;
పారతంత్ర్యభరంబున బడలి సడలి
యదవ త్రావుడు త్రావెదో యమ్మ, నీవు?

కాలగర్భంబునఁ దాఁగి కానరాని
భావిదృశ్యంబు కన్నులఁ బడినయట్లు
నలుదెసలఁ బ్రొద్దుపొడుపు నిగ్గులు రచించె
నభినవ జగంబు; ముసుఁగెత్తి యరయు మమ్ము.

కర్మ, విధిచేష్ట, దైవ నిగ్రహమటన్న
పిచ్చివేదాంతములఁ బోయెఁ బెద్దప్రొద్దు;
ఆత్మవిశ్వాస సూర్యోదయంబు కెలన
నిద్దుర తమంబు కాలొడ్డి నిలువఁగలదె?

వసంతోదయము.

ఏలొకొ మావులం జివురులెత్తుగఁ, గావ్యరమా కరంబులన్
మేలన మాడునట్లు నునునీడలు దేలుచు నందగించు? నే
మూలనునైనఁ జాల సుఖభోగ్యముగా ననిలంబు విచ్చుక్రొం
బూల యనుంగుఁదావి తడిపుప్పొడి తాఁకుల నామతించెడిన్.

ఎవరికి నెఱుంగరాక యే యింద్రజాలి
కుండు పీచెనొక్క నెమ్మికుంచె నిపుడు!
చెట్టు చేమలు విలసిల్లెఁ జిత్రగతినిఁ
బువ్వు లాకులఁ బిందెలఁ బుష్కలముగ.

కోకిలాగంతుకులు మావికొమ్మ లెక్కి
యాలపించెద రిష్టు డయాచితముగ
హృదయ సంస్పర్శి రాగంబు! నే నియంత
వారి కాహ్వానపత్రికఁ బంపినాఁడు?

గఱిక మొదలుగఁ దారకాగణము వఱకుఁ
గలుగుసృష్టి నీరవభాషఁ దెలుపుచుండె
నవ నవోజ్జ్వల సుఖజీవనప్రభాత
దివ్యసందేశమును నేఁడు! తెలిసెఁ! దెలిసె!!

ప్రభువసంతుఁడు నందన వనమునుండి
యాత్రసేయఁగ భూమిపై కరుగుదెంచె;
నతఁడు విడిసిన తలము లల్లవిగొ! పచ్చ
నాకుల గుడారముల పట్నమనఁ జెలంగు.

పండితప్రతిజ్ఞ.

మొన్నటి పుష్యపంచమికి ముప్పదియేండ్లవయసు చెల్లె, నింకెన్నిదినంబు లీగురువునింట వసింతు? సమస్తశాస్త్రముల్ తిన్నగ నేర్చుకొంటి 'మన తిమ్మయశాస్త్రి కుమారుఁ డెంతలో మున్నతి కెక్కె' నంచు నను నూరిజనుల్ వినుతింతు రెప్పుడున్.

సగము ప్రాయంబు విద్యావిచార మందె
కడచె; సంసారసౌఖ్యంబుఁ బడయ నైతి;
గొప్పవారింటఁ బెండ్లాడఁ గోర్కె గలదు,
కాని, దారిద్ర్యదోషంబు కంటకంబు.

ఎవరి నడిగినఁ గాని 'మీ కెంతయాస్తి?
పెండ్లికూఁతురి కే నగ పెట్టఁ గలరు?
ఇంటిమర్యాద లెఱిఁగి మా హెచ్చు నెంచి
పెండ్లివేడుక నడుపంగఁ బ్రీతి గలదె?'

అని, మఱి యేమొ యేమొ మరియాదలుగీదలు దెల్ప నోర్పుతో వినివిని, చీదరించుకొని, పెండ్లిపెడాకులు మానుకొంటి; నైనను జెలికాఁడు నామనమునం దొక కోరికవిత్తు నాఁటి తియ్యని నుడికారపుం దడిని నంకురమెత్తఁగఁ జేసి యిట్లనెన్:

'జను లనుకోఁగ వింటి; నెలజవ్వని, తాఁకినఁ గందిపోవు మెత్తని చివురాకుమేను, కనుదమ్ముల లోకము మోహపుచ్చు మోహనమగు నింద్రజాల మదో యాడుచునుండు, వివిక్తకాననంబున సెలయేళ్ళకూలములఁ బూఁబొదరిండ్ల వసించునొంటిగన్.

'పేరు కవిత యంట, పెద్దలుం బిన్నలు
గారవింపఁ బెంపు గాంచునంట;
ఇష్టమున్నఁ, గోర్కె లీడేర్పఁ దనకుఁ దా
వరుని సరసహృదయు వలచు నంట!

'కులముం జూడదు, డబ్బు గోరదు, మనఃకూలంకష ప్రేమతో వలచుం దాను గుణాఢ్యునైన; నెటు నిర్బంధించి కామింప భూవలయాధీశునకైనఁ గానిపని; నీ పాండిత్యముం జూపి యా పొలఁతిన్ లోఁగొనుమన్న' మాటలు మదిం బూరించెఁ బేరాసలన్.

అఖిలశాస్త్రపురాణేతిహాసములను
సంస్కృతాంధ్రకావ్యకలాప సంపుటముల
మూటముల్లెలుగాఁ గట్టి మోసికొంచుఁ
దరలితిని గవితా స్వయంవరమునకును.

జనకుఁ డొసఁగిన దేవతార్చనపుఁ బెట్టె
నంచు చినిఁగిన మడిపట్టుపంచెఁ జుట్టి,
చంకఁ దగిలించి, వెలిబూది సంచిగూడఁ
బదిలముగ దాఁచికొని దారిఁ బట్టినాఁడ.

తలయూఁచినపుడెల్లఁ దళతళద్యుతి నింపు
మకరకుండలములు మాకు లేవు;
పాండిత్యమున కనివార్యలాంఛనమైన
కాశ్మీరశాలువఁ గప్పలేదు;
లలితంపుఁ గవులగుండెలు ఝల్లుఝల్లన
గండపెండారంబుఁ గాలఁ దొడుగ;
మునుకొని తనకిన్న మూఁడు బారెఁడు వోవు
బిరుదు పేర్లెన్నరైనఁ బెట్టరయ్యె!
ఐనఁ గానిమ్ము, నా కున్నయంతవట్టు
కేమి లోపంబు లే దెవ రేమి యన్నఁ
గంచుగంటపు వ్రాయసకాఁడఁ గానె?
మిగత భారంబు దైవముమీఁద నిడితి.

అని తలపోయుచుం, దుదకు నా కవితాలలితాంగిఁ బెండ్లియాడినగతి మోర ఠీవి, నడ పెక్కు సుమాళము సందడింప లోఁ దొనికెడి భావి భోగ పరితోషపు భావన తెప్పలార్చుచున్ వనమున కేఁగుచుండె మనపండితశాస్త్రి జయాభిలాషతోన్.

చనిచని కొన్నినాళులు, వసంత శుభోదయవేళఁ గొండదాపున దిగఁజాఱువాఁక కిరు పుంతలఁ బూఁబొద లందగించు చక్కనివనిఁ జొచ్చి, దప్పి నడగాసియుఁ దీఱ జలంబుఁ గ్రోలి, చల్లని పొదరింటినీడఁ బదిలంబుగఁ గూర్కొ సుఖంబు చేకుఱన్.

అంతలోన నెండ యారాట మొక్కింత
దొలఁగఁ బూలగాలి తోడ వీచెఁ;
కొండసెలల సడులు, కోయిలపాటలు
మిళితమయ్యె నొడలు పులకరింప.

చివురాకుల్ వెగమేసి పోతరమునం జెంగించుచుం దాఁటుచుం
దవుదవ్వేఁగుచుఁ గొమ్ము పుట్టుతఱిఁ బంతాలాడి కండూతి వో
వ వడిం ముస్తల డీలుచుం హరిణశాబంబుల్ వినోదించుఁ గే
ళి విహారంబుల నిర్భయంబుగను, వల్లీచ్ఛాయ లాసించుచుం.

అట్టి నవమోహనారణ్యమందు నొక్క
మావికొమ్మకు నల్లిన పూవుఁదీవ
తూఁగుటుయ్యేలఁ గూర్చుండి, తునిఁగి రాలు
విరుల జడిగొట్ట నొక వన్యతరుణి యూఁగు.

ఆ వలపించుతొయ్యాలి కొయ్యారము నేర్పఁ గలాపి ప్రేమ సం
భావనతోడఁ గుత్తుకను బయ్యెదమీఁదుగ మూఁపుఁజేర్చి పూఁ
దావులఁ జల్లు కొప్పివ్వెద తలాపిని మో మరమోపి, మెత్తగం
జేవిరితెక్కపై నిమురఁ జెల్వ యొడింగను మోడ్చి హాయిగం.

కోయిలపాటకత్తె తనకూఁతల తప్పుటెలుంగు దిద్దికోఁ
బాయక యభ్యసించుఁ జెలి షడ్జమ పాఠము; గోరువంక క
త్యాయతశిక్షణైన దొసఁగంతయుఁ బోదు; సమర్థుఁడౌ గురుం
డైయును జక్కఁజేయఁగలఁడా ప్రతిభా పరిహీన శిష్యులం?

అపుడే నిద్దుర లేచి పండితుఁడు, నుయ్యాలూఁగు నా లేమ యం
దపుఁజందంబునుజూపు రేక వెలుఁగొందంగాంచి యూహించుఁబో
ణి పదాబ్జంబుల మ్రొక్కనం దొలఁగవే నిర్మూలమై పాపముల్!
అపురూపంబిటువంటిమూర్తి యని వెయ్యాఱుల్ విలోకించుచున్

పలుకరింప నెంచి, పలికిన నేమేని
బెడఁద వచ్చు నన్న బెంగతోడ
నీళ్ళు నములుకొంచు నెత్తిగోఁకుచు నిల్వఁ,
జూచి చూడనట్లు చూచి చెలువ;

ఉయ్యాల డిగ్గి, పయ్యెదను నోర ముసుంగిడి, జవ్వనాపు లా
గియ్యది యన్న పోల్కిఁ గను లెత్తియు నర్ధనిమీలితంబుగా
న య్యలినీలవేణి నడయుందము దోఁపఁగఁ జెట్టుచాటుకుం
జయ్యనఁబోయి తేనియలుజాల్కొనఁబల్కెఁదెనుంగుమాటలన్.

సిగ్గు పైకొని చెక్కిళ్ళు జేవురింప
సగముసగముగఁ బల్కె నా సొగసులాడి:
' అతిథులరు, మీకు స్వాగతం ' బన్ననుడులు
పడెను జెవిలోన విని వినఁబడని యటులు.

ముగుద మాట సూదిమొన మోపునంతటి
సందుఁ జేయ నళుకు జాఱవిడిచి,
పండితుండు పల్కె: ' వనిత, నీవెవతెవ్వు?
ఒంటికత్తె విచట నుండ నేల? '

అన విని, కాంత: ‘ నేఁ గవిత నయ్య, వనాంతరసీమలందు నే
యును బవలెప్పుడుం బ్రకృతియుత్సవముం దిలకించుచుం, బికాం
గనలు మయూరముల్ సఖులుగాఁ బరిచర్యలుసల్ప నొంటిగన్
దినములఁ బుత్తు జవ్వనముఁ దీరును దియ్యము శాశ్వతంబుగన్.

‘కలికీ, యెంతటివింత! నీవె కవితా కళ్యాణివా? బాపురే!
తెలియం జాలకయుంటి, నీకొఱకు నే దేశాలు పట్నాలు కో
టలు పేటల్ గిరు లేళ్ళు దాఁటుకొని మూఁటముల్లె భారంబునన్
దల చెప్పట్టగ బట్టగట్టి విసుగెత్తన్ వచ్చితిం గానమన్.

‘నిన్నుఁగూడి ధర్మనియుతులఁ బాల్గొనఁ
దలఁచి వచ్చినాఁడ, వలచినాఁడ;
నన్నుఁ ద్రోసిపుచ్చ న్యాయంబె? వైదిక
విధిహితంబుగాఁగఁ బెండ్లియాడు.

‘అన్నవేళకు నతిథు లభ్యాగతులును
నింటికరుదెంచి కూర్చుండ, వంట గింటఁ
జేయ నిల్లాలు లే దని చెప్పలేక
తెగఁబడితిఁ గాంత, యాకొఱ దీర్పు మిఁక.

‘హేమంతమున నైన నేటిపేట మునింగి,
మడిదోవతులు పాఁతమైల లుదికి,
యిలు నూడ్చుటాదిగాఁ గల ప్రాఁచిపనులెల్ల
విసుఁగు వేసట లేక వెళ్ళఁబుచ్చి,

దేవతార్చనవేది దీపంబు వెలిఁగించి
బానసంబున వంటపనులఁ దీర్చి,
యిరుగుపొరుగు నిండ్ల కేఁగక తనయిల్లు
కనిపెట్టుకొని, దూది పెనఁచి దివ్వె
వత్తులను జేయుటో, లేక వలయు విస్త
రంట్లు గుట్టుటో, తడిబట్ట లార్చుటయునో
గాక యిల్లాలి కింకొక్క కార్యమున్నె?
యట్టి గృహిణీపదంబు నీ కౌను చాన!

‘వేద వేదాంగముల్ వివిధ పురాణేతి
హాసముల్ నాబుద్ధి నరగిపోయె;
పంచకావ్యాల నేపట్టున నేశ్లోక
మడిగిన వల్లింతు నప్పుడపుడె;
ఆఱేండ్లు పాణినీయము పీల్చి పిప్పిఁ జే
సితి, నది నాయందె జీర్ణమయ్యె;
వసుచరిత్రంబున వ్యాఖ్యాన యుతముగ
శ్లేషభంగుల విమర్శించినాఁడ;

కడకుఁ జిన్నయసూరి వ్యాకరణ మెల్లఁ
బుటలు మలినంబుగాఁగ నెప్పుడును జదివి
సిద్ధివడిసితి; నమరంబుఁ జిత్తశుద్ధి
తో నుపాసించి పొందితి దొడ్డఫలము.

'శాకుంతలములోన శతసహస్రములుగ
వ్యాకృతిదోషముల్ బయలుపఱతు;
భవభూతిసాహిత్య భాండార మెల్లను
గాసుకుఁ గాకుండఁ గడిగి వైతు;
బాణుని శ్రీహర్షు భారవి ఝాడింపఁ
దోలిదెబ్బకైనను నిలువఁ గలరె?
తిక్కయజ్వకుఁ దలతిక్క మాన్పెద నన్నఁ
జెరపిగా నొకనాఁడు తీఱలేదు;

ఇంకఁ దక్కినవార లదేమి లెక్క?
ముక్కుఁ బట్టినఁ బ్రాణంబు మొదలె పోవు;
కాంత, నాకన్న నేర్పరుల్ గలరె చెపుమ?
నేను ననుఁగూర్చి పొగడుట నియతిగాదు.

'సత్కవి, ప్రబంధవేంకటేశ్వర విజయ వి
లాసకర్త నామది కెక్కులాగు' వ్రాసెఁ
గాని, కొందఱు పాండిత్య గర్వితా వి
హీనతను దాఁచ, రస మని యేడ్చినారు.'

అని తనమాటముల్లెలు రయంబున విప్పి: 'నెలఁత,పొత్తముల్
గనుమ, యధీతమయ్యెనివి; గ్రంథములెన్నియొమోయలేకయుం
టను బదిలంబు చేసితిని; నా శ్రమ లెల్లను జింతచేసి సక్కఁ
గనుమ కృపాకటాక్షములఁ గామిని, నీ మన సేమి చెప్పుమా!'

తనకుఁ బరమశత్రుఁ డెనలేనిఛాందసుం
డింత కెట్టులో దొరకె; నింతతోడ
విడువరాదటంచు వెలఁది సంతోషించి,
హాస్య మనుభవింప నభిలషించి:

'ధర్మశాస్త్రమెల్లఁ దనువున జీర్ణించె
నిగమవిధులయందు నిధులు మీరు;
అట్టి లోట దలఁప కెట్టుల నీనాఁడు
కులటతోడఁ పొందు గోరినారు?'

అనిన విని, ఛాందసుం డప్పు డదరి లేచి:
'వెలఁది యేమంటి? నీ వెట్లు కులట వైతి?
బహుపతిత్వము స్త్రీలకు భావ్యమగునె?
ధర్మవైరుధ్య మకటా! దాపురించె.

'ఇందుకా నేను బలుపాటు లెల్ల సైఁచి
యింత దూరమ్ము వచ్చుట యెమ్మెలాఁడి?
బ్రహ్మచారిని, బ్రాహ్మణపండితుఁడను
కులటసాంగత్య మేరీతిఁ గోరుకొందు?'

అని కపటంబులేని వెత లాననసీమను దేలియాడఁ: 'గా
మిని,కులటత్వ మెట్టు లను మేయము నీయెడ' నన్నఁ గాంతయున్
మనమున నుబ్బుహాస్యరసమాధురి కన్నులఁ జిప్పిలంగ లోఁ
గొని మొగమందు మాయవగఁ గూర్చి వచించెఁ జరిత్రమంతయున్

'వాల్మీకి ముసలితాపసి యయ్యు నను గూడి
రమణీయ కళలఁ గరంచి యేలెఁ;
గాళిదాసుఁడు బిగ్గఁగౌఁగిట లాలింప
శృంగార భోగ నిర్వృతిని గంటి;
భవభూతి పాండిత్యపటిమతో శాస్త్రస
మ్మతముగ ననుఁ గూడిమాడినాఁడు;
భట్టబాణ మయూర భారవి ప్రముఖులు
దివ్యభూషాపేక్ష దీర్చినారు;
నన్నపార్యుఁడుఁ దిక్కన మున్నుగాఁగఁ
దెలుఁగుఁగవు లెల్ల నాముద్దు సలిపినారు;
పాఁతవారల యనుభోగ్యపటిమ సడలఁ
గ్రొత్తగోవాళ్ళ నాసించి కూడుచుందు.'

అన విని పండితుం డనును: 'నందఱు ముంచిన ప్రాఁతలంజ వ
య్యును బడుచుందనంబుఁ గనులోరలఁజూచెడి ముద్దరాలిసొం
పును,దనుసౌష్ఠవంబు, వలపుంబస, లెట్టులుగాచి యుంచితో
వనిత? శరీర రమ్యతకు బ్రహ్మ వినీతిని గూర్పఁ జేలొకో? '

అనుచు గ్రంథంబు లెల్లను నట్టె జవిరి
మూటముల్లెగ సవరించి: 'పొలఁతి, నేను
బోయి వచ్చెద, మన పొందు పోసఁగ ' దనినఁ,
జెలియ చిఱునవ్వు నవ్వుచుఁ జెంతఁ జేరి:

ప్రేముడితోడ నాయురము బిట్టుగ నీ 'కవుఁగింటఁ జేర్ప కే
హోమనుధర్మశాస్త్రరత, యూరక పోయెదె' యంచుఁ దెచ్చికో
ల్దీమస మూని కౌఁగిలిడఁ దేరకుఁ దత్తఱమంది చూచు చే
మేమొ వచించుచుం గనుల నెత్తక చేతుల నూడఁబీఁకినన్.

ముద్దుమాటలు వల్క మోము చిట్లించుచు
శబ్దసంస్కారంబు చాలదనును;
అడవిపూఁదొడవులఁ దొడిగియుండుటఁ గాంచి
యీ యలంకృతి లోప మెసఁగె ననును;
మురిపంబు దళుకొత్త మోవి యానఁగఁ బోవ
నెంగిలి రస మంచు నీసడించు;
బలిమిమై గిలిగింప నులికి బారెఁడు దాఁటి
జిలిబిలి నడలెల్లఁ జెల్లవనును;
పెట్టరానట్టి సిలుగులఁ బెట్టి చెలువ
యాటపట్టించి చెర్లాట మాడుమండఁ,
గానసంబున నేడనో కానరాక
మురళిరావంబు వినవచ్చె మోహనముగ.

పూలగుత్తులఁ గాంచి పునికి ముద్దాడును,
పికమనోహరగీతి విన్న మెచ్చు,
సెలయేళ్ళపాటలఁ జెవియొగ్గి యాలించు,
రాలుఁబువ్వుల నేరి మాల గ్రుచ్చు,

పొదరిండ్లలోఁ దూఱి పొదలయల్లికఁ జూచు,
నడవిజంకల తోడ నాటలాడు,
సాంధ్యారుణాంకిత జలద ఖండముఁ గాంచు,
వనరామణీయకమును దలంచు,
మధుర రసము తనదు మనమునఁ దొలఁకాడ
లోకమెల్లఁ దేనెపాక మనును;
నిట్టి మృదులహృదయుఁ డెచ్చోటనుండియో
పిచ్చివానిపోల్కిఁ వచ్చుచుండె.

ఆతనిఁ జూచి కాంత, తన యాతు నెఱింగినచెల్మికాఁడు, సాంధ్యాతపకాంతులం బ్రకృతియాదముఁగాంచఁగ నేఁగుదెంచెఁ;దా నా తరుణుం డొకళ్లొకరి యంసమునం జెయివైచి ముగ్ధసంగీతములన్ రసంబు లొలికింపఁ దలంపులు దీవరింపఁగన్;

వచ్చి రాక మున్నె వరునిఁ గౌఁగిటఁ జేర్చె
మూఁతవడ్డ కనుల ముత్తెసరుల
గతినిఁ బ్రమద బాష్పకణములు చిప్పిల్ల
నొడలఁ బులకనాటు లుప్పతిల్ల.
రెండుకీలలు నేకమౌరీతి నిరువు
రొక రొకరి కౌఁగిళులోన నుండి రపుడు;
వసుధఁ బ్రతిదియుఁ బ్రణయ పిపాసతోడ
నొకటినొకటి నాశ్లేషించు నొప్పు దోఁచె!

అనిమిషత్వము నొంది యాయుష్కృతంబు
నరయుచుండెను శాస్త్రి నోరంత దెఱచి;
యంతఁ గౌఁగిలి వీడి యీ యబలశ్రీ
పిన్ననవ్వులు మోమునఁ జిన్నెలొలుక:

'చాలిఁక! శాస్త్రిగారు, శ్రమ చాల సహించిమ దర్థమయ్యెయో
కాలుకుఁ గాలు గొట్టుకొనఁ గానసీమకు వచ్చి, యింత కే
మేలును బొందకే తిరిగి మీపురిఁ జేరుటఁ జూడ నాకునున్
జాలిజనించె; దైవముప్రసన్నముగా, దీఁకఁ బొందు' నాపుషుణ్;

ఈర్ష్య యొకవంకఁ, బరిభవ మింకనొక్క-
కడను, జిత్తమ్ముఁ జుఱచుఱఁ గాల్చుచుండఁ
గటము లదరఁగఁ గనుబొమల్ నటనసేయఁ
బండితుఁడు పళ్ళు బిగఁబట్టి ప్రతినచేసె:

'నేనే తిమ్మయశాస్త్రిపుత్రుఁ డయినన్ నిత్యమ్ముఁ గాత్యాయనీ
ధ్యానారాధహృదబ్జతన్ విధుల సద్ధర్మంబులం బ్రత్యుష
స్స్నానంబుం బొనరింతు నేసిఁ గవితా, సత్యంబుగా నీ జిగుల్
సీనాశంబు నొయారి యంచనడలున్ నిర్మూలముం జేసెదన్.'

అని కోపంబున మాటముల్లెగొని సంధ్యావందనాపేక్షచే
వనమార్గంబునుబట్టి యేటిదరికిన్ బాండిత్యవాహుఁడు పో
యిన, నా యిద్దఱు నెచ్చెలుల్ వనవిహారేచ్ఛన్ నదీసైకతం
బునకుం బోయిరి జంటఁ బాయకమనంబుల్ దేహముల్ వత్తిలన్

సందెచీఁకటిలో నెదో చాయనుండి
వీనులం బడె నశరీరగాన మొుఁము;
ప్రకృతి నిదురించె నాజోలపాటలోని
తియ్యదేనియ లక్కఱ దీఱ నాని.

29-12-1923

అనార్కలి.

అతిలోకసుందరీ, యవనకుమారి,
ఓ మోహమాధురీ, ఓ యనార్కలీ,
ఏలోకో యీవేళ నిహలోక రంభ
వేషంబు ధరియించి వీక్షణంబులకు
నవ్యక్త మధుర దివ్యానంద లాభ
మొనగూర్చెదవు నర్తనోన్మత్త గతుల?
అగ్బరు పాదుషా హర్మ్య మంటపము
అప్సరః పాద యావాంక పల్లవిత
సురనాథ సభపోల్కి వఱలె నీకతన;
అనుభూత పూర్వంబులౌ కోర్కెలెల్ల
మరల మోసెత్తె నా మధుమాస నిశల!
విరఁబూయు రోజాల వింతనెత్తావి
నాసవ పరిమళ మైక్యంబు నొంది
సంయమి మతినైన సడలించు నిపుడు;
అర్ధ నగ్నాంగియా యచ్చరవోలె
నయన నిర్వృతిఁ గూర్ప నటియించె దార!

ఏ భావనస్పర్శ, మే రసావేశ,
మీ యపూర్వపు రాగ మీమూర్ఛనంబు
రేఁపెనో గాని నీ హృదయ విపంచి
నానంద మదిరాబ్ధి యపర పారమునఁ
గనక సైకతమునఁ గాలు మెట్టెదవు;
గాలిలోఁ దేలిన లీల భూతలము
నడుగు లంటీ యంట కమర నాట్యంబు
నొనరింతు వహ్వరే! నీవ్వూర్వేడు నపుడు
పైకిఁ గ్రిందికిఁ బోవు పాలిండ్లతోడ
సభ్యుల భావంబు స్వర్గమర్త్యముల
నడుమఁ ద్రిమ్మరుచుండు నాఁడె విధాన;
మంజీర కింకిణీ మధుర రావముల
జంగమ వీణలై చరణముల్ మ్రోసె;
అను నిమేష నవంబులై యంగ భంగు
లలరెఁ గన్నులపండువౌచు నాట్యమున;
సంభ్రమించె మనంబు, చక్కందనాల
పడుచుదానా, నీవు ప్రణయనాట్యంబుఁ
జాలింపుమింక! నాస్వర్గమునఁ దక్క
నింత సంతసమున కిలఁ దావు లేదు;
చావైనఁ దీపె యీసమయంబునందు!

ఓ యనార్కలి, రాగోజ్జ్వలపాద
పల్లవంబుల నేల మెల్లగా నిడుము,
మా చిత్త చంపకమాల లచ్చోట
స్పర్శ సుఖాపేక్షఁ బడియున్న వవిగో!
ఈ విలాసంబున కింకేది హద్దు?
ఈ నాట్య లహరికి నేది కూలంబు?
ఈ రసోన్మత్తత కేది యంతంబు?
ఈ రాగవీచుల కేది మూర్ఛనము?
మగరూపు దిద్దిన మగఱాతి కైనఁ
బ్రేమ రసంబులు పిచ్చిల్లె నన్న
సకల భోగంబులు చవిగొన్న రసికుఁ
డా జహాంగీరుని యాత్మ యింకెట్లు
పరవశంబాయెనో భావింపఁ దరమె?
ఆ యనార్కలి మోహన మూర్తిఁ గాంచి,
ఆ కన్య యంగవిన్యాసంబుఁ జూచి,
పాప! మా యువరాజు వ్యంగ్యగర్భముగ
దరహాస మొనరించె; దానికి మాఱు
పేఁతగా ముద్దియ చిఱునవ్వు నవ్వె;
ఆ నవ్వు దర్పణంబందు బింబించి
ప్రక్కన నేఁగు నగ్బరు కంటఁబడియె.

కనుబొమల్ ముడివడెఁ; గను లెఱ్ఱనాయె;
నిరయ ధూమంబట్లు నిట్టూర్పు వెడలె;
ఒడలెల్లఁ గంపించె; నోర్పు నశించె;
నగ్బరు పాదుషా యసురయై నిలిచె!
అయ్యయో! చల్లని యంబుద చ్ఛాయ
నటియించు నెమిలిపైఁ బెటిలెరా పిడుగు:
నర్తకి పదములు నాట్యంబు మానె;
వీణా నినాదంబు విశ్రాంతి గొనియె;
బానిస లెల్లరు భ్రాంతులై చనిరి;
చంచలా లతిక నిశ్చలత మాఱ్పడియె;
నందజిమోముల నడలు గన్పట్టె;
మధుపాన పాత్రికా మర్మరధ్వనులు
శమియించె, సభ్యులు క్షణములో నెటకొ
జాఱిపోయిరి, జహాంగీరు నర్తకియు
నగ్బరు దప్ప నింకచట లేరెవరు.
కనుఱెప్పపాటులోఁ గమనీయ దృశ్య
మాభీల మరుదేశ మట్లు మార్పడియె.
కుపితుఁడై యగ్బరు కొడుకును గాంచి:
'ఓరోరి దుశ్శీల, యో నీతిహీన,
ఆభిజాత్యం బేడ! ఆతొత్తు కూఁతు

పైని మోహాఁ బేడ? ఖానిస వైతే?
ఎవరురా లష్కరు? లీ యనార్కలిఁ
గొంపోయి యిప్పుడే గోరిపెట్టుండు'
అని యాజ్ఞ పెట్టి రాజరిగె లోపలికి.
విగత చైతన్యుఁడై వెలవెలవాఱి,
యొక్కక్షణంబులో యుగములు గడపి,
రాజాజ్ఞ ద్రిప్పనేరక వ్రేలుకఱచి
శోక దావాగ్నిచే శోషిల్లి, మాట
లాడఁ జాలని యా జహాంగీరుఁ గాంచి:
'ఓ జీవితేశ్వరా, యుమ్మలంబేల?
నాప్రాణ మూల్యంబునం గొంటి నీదు
ప్రణయ బంధంబగు బాహు బంధనము;
అద్దాని నామెడయందుఁ గీలింపు'
మనఁగ, జహాంగీరు ఆముద్దులాఁడిఁ
కౌఁగిటిలోఁ జేర్చి కన్నీరు దుడిచి,
నును గులాబీపూల కెనయౌ కపోల
ములు వేఁడియూర్పుల వెలవెలవాఱఁ
గడసారి ముద్దిడి కన్నీరు నించె.
'ఇంకఁ జావైన నా కిష్టమౌఁ బ్రియుఁడ,
సెలవిమ్ము స్వర్గానఁ గలిసికోవచ్చు.'

అని యూరడించుచు నా యనార్కలి
విడరాని కౌఁగిలి విడిపించులోన,
'రమ్మ, తడయంబోకు, రాజాజ్ఞ యయ్యె'
నను చౌకభటుఁడు ప్రేయసి వెంటనడిచె;
యువరాజు హృదయంబు, యువతి దేహంబు
కర్కగోరీయందె యునికి గైకొనియె.

ఏమి యీగారడి! ఏమి యీమాయ!
ఏమి సుఖస్వప్న! మేమి మేల్కొలుపు!
పెదవి పాత్రలమధ్య విశ్వ విప్లవము
జరుగు నవకాశంబు! సంసారమింక
గఱికయుం బట్టని కాటిచాడేన?
సన్న్యాసి, నీకొక్క క్షణము జయంబు!

ఓయి యక్బరుషాహి, ఓకఠోరాత్మ,
ప్రణయంబునకుఁ జావె ప్రతిఫలంబేని
అవనియెల్ల శ్మశానమట్లు మార్పడదె?
నీతికిఁ జిహ్నంబు నిర్దయత్వంబె?
మానవ తత్వంబు మఱచిపోయితివో?

ఓ యనార్కలి, మాయుల్లంబునందు
నీకాలి గుర్తుల రేక లగపట్టు;
ఈర్ష్యామయంబైన యీలోకమందు

నిలువ నీడైనను నీకు లేదమ్మ!
కల్పసుమంబవై గంగాతరంగ
శీతల శీకరాసేచనం బొంది
చల్లగా బ్రతుకు నీ సౌఖ్యంబుమాన్పి
ఏ పాడుగాలి నిన్ని వల్లకాటి
దుమ్ములోఁ బడవైచె? తుద కెండవాడి
ధారుణీ గర్భగంధంబు సొంపెక్క
నీదు నెత్తావులు నింపుచున్నావె!
నీ రమ్యలాస్యంబు, నీ సోయగంబు
గాంచ మర్త్యులకు యోగ్యతయుండఁ బోదు;
నక్షత్రమండల నాట్యరంగములఁ
జంచలా లతికల సాహచర్యమునఁ
గాన్పించుమా నీ యగణ్య సర్తనము!
పన్నీరు పూఁబొదల్ ప్రక్కల బలిసి
నీ గోరిపైఁ జల్లు నిత్యమ్ముఁబూలు;
కవులు కన్నీటిబిందువుల నీ గోరిఁ
దరతరంబులనుండి తడుపు చున్నారు.
ఎందతొందటో పాంథు లెన్నెన్నిమార్లొ
నిట్టూర్పు సెగల నెండిన పూలుచల్లి
గౌరవించిరి నీదు గోరీని సఖియ!

ఓ వెళ్లు యాత్రికా, యొక్కమాత్రైనఁ
పాంచాల భూమికిఁ బయనింతువేని,
లాహోరు నగరవిలాసంబుఁ గాంచ
నరిగెదవేని, నీ వా యనార్కలి
ధన్యసమాధిని దర్శించి రమ్ము! ౧౪౧

వానాకాలపు పల్లెజీవితము.

శ్రావణనీలమేఘముల చల్లనినీడలఁ బెంపు నొంది, క్రొం
దావులఁ జల్లుచుం బొలముదాపునఁ బూచెను గేతకంబు; తే
తావులనైన యౌవనముఁ దాల్చె వసుంధర పైరుపచ్చలన్;
ఆవులు కండపట్టెఁ దనివారఁగఁ బచ్చిక మేసి బీళులన్.

కాఱుమొయిళ్ళపైన హరికార్ముక రేఖలు స్వర్గపట్టణ
ద్వారపుఁ దోరణంబు సరిదాఁక, బలాకలు మాలగట్టి యా
దారినె సంచరింప, నిశితత్వముఁ బాసిన సూర్యరశ్మి లేఁ
బైరుల సేవఁ జేయఁ గనుపండువుఁ గొల్పు దినంబు లివ్వియేన్.

ప్రకృతి లీలావిలాస కావ్యంబునందు
రసవదధ్యాయమేమొ వర్షంపు ఋతువు!
కానిచోఁ దదధ్యేతలౌ కర్షకులకు
నెటులఁ బరనిర్వృతిం గూర్చు నింపెలర్చు?

పనిపాటుల్ ముగిసెం గదా, యిఁకను లేఁబ్రాయంపు టిల్లాలితోఁ
దనపైఁ బ్రక్కలఁ ద్రొక్కి మూఁగు పసిసంతానంబుతో వర్షపున్
దివముల్ తిన్నగఁ బుచ్చవచ్చునను నుద్దేశమ్మునం గాఁపు గ
న్గొనుచుండుం దన పైరుచేల శ్రమకున్ జోడైన సంతృప్తితోన్.

కలకల నవ్వుచుం గలుపు గంటలు దీయుచుఁ బాట పాడుచుం
బాలములఁ జుక్క గుంపటులఁ బోడిమిఁ జూపెడి పల్లెటూరితొ
య్యాలుల నిసర్గ రమ్య దరహాస విలోకన చేష్టలందు ని
ష్కలుషపు గ్రామ్యజీవనపుఁగస్పందనంబు బళే! గుబుల్ కొనుఁ

ఎన్నియిక్కటులుండిన, నేమియైనఁ,
గుడువఁ గట్టను నొకవేళఁ గొదవయైనఁ
బ్రకృతి సామీప్య జీవన భాగ్యమొకటె
యున్న కడగండ్ల మఱపించు నూఱడింపు.

అక్టోబరు 1924

కవిసంశయావస్థ.

కవితా, వింతయౌనర్చె నీదగు నుపేక్షాభావముం జూడ, హే
తువు లేవేనియు లేక నాపయి నసంతుష్టిం బ్రదర్శించి క
న్గవకుం గన్పడనైనఁ గన్పడవు; సఖ్యం బిట్లు మూన్నాళ్ళ భా
గవతంబయ్యెనె? తెచ్చికోలలక వేడ్కల్ మీకు సామాన్యముల్

వలపుఁ బరీక్షసేయ నిటువంటి విరాగముఁ బూనినావొ? నీ
చెలిమియె సన్నగిల్లెనొ? విశేషత నాయెడ నంతరించెనో?
పిలువని పేరఁటంబునకు వేమఱుఁ బోఁ గడుఁ జుల్కనంచు నో
చెలియ, బిగింపుఁ జూపెదవు? చెల్లెను వత్సర మింతమట్టుకున్.

నిమిషములోన నీమొగము నీడగఁ గన్నులఁగట్టి 'నేది?' యం
చమితపు టాస నే దెసలనారయ, మాయలమారివౌచు వే
గమె కనుచూపు దాఁటెదవు! క్రౌర్యము నీకు వినోదమేని నా
కమలిన సున్నితంపుటెదఁ గమ్మగ విందొనరింపు మంగనా.

వరిచేలం గడసంజలందుఁ దిరుగన్ వాంఛితు నేగాని, నా
సరసన్ నీవుచు లేమి, మున్నటుల నచ్చంబైన యానందముం
బొరయంజాలకపోతి, జీవితమె దుర్భాగ్యంబుగాఁ దోఁచె; బం
గరు స్వప్నంబు తటాలునన్ మఱచెఁగె; ఱెక్కల్ భారమై క్రుంగెడిన్

ఇట్టి దాఁగిలిమూఁతల నేఁత దనుక
నన్ను వంచింప నెంచెదో చిన్నదాన?
రసపిపాసల నడఁచు నీరమ్యమూర్తి
మెఱుపువలెనైనఁ జూపించి మఱఁగి పొమ్ము.

జలదపథంబునం దిరుగు చక్కని చుక్కనె యయ్యు నాపయిం
గల ప్రణయంబునం బసిఁడిగద్దియ డిగ్గి పొలానఁ బచ్చకం
చెలకడఁ గూరుచుంటివి కృషీవలబాలిక యట్లు; గడ్డిపూఁ
సిలిరుల కానుకతోఁ బ్రథమదర్శన ముత్సవమయ్యెఁ దొయ్యలీ.

ఆ దినం బాది యిరువురి యాత్మలందు
వలపుఁదీవియ లల్లెఁ; బూవులును బూచె;
ఫలము లట్టుల సంతానభాగ్య మబ్బె;
నింతకాలాని కేల నీ కిట్టి యలుక?

నీవు రాణివె యాఁదువు; నేను బిచ్చ
మెత్తు పిచ్చిబికారినె; యిద్దఱకును
దారతమ్యంబు కొండంత; తరుణి యింత
పోల్పలేనైతి; నిను నమ్మి మోసపోతి.

'కడపటి వీడుకోలె' మన కౌఁగిలియొత్తుల మగ్గలాటకుం
గడపటి వీడుకో లగుటగాదు గదా! యదియేమొ నీవు నన్
విడుతువటన్న సంశయము వేమఱు జీవితవీణయందు కీ
ల్వదలిన తంత్రియట్లు వికలంబుగఁ బల్కు నపస్వరంబులన్.

క వి త

ఓయీ పచ్చపొలాల కాఁప, యిఁక నీయుల్లంబె శోధింపుమా,
హేయంబౌ యపరాధకల్మషము నాకే గట్టయత్నింతు వో
హో! యీ నైపుణిచాలుఁజాలు! నట నీయుత్సంగసౌఖ్యంబు నెం
తో యాసించెడి చిత్రరేఖ విడి నాతోడేల నీకిప్పుడున్?

నేఁటికైనను నాయున్కి నీకుఁ దలఁపు
వచ్చె, నది కొంతభాగ్యంబు మెచ్చుకొంఁడ,
బహుళ సంతానవతియైన భార్యవలపు
సాటిగాదయ్యెఁ గ్రొం దగులాటమునకు!

ప్రేమసూత్రాలఁ ద్రెంపెడి బిగివి సడలి,
బిచ్చకత్తియపోల్కి నీ పిలుపులేక
వచ్చి నిలిచితి ముంగిట, నిచ్చకాల
కైనఁ దలయెత్తిచూడవు; మాని వైతె?

చిత్రలేఖకు నీ కెడసేయలేక
యర్వాశితను గొంటి స్వయంకృతాప
రాధమున, కింక నాగుండె తూయఁజేసి
వెడలిపోయెదఁ, గడపటి వీడుకోలు!

కవి

నిలునిలు మోసక్షీ, మనసు నీఱయిపోయె; నవజ్ఞగాదు; నీ
వలె నను జేరవచ్చె బహువర్ణ సుశోభిత చిత్రలేఖ; నే
వలదనఁ జాలనైతి; నెలప్రాయము మోసముఁ జేసె; నిక్కముం
దెలసిన నీవునుం జెలినిఁ దియ్యనికౌఁగిటఁ జేర్తు వింతకున్.

దేని నకార్యమంచుఁ గడుదీనత వాకొనుచుంటివో యదే
చానవో, సంతసంబునకు సాధనమౌను; సపత్నియంచు లోఁ
బూనకు మచ్చరంబు; నదెపో నిను గొల్చెడి తోడఁబుట్టు; వా
మానిని సాహచర్యమున మంజుల వౌదువు నీవు నింకనున్.

ఇద్దఱును నీటికాలువ యొద్ద నిలిచి
మొగముపోలిక లెల్లను బోల్చుకొందు;
అక్కసెల్లియ లొకరైన యపుడు నన్ను
నొక్కరుండైనఁ గనిపెట్టి యుందురు గద!

అతివ, పొరపాట్ల ప్రహాసనం బాడినాము,
భరతవాక్యంబుగాఁ బెట్టు వలపుముద్దు;
మిమ్ము నిరువురిఁ గూడి సుఖమ్ముగాఁగఁ
గడచు జీవితశేషమ్ము కల విధాన.

చాలకాలమయ్యె సఖియ, నీ కౌఁగిల
నాసవంబుఁ బెదవులానఁ బెట్టి;
పానపాత్రమందు భవవిషాదంబును
ముంచి కొంతసేపు ముక్తిగందు.

15-10-1924



భగ్న హృదయము.

1925—30.

I some times hold it half a sin
To put in words the grief I feel;
For words, like Nature, half reveal
And half conceal the Soul within.

But, for the unquiet heart and brain,
A use in measured language lies;
The sad mechanic exercise,
Like dull narcotics, numbing pain.

In words like deeds, I'll wrap me o'er,
Like coarsest clothes against the cold;
But the large grief which these enfold
Is given in outline, and no more.

—*In memorium.*

భగ్నహృదయము.

ప్రియావియోగము.

జలధరమాలికా మలినశయ్యను మిత్రుఁడు గూలె; నేఁడ్పులా
ర్పులఁ బులుఁగుల్ కులాయముల పొంతలకేఁగక కొమ్మలెక్కి ము
క్కులఁ దడిలేకయూర్చు; నడఁకూరినపోలికఁ బూలతీఁగలుం
దలలనువాంచు; గాలి వెతతాఁకున మూల్గు సహానుభూతితోఁ.

మును గనుపండువై తనరు మోహనవస్తువులెల్ల వెల్లఁబో
యినగతి బాష్పముల్ దొరఁగ నేడ్చుచు నీరవభాషఁ బల్కెడిన్
'గనుఁగొన, మాకునున్ దెగులు గల్గెడి నీదు ప్రియావియోగ సం
జనిత దురంతతాపమున, శాంతిలుమోయి' యటన్నమాటలన్.

ఇరువురి చిత్తఖండముల నేకముచేసిన ప్రాణకాంత యం
తర విరహాబ్ధిపంకమున నాఁటుకొనన్ నను ముంచిపోయెఁ; గ్రి
మ్మఱి ధరఁ జేరరా దనెడుమాట నెఱింగియు నేమొకాని, నా
తరుణ మనంబు స్వాప్నికపథంబునఁ బోవును బ్రేమవాసనన్.

కన్నులువిప్పి చూచితిని గాంతశవంబును, జేతితోడ నే
యన్నులమిన్న కాష్ఠమున కగ్గి రగిల్చితి, నింతచేసియుం,
జన్న తెఱంగెఱింగియును సంశయమొందును బాడుబుద్ధి! యా
పన్నుల చిత్తవిభ్రమపుఁబాటులు నిట్టివియేమొ యెల్లెడన్!

కలలోనైనఁ దలంపలేదుగద యోకల్యాణి, నీ కింతలో
పల నూఱేఁడులు నిండుసంచు, విధి దుర్వారప్రభావంబు మ
ర్త్యులయత్నంబు నధఃకరించుగద! వైద్యుల్ దివ్యసంజీవిఁ జెం
బులఁద్రావించియుఁబూర్వదుష్కృతఫలంబుల్ మార్పలేరైరిగా!

ఇరువదియేనువత్సరము లేఁగకపూర్వమె, యౌవనంపు బం
గరు చషకంబులో నురుగుగ్రమ్మెడి యాసవ మింకకుండఁగన్,
సరస మనోనురాగ తృష శాంతిలకుండనె, జీవితంపు మా
ధురిఁ దనివార నానకయె తొయ్యలి, పోయితె కాలదుర్గతిన్!

పది పదునొండు వర్షములపాటు నిరంతర దుగ్ధకుల్యయై
హృదయపు తటంబు లొత్తి ప్రవహించిన ప్రేమరసంబు లింక, నీ
యెదనున సార్థవాహము జలాశయహీన మరుప్రదేశ దు
ష్పథమున నట్లు నే నడుపఁజాలుదు నిర్దయ దీర్ఘయామినిన్.

దర్పణంబున బింబంబు దనరినటులఁ,
నీదురూపంబు మదిలోన నిలిచియుండు!
ఇదిగో! నెచ్చెలి, యని చేతు లెదురుచాఁపఁ,
గఠినసత్యంబు నామోముఁగాంచి నవ్వు!
గాజులును మ్రొట్టె లెవరివో ఘల్లుమనఁగఁ,
దెలియకుండనె కన్నులు తిరిగిచూచు;
నంతదారుణ యాథార్థ్య మాత్మ మెఱవ,
గుండె జల్లను, నిట్టూర్పు మెండుకొనును.
ఇరువురకుఁ దప్ప నితరుల కెఱుఁగరాని,
మన రహస్యంబు లెవరితో ననుదు నింక?
హృదయ మంజూష నాచేత నిడి యదేల
తాళపుంజెవి నీమొడి దాఁచినావు?

మఱ పెటుగల్గు నీ నగవు మాటలు నీ దరహాస చంద్రికాం
కురములు,వచ్చిరాని మృదుకోపము,చామనచాయరూపమున్,
సరసత, మన్మనోనుసరణత్వము, నిర్భరమైన ప్రేమయున్,
మురిపెపుఁజూపుఁగావ్యములు, ముద్దులపేటికలౌ కపోలముల్.
పరలోకంబున కేఁగువేళఁ బ్రియవ్యామోహ మొక్కండె నీ
పరమై పోయె నటంచు నుంటిఁ; దెలిసెం బ్రచ్ఛన్నసత్యంబు; నీ
కరముల్ నాహృదయంబుఁ, గోరికల,సౌఖ్యంబున్,భవిష్యన్మనో
హర గార్హస్థ్య సుజీవితం బడుగుబాయన్ లాగి కొంపోయెఁగా

పరలోకంపుఁ గవాటముల్ దెఱచి నాపై నొక్కమాఱైన నీ
సరసాలోల కటాక్షముల్ నెఱపుమా, సర్వంబు నీ కాత్మగో
చరమా; నన్ గుఱుతింపఁజాలుదువె యో చానా, నిరంతంబు నీ
కొఱకుం బిచ్చిబికారినై తిరిగెదన్ ఘూర్ణిల్లు చిత్తంబుతోన్.

తెలివి నశించినప్పు డొకతేప నినుం గను కోర్కెతోడ నే
వెలుపలకేఁగి, కాఁటిదరి వెచ్చగనూర్పుచుఁ గూరుచుండి నీ
లలిత మనోహరాకృతి శిలాతలమందునఁ బాఱ జూడ బొ
గ్గుల మసి భగ్నశల్యములు గోచరమయ్యె నికేమి చెప్పుదున్!

స్థిర మిహలోక, మీతనువు జీర్ణముగాదు, సమస్తసౌఖ్యముల్
మఱగవటంచు యౌవనపుమత్తున నుండిన నాకు నెంతలోఁ
గఱపితి వీవు: 'సర్వమును గాలవశంబున నంతరించు, న
శ్వర మగు నీప్రపంచకము స్వప్నమయం' బను సత్య మంగనా!

కవితా కల్పిత లోకమందు మురళీగానంబు గావించుచున్
జవలున్ రేయి సుఖంబుగా నెగురు నాపక్షంబులం ద్రుంచి న
న్నవలీలన్ ధరణీతలంబునకుఁ ద్రోయన్ మేలఁటే కాంత? క
న్గవమోడ్తుం, దిలకింపఁజాల నిలలోఁ గన్పట్టు యాథార్థ్యమున్!

హృదయమును దొంగిలించిన రీతిగానె
స్మృతిని సైతంబు నీవు హరింపు మతివ,
అంత సుఖదుఃఖములు భేద మరయరాక,
భావశూన్యత లీనమై పట్టువిడచు!

చేతన్ జాఱిన గాజుగిన్నె మరలం జేఁజిక్కునే? వ్యర్థ చిం
తా తాపంబున లాభమేమని ప్రబోధజ్ఞాత తత్త్వుండ నై
చేతన్ గ్రంథముఁ బూని యక్షరములం జిత్రంబు లంకింతు; నా
చేతం గాదొకవాక్యమైనఁ జమువం, జిత్రంబుపో తత్కథల్!

అనివార్యంబగు దైవనిర్ణయము; దేహం బొక్కఁడే పంచభూ
త నిలీనంబగు; నాత్మకున్ మరణబాధల్ లేవు; లోకంబునన్
జననంబున్ మృతి నైజమంచు నెటులో స్వాంతంబుఁ జిక్కించుకో
ననయంబున్ యతినింతుఁ గాల గురుపాదాబ్జంబులే దిక్కుగన్

వేఁగు మాంసంబురీతి నావిళ్ళువాఱు
నుల్లమునఁ దత్త్వబోధ కాలూనఁ గలదె?
యూఱడింపులు పుండుపై నుప్పుగల్లు;
ఇంక నేకాంతమే నాకు నేఁడుగడయు!

12-7-1925

స్మృతి కణము.

కనులు మూసినఁ దెఱచినఁ గానుపింతు
వింట నడయాడినట్టులె యిందువదన!
సంతత ధ్యానలీనమా స్వాంతమునకు
వెలుఁగు జీఁకట్ల భేదంబు దొలఁగునేమొ!

తెల్లవాఱినఁ బూదండఁ దీసివైవఁ
దరుణి వేణిక నిలుచు నెత్తావి పోలిక,
మర్త్యమా నీస్వరూపము మాటువడియు
సార వర్ణాంకిత స్మృతి సమసిపోదు.

చావు బ్రతుకులమధ్య విశాలమైన
కలలవంతెన గట్టితి తలిరుఁబోణి,
కార్యలంపట దినమునకన్నఁ బ్రకృతి
ముసుఁగుఁ దీసెడి రాత్రి నాకొసఁగుఁ బ్రియము.

పవలు రేయికిఁగల భేదబాంధవములె,
యూహాపరంబులయందు నూహింపఁగలము;
రెంటి కూడలియగు సంజ, మింటికొనల
విమలరాగంబు వెదజల్లు, వెఱపునిడదు.

మే 1926.

శిశు వియోగము.

కాలచక్రంబు మును శీఘ్రగామివోలె
నాచు జాడలు గనరాక యరుగుచుండె,
నేఁడు ప్రియురాలి పోకకు గోడుగుడుచు
కతన, నిమిషంబు యుగముగాఁ గడచునాకు.

పూవురాలిన జిఱుపిందె పూపయైన
నఁటుకొనియుండు నన్ను పేరాస నుంటి;
మృత్యునిశ్వాస పవనంబు రేఁగిసుడిసి
భావిఫలమును గసుగందుఁ బైకివిసరె.

చెట్టుపోయిన విస్తైనఁ జిక్కెనన్ను
యాసయుంగూడ నేఁటితో నంతరించె;
నకట! నా పూవుదోఁటకాడాయె నోయి
తోఁటమాలి వసంతుఁడా, తొలఁగిపొమ్ము!

పూవుంగిన్నెల దేనెలాని, లతికాపుంజంబు లుయ్యాలలకుం
దావుల్ గాఁగ, నిరంతరంబు సుఖయాత్రల్ సేయు తేఁటుల్ ననుం
భావాభ్రంకషపక్షుఁగాంచి మదిలో భావించు నాత్మీయ లీ
లా వాల్లభ్యముఁ గ్రిందుసేయు నితఁడేలా వచ్చెనం చెప్పుడున్.

ఇపుడన్నన్ విధి వేఁటకాని వలలో నేకాకినై చిక్కి, పూ
ర్వపుటుత్సాహముగోలుపోయి, గఱులున్ భగ్నంబులై చిందఁగం
గృపతో వీడిన, నీడ సంస్థితుఁడనై రేయుంబవల్ చీఁకటిన్
అపనోదించు తలంపుతో బ్రదుకు నాయాధిక్య మింకేటికిన్?

చిత్తతాపంబుఁ బాపుకోఁ జేలగట్ల
కలిగి కూర్చుండ, మూక సహానుభూతిఁ
పైరు తలవంచు భారంబుఁ బాచికొన్న
ప్రాణసఖులట్లు; కవులకు బ్రకృతితోడు!

అపర దిక్కాంత సైతము నస్తమించు
నరుణ బింబంబుతోఁ గన్ను లవియఁజేయుఁ,
దనను పూజారి యెక్కట్లు తలఁచి కుంద
నెఱ్ఱ పుండాయెనో యేమొ హృదయమనఁగ.

ఈ యిలకున్ ననుం బెనచు నే గుదిబందము లేదు; ప్రేమ యా
దాయము సన్నగిల్లె; నది దాఁటుట కింకఁ దయారు; రేవున
బాయక వేచి యుండు నుడుపంబులు వచ్చెడిదారిఁ జూచుచుం
జేయునదేమి? యా పడవ శీఘ్రము వచ్చునో! యాలసించునో!

మునుపటిరీతిఁ బ్రత్యుషము మోహనవేషము దాల్చి శయ్యపైఁ
గనుగవమోడ్చియున్న ననుగాంచి 'సఖా' యని మేలుకొల్పు; మో
మునఁ దన మోము నాన్చి సుఖముం జిలికించెడి ముద్దువెట్టు; నై
నను బరిదగ్ధసారము మనంబు ముదం బెటులాశ్రయించెడిన్?

ఎంతకాలంబు చీఁకటింటియందుఁ
గాఁపురం బుంట? యడుగంటఁ గాలిపోయి
స్నేహహీనంబుగా వట్టి శెమ్మె నిలిచె,
నెవరు వెలిఁగింతురో? తైల మేడదింక!

యౌవన నవ్య సౌరభ విహంగ మనాది కులాయపీఠికిం
బోవ నుపక్రమించెఁ జెలిపోయిన దారి, శరీర వల్లికిన్
రావిఁక రెండుమాఱులు, తిరంబు, వసంత శుభోదయంబు; లిం
కా వివరంబులేల? గతమయ్యె సుఖంబు, శ్రమంబె దక్కెడిన్!

పొలములనుండి రాఁగనె పరిపూర్ణ కళా శశిబింబమట్లు వా
కిలి కడనిల్చి, సిగ్గుమెయిఁ గ్రీగనులం దిలకించుచున్ మనో
విలసన మాననంబున స్రవించెడినోయన నవ్వు స్వాగతం
బుల నుపచర్యసల్పు చెలి వోవ మశంబుగ మాఱె గేహమున్.

పూవులఁ బెండెలన్ లతలఁ బుప్పొడితావులఁ నందమైన నా
యౌవన నందనంబిటు ప్రియార్ద్రవియోగ దురంత తాప చిం
తావిల కీలలందు నుసియయ్యెను; ఆ మఱి ప్రేమదేవతా
జీవ విహీన మూర్తిపయిఁ బట్టెముగట్టె సమాధి పోలికన్.

ఉప్పు లోపింప మిగతవి యుండిగూడఁ
జవియు సారంబు కొఱవడు సాదకమున;
మనసుగలసిన యిల్లాలు మఱఁగిపోవ
నన్ని యుండియు లేనట్టులయ్యె నాకు!

హృదయపు వల్లకాటి రసహీనత దేహమునందె గాక నా
మృదుల కవిత్వపున్ లతల మీఁదికి సైతము నల్లునంచు నా
కొదవెడి సంశయంబు; కృతియున్ సతియట్టుల జంటవాసినన్
బ్రదిమికి నువ్వునీళ్ళుచుఁ బాద పరాగము రాల్చిపోయెదన్.

విరహపు దుమ్ములోఁ బొరలి వెఱ్ఱిదనాల బికారినై వ్యథా
భర కబళంబులన్ హృదయపాత్ర భుజించుచు బ్రేమవాకిటన్
జిరముగ వేచి యీ కఠిన జీవితమున్ గడుపంగ నేల? యం
బరచర కామినీ ప్రణయ మందిరముల్ కఱవాయె నేమొకో!

ఆసవ మింకి క్రొన్నురుఁగు లారిన కొంచెపు మట్టిపాత్రలో
నాసలు నింపి, క్రొత్తఁదన మంటుకొనం బునరుద్ధరించు నా
యాస మదేల నీకు; ప్రభువా? యిఁక నన్నొక భగ్న పాత్రలన్
వేసెడి మూలలో విసరివేయుము భుక్తము సంస్మరింపఁగన్.

24-9-1926.

కవితాచితి.

నాలుక త్రుప్పువట్టె; నొకనాఁడయినం జెవి కింపుఁగొల్పు కా
వ్యాలపనం బొనర్చు తల పంకుర మెత్తదు; వ్రాయఁబూనినం
దేలికకాలిగుఱ్ఱపు గతిన్ మఱపించెడు *భావ మిప్డు డ
స్సె! లివసచ్చి ముందడుఁగు పెట్టదు చాకలిమొల్లి బేసినాన్.

రమణీయంబగు నాట్యరంగము నటీరాజ్యంబుగా మాఱె యం
దము నానందముఁ గూర్పఁ, బందిరి హఠాద్దగ్ధంబుగాఁ జూచి ని
ష్క్రమణద్వారముఁ గాంచలేక పొగలో గగ్గోలుగాఁ బర్వ పి
చ్చిమనుష్యుల్ గతి భావముల్ దిరుగు నాచిత్తంబునన్ మొత్తమై.

ఇదివఱ కెన్నఁడైన నుదయించిన యంతనె భావపంక్తులన్
బదుఁడని పంపుచుంటెని బ్రపంచపు సంతకు; నిప్పుడన్న నా
చిదగొద కాఱుచీఁకటులఁ జీఁకగు నాశ్రియ లుబ్ధభావముల్
మెదలవు నీరుబొండలఁ; దమిస్రమె స్వర్గము భుక్తిసారతన్.

కలమును కాగితంబు తనఖాపడె! 'గుడ్బయి!' రామిరెడ్డి, నీ
పలుకులు వీనులార విని వత్సరముల్ సనె; నంత చెల్లె! చి
ట్టెలుక విధాన దాఁగికొని యేమొనరించెదవోయి యంచు నన్
బలుమఱు హెచ్చరించు హితవర్యుల కేమని విన్నవించెదన్.

కలకల ముగ్ధమంజుల వికస్వర సుస్వర గీతికాగతిన్
దోలఁకు కవిత్వనిర్ఝరము నూత్న పథంబులఁ ద్రొక్కఁగాని, శీ
తల హిమరాశి పేరి జలధారలు నిర్గతిమాని గడ్డలై
యలమట వేచియుండుఁ దరుణార్క కరాంకుర హాసరోచికిన్.

కమనీయంబగు వింతవస్తువులతోఁ గాంతిల్లు నా గేహరా
జము మధ్యన్ వెలుఁగొందు దివ్వెగనువై సర్వంబు వెంజీఁకటిన్
సమసెన్; నే నిఁకఁ గొన్నినా ళ్ళతిథిపూజాసేవకుం జాలనం
చు మదిందోఁచెడి; దీపమెప్పు డనటన్ శోభిల్లునో క్రమ్మఱన్

పలుకగు కెంపురాల పరిపాటి నగందగు నాసవంబు నం
చులు పొరలంగ నింపి సరసుల్ చవిచూడఁగఁ బానశాలలో
నిలుపుదుఁ గాచపాత్రికల; నేఁ డయొ! యన్నియు బొప్పవారిబిం
దులఁ బరిపూర్ణమై రుచికి దూరమునై వెతగూర్ప వేరికిన్?

కనఁగ మనోహరంబులగు కల్యకు సంధ్యకుమధ్యఁ బొల్పు మో
హన భువనంబు నాదు హృదయాద్రి మలీమస వర్ణవర్ణికన్
జెనమటు పూసిపూసి కడువెక్కసముం బొనరింపఁగోర; నన్
బెనఁగొని పిప్పిసేయు పరివేదనతోఁ బనియే మొకళ్ళకున్?

శిరము నిశీథ తారకల శీతలకాంతి సుఖంబుఁ గోరి యం
బర చరవాసనన్ మరలఁ బైకెగ నిక్కనుగాని, పాదముల్
మరగొని కర్దమహ్రద నిమగ్నములౌట వృథాప్రయత్న ము
ప్పరతఁ గలంచునన్ మకరసంభృతమౌ కలభంబు పోలికన్.

కడచెను మూడువర్షములు కాంతవియోగము సంభవించి; యూ
పిరుగు కండిది తాఁకులకు బీటలు వ్రయ్యలు వాఱినట్టి నా
యెడఁదను బూర్వరూపమున నేరిచి కూరుచు మంత్రికత్తె యె
వ్వరు పొడకట్టునో యమృతపూర్ణ కళోజ్జ్వల పాత్రిహస్తయై.

రూపములేని సంస్మృతికి రూఢిగ నల్లుకొనంగ లేక దా
దాపుగఁ బ్రేమవల్లి కృశతంగని దగ్గఱనున్న కొమ్మనే
ప్రాపుగఁ జేసికోఁ దలఁచి ప్రాకెడినా! గతానుభూతముల్
తీపులె యయ్యొ మానవహృదిన్ సతతంబును బందిసేయునే?

భావము మాఱినంతనె ప్రపంచము మాఱును; బూర్వమట్లు సం
ధ్యా వివిధాభ్రవర్ణముల తేట్టుకుఁ బోవదు బుద్ధి; కోకిలా
రావము లింపు నింపవు; నిరర్థక దాస్యములయ్యె యామినీ
సేవలు; రమ్యమా ప్రకృతి ఛీ! యనిపించు విరక్తి పెంపునన్.

ఇట్టి మాటల నింకెట్టు లించుకైన
నవ్వురు వెన్నెల కవిత మనంగ నేర్చు?
నదియుఁ గాలానధింగాంచి యడిగె నేని
దాని చితిపైన నిర్మింతుఁ దాజమహలు!

మే 1927

మనోవిప్లవము.

సృష్టి చిత్రంబునకు మూలజీవమైన
జనన మరణ క్రమంబుఁ జింతన మొనర్చి
యంతుగనలేక యత్నంబునాఁపుకొంటి;
దేవ, పరమేశ, యున్నావా? లేవా? చెపుమ!

చాల ప్రసిద్ధ శిల్పివని చాటుచునుందును బంశితాళి; నీ
లీల లనంతముల్; దెలియ లేము రహస్య; మదేలొకో నమూ
నాలను వ్రాసి వ్రాసి కరుణంబును దృష్టియులేక చింపె; దీ
కీ తెలుఁగంగ రాని కృతికిఁ లభియించున దేమి తెల్పుమా?

కొందఱు సృష్టి నీదయని కొందఱు కర్మఫలంబటంచు నెం
దొందఱో వ్రాసినార లది యెట్లగు? కర్తవు నీవయేని నీ
చందము దూష్యమౌను; మఱి సర్వము కర్మఫలంబటన్న నీ
వెందు కజాగళ స్తనము వీ యపదూఱు వహింప దైవమా?

తీవలునాటి, పాదులకుఁ దీయక నీరముఁబోసి, యామనిం
బూవులు పూవనున్న తఱి మూలములం దెకలించివైచు నీ
భావ మదేమి? యీముడిని బండితులైన సడల్పలేరు; కా
లావధి డగ్గఱించు! వృథ యయ్యెను జీవిత ముత్తచర్చలన్.

మనమున కందరాని యను మానపుఁ జిక్కునువిప్పుయత్నముల్
దినదినముం బొనర్చి కడతీరము గానక బమ్మరింపఁజా
లను; నెటులైన రాఁగల ఫలంబులు, కాఁగల మంచిచెడ్డలున్
బెనఁగొని వచ్చు నొక్కటిగ, వీడుఁ దమంత నయాచితంబుగన్.

కర్మఫలమైన దైవాధికారమైన
నింక నేమైనఁ గానిమ్ము; సంకటములు
పోకమానవు, సుఖములు రాకపోవు;
వానియెడల తాటస్థ్యంబు నూనియుండు.

కవి యలౌకికత.

ఓయి కవీశ, భావ రుచిరోజ్జ్వల దృశ్యములన్ సృజించి త
చ్ఛాయలు లౌకికంబులగు సత్యములంచు భ్రమించి, నమ్మి, ని
ప్రాయము జీవితంబు నిటుపాడొనరించెద; నొక్కనాఁడు నిన్
బాయక మేలుకొల్పు విధి భగ్నమనోరథ ఖేదనంబునన్.

భావన నీకుశత్రువు; విభావరి దాఁటక మున్నె, సూక్ష్మతా
రావళి కాంతిఁ గాంచి గగనాంచలమందు మనోజ్ఞ వర్ణ రే
ఖావలితేంద్రచాపమును గల్పనసేతువు; గుడ్లగూబ ఘూ
ఘూవనికాయము, నుల్కిపడి కాంతువు నిక్కపు టంధకారమున్.

కావ్యరచనలందుఁ గవివి కావచ్చును;
దివ్యలోకమందుఁ దిరుగ వచ్చుఁ;
గామ్య వస్తువులను గవిదృష్టిఁ జూడకు;
గట్టినేలఁ దడవి కాలు మెట్టు.

కంటి కందని యాదర్శకంబుఁ గోరి
యకట! దుఃఖాంతనాటక మాడెదీవు!
వెనుక ఫలమేమి?—మానవద్వేషవహ్ని!
రక్తసిక్త హస్తముల నిష్క్రాంతి నీకు!

21-2-1928.

నిస్సహాయత.

చెలిచనినంత నాపెడఁద చిక్క్రము, లుబ్ధుని ముష్టిరూకలన్
బలముగఁ బట్టియుంచుగతిఁ బల్లవకోమలమైన ప్రేమఁ జి
క్కులనిడెఁ; నిచ్చిపుచ్చుకొనఁ గూడని యీదురవస్థ కెన్ని నా
ళ్లు నెలలేడులోర్చుకొని లొంగుచు, గ్రుంగుచులోనదుఃఖమున్!

కొలఁదికి మించు భారమగు గోనెను గాడిదమీఁద వైచి దో
ర్తిలఁ బడి కాలుపూనుకొలఁదిన్ గొరడా మొదలించు నిర్దయున్
దలఁపున కీడ్చె దైవకృతి; తన్నును గార్దభమేని నోర్చుకో
నలవి దొలంగ; మానవునకా తుదిమార్గము గూడ లేదుగా!

2-7-1928

ప్రణయబలి.

బచ్చన పండుఁ గేర మఱు భ్రాంతిమెయిం గనిపెట్టుకొన్న నా పిచ్చితనంబు కొందఱకు వేడ్కయు, నా కనవాప్తిలజ్జయుం, బచ్చని కోర్కెకుం దెవులు, బంధుహితాళికి జాలిఁ గూర్చిపై పెచ్చుగఁ దీఱరాని వెతవెట్టునొ జీవితశేష మంతయున్.

రాజరాజ హృద్దేశ విభ్రాజమాన
కమ్రముక్తాఫలము శుక్తి గనును గాని
మూల్య మెఱుఁగ దెంతటి మూఢమతమొ;
వింత యొనగూర్చెఁ బ్రారబ్ధ విలసనంబు.

ఈఁక లెదిగినఁ గనుదాఁటి యెగురు నంచు
ఱెక్కలను ద్రుంచెఁ బిల్లకు నొక్క పులుఁగు;
ఇదియె వాత్సల్య దృష్టాంతమేని యింక
స్వార్థపరతకు ముద్దుపేర రబ్బినట్లు!

అతివ, యవివేక దూషితంబైన బంధు
జన సముద్దేశమే భావి సమయ భోగ
భాగ్యములకు నిరోధక బంధమయ్యెఁ;
దల్లి విషపాత్ర నందీయఁ ద్రావ వలెనో?

సదనురాగంబు పరిభవక్షతి నొగిలియు
ద్వేషముగ మాఱఁబోదు పవిత్ర మగుట;
వేఱొకని జీవితంబు నీప్రేమ కతన
సౌఖ్యపడునేని యది కొంత సంతసంబె.

మగనాలి వౌట, నాకుం
దగ దిఁకఁ దలపోయ నిన్నుఁ దరుణీమణి, నే
నగపడను దెరల మాటున;
విగతాశుని వీడుకోలు వేడకు మింకన్.

కాని, యొకకోర్కె గలదు; నీ మానసమునఁ
బ్రణయ బలిరక్త ధార లార్ద్రముగ నున్న
మఱవఁ బోకు మత్ప్రేమసమాధిమీఁదఁ
గనికరంబున నొక బాష్పకణము రాల్ప.

నెలఁతా, భగ్నమనోరథుం డగుట నేనే కాని వాంఛింపకే
కలిగెన్ నీ కమృతత్వసిద్ధి, కవితా కల్యాణ సౌధంబునన్
నెలకొంటం; గవియాత్మమ్రుచ్చిలవయ్యెన్ నీతోడి సామాన్యలా
చెలులట్లే నివసింతువేమొ యిల నజ్ఞేయంబుగం జీఁకటిన్.

అన్నిదినాలు భావపటమందున నే లిఖియించికొన్న య
భ్యున్నత భావిచిత్రము లొక్కొక్కటే చింపి, నిరాశ మంటలం
దిన్నగ వైచి, పై కెగసి తేలెడు ధూమముఁ జూచి చూచి, మే
లౌన్నటు క్రిమ్మలం బడయుఁ గోరుదుఁ గీలల రూపరేఖలన్.

అమలంబైన ప్రభాతరాగరసవిన్యాసంబునం బ్రేమ చి। త్రము
లన్ వ్రాసియు వ్రాసి యిప్పటికి వర్ణంబంతయుం, గుంచెయుం [మహా
హిమికాస్వచ్ఛమనోంబరంబు వ్యయమాయెం; దచ్ఛ్రమపాత్రిష్ట
కమనీయం బగుసృష్టి నాయెదుట దగ్ధంబౌట కెట్లోర్తునో!

కవితలు వ్రాసి చింపుదును గాదు! హృదంతరలగ్నమైన యా
యువతి మనోహరప్రతిమ నూడఁ బెకల్చెదునప్డు జీవిత
ప్రివిమలార కర్పూరములు పై కెగఁజిమ్మెడు బాధ నోర్చుకో
నవునె విధాత, నీకయిన; నారునె గాయము; మచ్చమాయునే!

ఆశాభంగ కఠోరశస్త్రికల నన్నంతంబు గావించి యా
వేశోన్మత్తతఁ ద్రొక్కినన్ సరియ! దుర్వ్యత్యాంబు కోటీన సం
కాశ ప్రాభవ దివ్యతేజము మనఃకంజంబునన్ వెల్గెఁ; ద
ద్రాశీభూత పవిత్రశక్తి నెటులన్ దప్పింతువే దుర్విధీ?

తలవంపులు ఘటియించితె
పలువంతల సన్నగిలినవానికి; విధి, నీ
బల మెంతో దెలిసికొందును;
కలకాలము నీకు నాకుఁ గలహము సుమ్మా.

కాలన్ రాచి విదల్ప నేఁ బురుగునే, కాలానలజ్యోతి యం
చేలా నీ వెలుఁగంగ లేవు? నిను నీసృష్టిం దుటారించి భా
షాలంబంబున దివ్యలోకములు రమ్యం బౌనటుల్ సల్పి నీ
యాలిన్ దొంగిలిపోయి మత్ప్రణయరాజ్యశ్రీ నొనర్తున్ విధీ!

తలఁపులయందె నా వెతను దాఁచఁదొడంగితిఁ గాని, వాతసం
చలిత పయోధి వీచికల చాడ్పున రేఁగు విషాద మేఁచి, యా
కులమయి, గాఢసంయమనకూలముఁ ద్రెంపి క్రమించె నాలుకం;
దలఁగెను దానఁ గొంతపరితాపము; సర్ధవిముక్తి చేకుఱెన్.

కరుణను నా కయాచితముగా వరిషించిన నీ వరంబులన్
మరలఁ బరిగ్రహింపుము రమాధవ, రమ్యకళావిభూతి, యం
బరచర భావలోలతయుఁ, బల్లవకోమలవాఙ్మనంబు దు
ర్భర రుజలొంచు నైహిక నివాస మసహ్య మొనర్చెనంతయున్.

గఱులను ద్రుంచి, నేలకును గాలికి బంధము వైచియుం, బయో
ధర రథచక్రముల్ పగులఁ దాఁచి, తటిల్లత జాటిఁ ద్రెంపి, క
ర్బుర రమణీయతా కిరణరోధకమౌ కవచం బొసంగి, ప్ర
స్తర కఠినాత్మఁ జేసి నను సంసరణార్హు నొనర్పు మీశ్వరా.

కవితానిర్ఝరి, క్రూరమౌ విధి తిరస్కారంబునన్ నీకు సం
భవమయ్యెన్ హృదయాంతక వ్యథలు కావ్యాలల్లి పాండగఁ; జా
లు విషాదాంకిత గీతికారవళి! చాలున్ నిల్పు మాక్రోశ గా
న విషజ్వాలలు! పూనుమీ యచల మౌనన్యాసదీక్షాధృతిన్.

ఆ శీ ర్వా ద ము.

చెలియా, నిత్యశుభోదయంబు, సకల శ్రేయంబులున్, భోగముల్
విలసత్ ప్రేమ సదాభివృద్ధియుఁ, గళా విద్యాభిలాషంబు, ని
శ్చల మాంగల్యము, పుత్రపౌత్రులును బ్రజ్ఞాతారతమ్యజ్ఞతల్
వెలయన్ జీవిత యాత్ర మీ కిఁక సుఖాన్వితంబుగా సాఁగుతన్!

21-2-1929

అధ్యాయాంతము.

> "I made another garden, yea!
> For my new love:
> I left the dead rose where it lay
> And set the new above."

చివురుల కెంపు పెంపెసఁగఁ జేయు వసంతము వచ్చె; నెన్నఁడో
కవటలుమాని శుష్క రసకాండత నున్న రసాలశాఖి పూ
ర్వ విధమునం గిసాల విసరంబులఁ బూతల దర్శనీయమై
కవగొనె మాధవీలతను; గష్టములుం గడఁదాఁక కుందునే!

చీఁకటియింటి కాఁపురపుఁ జీకు దొలంగెను; జల్లవెన్నెలల్
పాఁకి కుటీరకుడ్యముల రాత్రి దినంబుగ మార్చె; స్నేహధా
రా కలితంబు సెమ్మె; కసరావిఁక భావ పిశాచ రూపముల్
చేకుఱెఁ జిత్తశాంతి, విరచించెడి నూహలు భావిచిత్రముల్.

'గతము గతంబె యెన్నటికిఁ గన్నులఁ గట్టదు; వర్తమానమే
సతత మవశ్య భోగ్యమగు సంపద' యన్న ఖయాము సూక్తులన్
మతి నిడి, మల్లికా లతిక నాటితి దగ్ధ గతస్మృతిన్, సుమ
ప్రతతుల సౌరభంబు పరిపాకము నొందఁగఁ బండు వెన్నెలన్.

అనునిమిషంబు జీవితమునందు నవీన దిగంచలంబులే
కనఁబడు; దుఃఖమున్ సుఖమగాధత విస్మృతిఁ జూపు; రెండునున్
మనుజుని జ్ఞానవృద్ధికి సమానమె; యైన, నగాధతన్ వరిం
పను వెనుదీయుఁగా యుపరిమంథనలోల మనం బధీరతన్!

అంతంబొందె మదీయమా కృతి వియోగాధ్యాయమీనాఁడు; చి
త్తాంత స్సంయమి తానురాగ రసముల్ వ్యాపించె సేతుచ్యుతిఁ;
జింతాక్రాంతత యౌవనంబు వ్యయముం జేయంగ నేమాయె? సాఁ
గింతున్ జీవిత నందనంబున లతాంగీ దోహదక్రీడలన్.

చతురంబౌఁ గద దైవకల్పనము! లాశాభంగముల్ గూర్చి, దు
స్థితులం దేలిచి, లోఁతుపాఁతులఁ బరీక్షింపన్ వెతల్ గొల్పి, పై
ధృతిహీనుండగు మానవుం గని దయార్ద్రీభూతుఁడై సంస్కృతి
క్రతుకర్తం బొనరించు దేవుఁడు సుఖప్రాబల్య మేపారఁగన్!

7-9-1929.

పరిశిష్టము.

1927-30

పరిశిష్టము.

పంటకారు – సాయంకాలము.

దినమెల్లఁ గృహ కార్యనిర్వహణ బంధీ భూత చిత్తుండనై
యినుఁడస్తాద్రి నలంకరింపఁగ విహారేచ్ఛల్ తలల్ సూపఁగా
వనమై పండినపైరు చేలనడుమన్ బంగారు స్వప్నాల కో
నను దేలాడినయట్లు పోయితి మహానందంబు చేకూరఁగన్.

గూళులకువచ్చు పక్షుల కూజితములు
సంజకెంజాయ గారడి చక్కఁదనము
వరుల వినవచ్చు కీటకా వ్యక్తగీతి
కాఁపువానిని సైతము కవినొనర్చు !

ఆ పొలంబొక దేవాలయంబో యనఁగ
హృదయము ప్రశాంతమై చింతలెల్లఁ బాసెఁ;
బ్రకృతి సౌందర్య గరిమ నన్ బందిసేయ
నోరులేని పూజారినై యూరకుంటి.

చిలుకలదండు క్రేంకృతులు సేయుచు మామిడియాకు తోరణం
బులు చదలెల్లఁ గట్టినటులమూఁగి, చివురుకున్రవాలి, దోర కం
కులఁ దమ నోటఁ బెట్టికొని గూళులకుం గొనిపోవుచుండె; సం
చలనములేని నామనము సందడి చప్పటి కులికి మేల్కనెన్.

ఫలనష్టం బగుచున్నదన్న తలఁపుల్ బాధింపఁజిత్తమ్మఁ; జి
లుకలసౌందర్యము, వాని స్వేచ్ఛ మదవాక్కర్ణప్రియత్వంబునుం
బలుకన్ శక్యముగాని సమ్మదముగూర్పన్, రెంటికిం జిక్కియా
కులమై చిత్తము తోఁచితోఁపకయుటం గూర్చుంటిముగ్ధుండనై.

కాఁపువానికిఁ గవికి సంగ్రామ భూమి
యయ్యె హృదయంబు; కొంతసేఁపైన వెనుక
కవియె మీఁదయ్యెఁ, గ్రిందయ్యెఁ గర్షకుండు!
తారలుదయింప నింటికిఁదరలిపోతి.

మే:2-1927

జాతీయత.

ఓసి జాతీయతా, నీబలో జ్వాలత్వ
మెంత! నీశక్తి సామర్థ్యమెంత! నీదు
శంఖరవమునఁగల యింద్రజాల మెంత!
అస్థిపంజరములు సైత మాడు నౌర!

నీ యాజ్ఞచేఁగదా నిఖిల భారతభూమి
గాంధీ మహాత్ముని కట్లఁ బడియె;
నీ కోర్కెచేఁగదా నెఱలోభి యైనను
దాఁచి యుంచిన నిధుల్ ద్రవ్వియిచ్చె;
నీ ధర్మమునఁగదా నెఱజాణయైనను
మోటు ఖద్దరు మేన మోయఁ దొడఁగె;
నీ పిలుపుచేఁగదా నిర్నిద్ర కీర్తులు
చెఱసాలలం జిక్కి చీకువడిరి;

ఒక్కపెట్టున నీ భారతోర్వి నెల్ల
నూఁపి, కెరలించి, వేమాఱు ప్రోత్సహించి
త్యాగ సామ్రాజ్య పట్టభద్రతను గూర్చి
వడిగ స్వాతంత్ర్య రథమును నడిపె దరరె!

పూర్వకీర్తి ప్రతాపంబుఁ బొగడినావు;
భావి భాగ్యోదయం బగపఱచినావు;
వర్తమాన దాస్యంబును వదలఁజేయ
నే యుపాయంబు వెదకెదో యింకమీఁద!

17-2-1928.

మంచు కాలపుఁ బ్రొద్దు పొడుపు

పిఱికివాఁ డొక సింహపంజరముఁ దెఱచు
నట్లు, కిటికీని దెఱచితి నల్లనల్లఁ;
జలికిఁ గప్పిన బూర్నీసు సడలనీక
తొంగిచూచితిఁ; గనుక్రొత్త దోఁచె నాకు!

ఆకసం బడ్డముగ వ్రాలె నసఁగ మంచు
దట్టముగ వ్రేలి సర్వంబుఁ దానె యయ్యె;
భావ దుర్బిణీ యంత్రంబుఁ బట్టి చూడఁ
బ్రళయకాల సూక్ష్మాకృతి ప్రతిఫలించె.

బాలభానుండు మంచులోపల వెలుంగఁ
గ్రమముగా బహుత్వము చుట్టుఁ గాన నయ్యె;
బాల్యమున విన్న "దయ్యాల బైని" కథకుఁ
దగిన యస్ఫుటచిత్రమై తనరె జగతి!

పలికిం జెమ్మలువోయి కుత్తుక మెదల్పన్ లేక లేయొండ రా
కలకున్ ఱెక్కలువిచ్చి యార్చు ఖగసంఘాతంబు ప్రాభాత మం
జులగీతల్ వినిపింప నోపవు; హిమాంశుండయ్యె సూర్యుండు; ప్రా
చి లవంబేనియుఁ జిత్రకారునకు సుసేవ్యంబు గా దిప్పుడున్.

ఇనకరతాప చండిమము హెచ్చుకొలందిని మంచుకోఁత కో
యను వరిమళ్ళకుం బఱచు హాలికపాళి సువర్ణరోచులన్
మునిఁగి యథార్థరూప పరిపూర్ణత నొందిరి; తద్వసుంధరా
తనయ లవిత్రపూజ సరిదాఁకునె విగ్రహపూజ లెన్నఁగన్.

నా కిటికీకి నేరుగఁ గనంబడి రిద్దఱు యౌవనంపు లేఁ
శాకపుఁ దీపులన్ మెఱుఁగు వాఱిన యాలుమగల్; నెలంతయుం
బోక సగంబుగం గొఱికి ముందుగ భర్తకుఁ బెట్టె; నాతఁడున్
ఆకుఁ బొగాకుఁ ద్రుంచుకొని యాలిపయుంటను గట్టె శేషమున్

పెండ్లికొత్తఁదనము పీడని దాంపత్య
లజ్జ, యళుకువారు లాలనంబు,
మొదటి ప్రేమ దుడుకుపోకల మురిపెంబు
వారి చేఁతలం దవార్య మయ్యె.

పనులు పాటులు నంతగాఁ బట్టువడని
తరుణి మునుమును మున్నుగాఁ దానె కోయు;
శ్రమకుఁ దాళని చెలిపైన జాలి పుట్టి
దప్పి గొనె నీరు దెమ్మని తడయఁ బంపు.

ఆఁడుబిడ్డల యత్తల యాఁడికలకుఁ
బొంచుచూపుల కెడమైన పొలముపనియె
క్రొత్త మిథునంబునకు స్వేచ్ఛఁ గూర్చునేమొ!
తోడి పనిపాటు ప్రేమకు దోహదంబు.

వారలు పంటచేలఁ బని పాటొనరింపఁగఁ గాంచి నేను సో
మారితనంబునఁ గిలకమంచము డిగ్గక, యున్ని శాలు వే
మాఱక పొర్లుచుంటఁ గని మాటికి నాపయి రోఁత పుట్టి సం
సారి వ్రతంబుఁ బూనుటకు సల్పితి గొప్పప్రతిజ్ఞ ధీరతన్.

17-2-1929

గాంధి.

ధర్మసంస్థాపనార్థంబు దైవశక్తి
యుగయుగంబున జన్మించుచుండుసన్న
యార్యసూక్తికిఁ బ్రాణమైనయట్లు
లవతరించితె గాంధిమహాత్మ, నీవు?

భీష్మదీక్షయుఁ జైతన్య ప్రేమరసము,
బుద్ధుని యహింస, ప్రహ్లాదు పూతభక్తి,
యల హరిశ్చంద్రు సత్యవ్రతాఢ్యతయును
గలసి మూర్తీభవించితే కార్యశూర?

కురుభూమిన్ స్వవిపక్ష శోణితపు వాఁగుల్ పొర్లి పాఱన్ వసుం
ధరభారంబును డించి ధర్మనియతిన్ దక్కించె శ్రీకృష్ణుఁ; డి
త్తఱి నీవన్న నహింససూత్రమును సంస్థాపించి, వర్తించి, దు
ర్భరదౌర్జన్యపు మూలబంధము సడల్పంజాలితో శేవధీ!

ముప్పదిమూడుకోట్లప్రజ ముక్తపథంబున నీ యనుజ్ఞలా
దప్పక యాచరింతురు; మృతి దంష్ట్రలఁజిక్కఁగనైన జాకరో
యప్పు! చిరప్రసుప్త శిథిలాస్థికళేబరమైన నీవు చేఁ
ద్రిప్పఁ బునఃప్రబుద్ధమయి తేజరిలున్ మహిమేంద్రజాలతన్.

కడపల్ దాఁటని కోమలుల్ విజయశంఖం బెత్తి పూరించి న
ల్గడ సత్యాగ్రహమంత్రబోధనలు సల్పం జల్ప, గ్రామీణులన్
నడుముల్ గట్టి స్వదేశ సేవలకుఁ బూనన్, జైళ్ళు నిండార నె
క్కడఁ నూహించితివీమహోద్యమమమోఘశ్రేయమున్ గాంధిజీ

మొనలో మేటిఫిరంగిదెబ్బలకు రొమ్ముల్ సాఁపి పోరాడఁగం
జను నాంగ్లేయుల వజ్రముష్టియుతమహాసామ్రాజ్యగర్వంబు, త
ర్జన, ధిక్కారము, నీదు నాత్మబలమున్ రాకొట్టి డీకొట్టి పొం
దెను గండూతి చికిత్స; ప్రాకృతులకున్ దివ్యప్రభల్ లొంగునే?

అరకట్టుపుట్టంపు నిఱుపేదవయ్యును
సమ్రాట్టుతో సరి సమత గనుట;
మఱునాఁటి కర్చుకై చిఱుపైసయును లేక
కోటిరూప్యంబులఁ గూర్పఁగనుట;
శమదమక్షమ నిత్యశాంతికి నెలవయ్యు
సత్యాగ్రహంబును సల్పుచుంట;
కంటికిం దాళని కాయంబు గల్గియు
దేశ దేశంబులఁ దేజరిలుట;

ఇట్టి యన్యోన్యవైరుధ్య మొసఁగునట్టి
నీ మహత్తర జీవిత నియతిలోని
గుప్తప్రభావంబులెవ్వరి కొలతకందు
నందు వైదేశికుల కెట్లు లంతుచిక్కు?

హేళనపాత్రమై మొదట, నింతగనంతగ మోసులెత్తి, వే
వేలకు వేలునాఁచు జనవిశ్వసనీయముగాఁ జెలంగి, యు
ద్వేల పయోధి వీచికల తీరున రేఁగి సమస్తదేశమున్
మూలము ముట్టనూఁచెఁగద మున్ లవణోద్యమతత్త్వ మెట్టిదో!

భోగము సౌఖ్యసంపదలు బొందుటకుందగు మార్గముండియున్
వేగమ తత్పథంబువిడి విశ్వజనీన కుటుంబివై మహా
త్యాగముఁజూపి జీవితమునంత స్వరాజ్యపు యజ్ఞవహ్ని నీ
రాగత వ్రేల్చినాఁడవు ధరంబశుశక్తి వినాశమొందఁగన్.

అరరే! నేఁడు వినంగనయ్యె భవదీయంబైన భీష్మప్రతి
జ్ఞ, రవంతేని స్వచింతలేక ప్రజకై సర్వంబు వోనాడియున్
మఱిలంబ్రాణముఁగూడ వీడ నసమానంబైన యత్నంబు! నీ
మరణజ్వాలలు కోటిసూర్యులటులన్ మండింపవే లోకమున్.

కలవరమయ్యె దేశమున గాంధిమహాత్మ, నిరన్నదీక్ష నే
వలదని చెప్పునంతటి ప్రిపన్ముఁడగా; నెట్టులైనఁగాని నీ
తలపయిమోపియున్న జనదాస్యవిమోచన కార్యభారమే
తల వహియింపనోపు; నవతారపుఁబర్యవసానమిద్దియే?

అతుల పరోపకార యుతమైన మహాత్ముని జీవితంబు సం
తతము నిరామయంబయి జనంబుల పాలిటి కల్పవృక్షమై
శతసమలుండు గాత యని సంతస మొప్ప జయంతి సల్పఁగా
మతిఁదలపోయు నీ పిడుగు మాటలు దూకెనుపాయనంబుగన్.

చావుం బ్రతుకులు రెంటికి
నావలిమార్గంబుఁద్రొక్కు నచలుఁడవగుటన్
మావలెఁ దలఁపం గోరవు;
దేవుఁడు గలఁడింక మీఁది దేశస్థితికిన్.

22-9-1932.

కళాప్రపూర్ణుఁడు.

తీరుగఁ దిక్కయజ్వ తరితీపు తెనుంగు కవిత్వ సారపున్
ధారల నాంధ్ర సాహితి సుధామధురం బొనరించెఁ బూర్వ; మా
కీరితి పొల్లువోక పలికించెడు సింహపురాన నేఁటికిన్
శారద కావ్యనాటక విశారద మంజువిపంచి నాదముల్.

నాఁటిని నేఁటినిం గలుప నాణెపు వంతెనయౌచుఁ బాండితీ
పాటవమందు విద్వదభివంద్య కవిత్వ విమర్శనంబులన్
బోటియు సాటిలేని కవిపూజ్యుఁడు వేంకటరాయశాస్త్రి యా
మేటరి సంస్కృతి ప్రతిమ మించు హృదంతర పద్మపీఠికన్.

శ్రీనాథకవివర్య శేముషీ విభవంబు
కావ్యార్థ కల్పనా గౌరవంబు;
కృష్ణరాయ నృపేంద్ర కృత విష్ణుచిత్తీయ
కేరళ ఘన నారికేళరుచులు;
ప్రకృతి సౌందర్యంబు ప్రతి పదంబున నించు
కాళిదాస కవీశు కావ్యరసము;

భవభూతి సాహిత్య భాండార పేటిక
దాఁగిన యాణి ముత్యాలసరులు;

శ్రమలకోరిచి, యేరిచి, సంతరించి,
యాంధ్ర వాఙ్మయ దర్శన హర్మ్యమందు
సంతపెట్టిన వ్యాఖ్యాతృ చక్రవర్తి
పేరు స్వర్ణాక్షరంబుల వెలుఁగుటరుదె!

కల్పించినాఁడు యుగంధ రామాత్యుని
కైతవోన్మాదంబుఁ, గార్యదీక్ష;
చిత్రించినాఁడు కృశించిన యాంధ్ర శౌ
ర్యము రేఁగ బొబ్బిలి యాహవంబు;
పరగించినాఁడు మా భావన బాణ పు
త్రిక పెండ్లి చలువపందిరింళ్ళ నీడ;
దక్కించినాఁడు కథాసరిత్సాగర
కథలఁ దెల్పున గద్య గౌరవంబు;

'ఆంధ్ర భాషాభిమాని' సమాదరించి
దిద్ది యభినయాభిరుచులు దీర్చినాఁడు;
అంతటి కళాప్రపూర్ణున కంకితముగ
స్మరణ చిహ్నంబు నిల్పుట సార్థకంబు!

ఈ వొనర్చిన సేవకు నీకుఁ జోడు
ప్రతికృతి యొనర్పలేము విద్వద్వరేణ్య;
యెవరి యుపకృతియును లేక యీ యనంత
కాలమున నీదు నామ మమరత గాంచు!

[వర్ధంతినాఁడు చదువఁబడినవి.]

24-12-1932



ప్రథమ కవిత్వము

1916 –1918

విన్నపము.

1915 వ సంవత్సరాంతమున నాయందు కవిత్వ మంకురించినది. 1916 మొదలు 1917 వఱకు నాకవితాభ్యాస కాలము. ఈయొక సంవత్సరములోపల వ్రాయుటయు చదువుటయు చాలతీవ్రముగ కొనసాగినది. రసికజనానందము, స్వప్నాశ్లేషము, అహల్యానురాగము, కృష్ణుని రాయబారము, అను ప్రబంధములను రచించితిని. ఋతుసంహారమును పుష్పబాణవిలాసమును ఆంధ్రీకరించితిని. అప్పుడప్పుడు ఖండకావ్యములుగూడ వ్రాయుచుంటిని. ఇవియన్నియుంగలసి వేయి పద్యములకంటె నెక్కుడుగనుండును. కాని, ఆకావ్యములు, వ్రాతనెరవడి కుదురుటకు వ్రాయఁబడు కాపీపుస్తకములవలె నున్నవనియు ప్రకటనార్హములుకావనియు భావించి మూటకట్టి మూలపెట్టితిని. ఎవరైనను "పద్యములు బాగుగానేయున్నవి" అని చెప్పినప్పుడు వారు మోమోటతో చెప్పుచున్నారని భావించితిని. "బలవదపిశిక్షితానామాత్మన్యప్రత్యయం చేతః" అను అనుభవపూర్వకమైన కాళిదాసుని సూక్తియుండగా నాబోఁటి యశిక్షితునకు ఆత్మవిశ్వాసము కొఱవడుట యొక వింతగాదు.

1927 నవంబరునెలలో వీచిన పెనుతుఫానుగాలికి కిటికీ తలుపులుపగిలి ప్రక్కనున్న పుస్తకములబీరువా వానజల్లున తడిసి లోనికి నీరు ప్రవేశించి పుస్తకములు నానిపోయినవి. వ్రాతప్రతుల దస్త్రముకూడ నానిపోయెను. ఆనోటు

బుక్కులనుతీసి యెండఁబెట్టితినిగాని, కాగితములు అట్టలు కట్టు కొని పోయి సిరాతో నలికివేసినట్లు అక్షరములు అగోచరము లైనవి. వస్తువు నశించిన వెనుక దానిపై ప్రీతిహెచ్చుట నైజమే మొ! భగ్నావశిష్టములైన యీకావ్యములను ఖండకావ్యముల ను గుర్తింపసాధ్యమైనంతవఱకు ఎత్తివ్రాసి "ప్రథమకవిత్వ" మనుపేర ఈఖండకావ్య సంపుటమున చేర్చితిని. "స్వప్నశ్లేష ము" మాత్రము పూర్తిగా చీకిపోయినది.

"నలజారమ్మ"కు ననంతరమును "వనకుమారి"కి పూర్వ మును అనగా 1917వ సంవత్సరమున వ్రాయఁబడిన "మాతృ శతకము" ప్రతికూడ తడిసిపోయికొన్ని పద్యములు గుర్తించు టకు వీలులేక అర్ధానర్థరూపములతో బయటపడినది. దానిని కూడ నిందుచేర్చితిని. ఈశతకము కావ్యసంపుటమున నలజారమ్మ వనకుమారీకావ్యముల మధ్యగాని లేక ఖండకావ్య సంపుటమున మొదటగాని చేర్పఁబడియుండిన రచనాకాల క్రమమునకు భంగము వాటిల్లకుండెడిది.

ప్రథమకవిత్వముమీఁది ప్రేమచాపల్యముచేత ఈకా వ్యఖండములను ప్రకటించుచున్నాను. నాకవిత్వ పరిణామ మును దెలిసికొనుట కీకావ్యములుకొంత తోడ్పడగలవు. సహృ దయులు నాచాపల్యమును మన్నింతురుగాక.

పెమ్మారెడ్డిపాళెము
9-5-1935

ఇట్లు,
దువ్వూరి రామిరెడ్డి.



రసికజనానందము.

శ్రీమహిళామణీ కుచపరిస్ఫుట కుంకుమ చందనాంకమున్
భామినిరాధ దా వరుని వక్షమునంగని మోముఁద్రిప్ప "నా
కేమి శరణ్యమింకసుదతీ," యనిపాదసరోజ పాళికిన్
వేమఱుమ్రొక్కు కృష్ణుఁడు వివేకరమా విభవంబు మాకిడున్

*　　　*　　　*

"క్రీడికినోడి, కంఠమున క్ష్వేళమునుంచియుఁ, బుఱ్ఱదాల్పు వై
పాడి రవంతలేక పరభామను గంగనుబొంది, బూచులం
గూడి నటించునీకు ననుగూర్చె గిరీశుఁడ"టంచు మేలసం
బాడెడుపార్వతిన్ నగి ప్రియంబులఁ దన్పు మహేశుఁగొల్చెదన్

*　　　*　　　*

పలుకున్ జోటి విపంచికాననవరసవ్యాబద్ధగీతంబులన్
వలపింపన్ నిలుపోపలేనితమిఁ జేరంజీరి కర్ణోత్పలా
విలసద్గండము నొక్కినొక్కి యధరావిర్భూత సౌరభ్యసం
కుల మాధ్వీరసమత్తుఁడౌ విధియుమాకుంగూర్చు దీర్ఘాయువుల్.

*　　　*　　　*

ఒక్కరిశిక్షలేదు; కవినొక్కనినేనియుఁ గాంచలేదు; పే
రెక్కిన పండితాఢ్యులిదమిత్థమటంచొక కావ్యమేనియున్
నిక్కము, సెప్పలేద! యిఁకనీదగు సొంపురహించు కైత వే
ఱెక్కడనుండి యుప్పతిలె? హృత్సరసీజమునుండియే కదా!

కాఱునఁ బట్టిలాగినటుగాఁ దిలపిష్టపుశైలిఁ గూర్చి ము
మ్మాఱులు విమర్శచేసినను మాధురి సుంతయులేక యెంతయున్
నీరసమౌ కవిత్వమును నేర్వకయుండిన నేమిలోటు? సొం
పారెడు భావబంధముల కాశ్రయముల్గద సత్ప్రబంధముల్.

భావరసప్రసంగములు పాయఁగరాదు; సుధామయోక్తులం
బోవిడరాదు; మార్దవమువో శ్రుతికంటకమైన పల్కు సం
భావన సేయరాదు; మదిభారము తోఁపఁగరాదు; శైలిసొం
పేవగఁజూడ నిక్షురసమీనెడునట్లు రచింపు కావ్యమున్.

బాలురు సైతమొక్కరిని పద్యగతార్థము వేడగాదు! వా
చాలురు బాపురే కవిత! సారససారమరందలుబ్ధతన్
మాలలుగట్టిమూఁగు నళిమండల గీతములంచుఁ బేర్కొనన్
మోలిన ముద్దుమాటలను మూటలు గట్టుము తీపుజొత్తిలన్.

రసికులు మెచ్చుకోవలె; విరాజితకుండల గండపాళి సొం
పొసఁగవలెన్; మరందరసమూటలు గట్టవలెన్; మిటారిమే
ల్పసిమి వలందగుబ్బలను బయ్యెదజాఱినఁ బొల్చుకొంబసల్
పొసఁగవలెం గడింది; యటుపొల్పెసఁగన్ రచియింతు వేకృతిన్.

అనియిటు మత్స్యఖుఁ డర్మిలి
ఘనిఁబూని వచించినట్టి పల్కులనెల్లన్
మనమునఁ జింతన చేసియు
ననుమానముతోడ నిట్టు లంటిని మిత్రా.

చిన్నయసూరి వ్యాకరణసింధువు నీఁదను; సంస్కృతాంధ్రశ
బ్దోన్నతపారముంగనను; నొప్పులు తప్పులెఱుంగుబుద్ధిసం
పన్నత లేదు, కాని యలవాణి యయాచితరీతి నన్నుఁ గై
కొన్న తెఱంగుగాక, కృతిఁగూర్పఁగ శక్యమె నన్నుఁబోఁటికిన్.
దోసఁగులు గల్గునంచుఁ, బరితుష్టియొసంగదటంచు, నెవ్వరో
కసరుదురంచు, మత్సరులుగాంచి హసించెదరంచు, భావముల్
రసములు గూడవంచును జిరంబుగ వేచిన నేమివచ్చు, నా
పాసఁగిన కైతయుం జివికిపోవును బాండితి దిబ్బగుంటలోన్.

కృతులురచియించి యందఱి మతులనొకట
తుష్టిపఱుపంగనౌనె యాస్రష్టకైన?
"జిహ్వకొకరుచి" యంచును జెప్పునుడిని
సాహితీపరు లెఱుఁగరే సరసులౌట!

* * *

అంగజ సంగర క్లిశిత హల్లకపాణుల చెక్కుఁజెమ్మటల్
రంగుగ జోపుసేర్పున నిరంతరమున్ మృదుమందవాయువుల్
గాంగతరంగ సంచలిత కాంచనవారిజ సౌరభార్ద్రితన్
బంగరుమేడ సోరణలబాటఁ జరించు సుశీతలంబులై.

సీవిసడల్పకుండ, రమణీయకుచంబులఁ బైటఁ దీయకే
దా్రవఁగనీక యోష్ఠరసపానము మోసపుటక్కు సల్పుచున్
జీవయొకింత లేని విటశేఖరులన్ గిలిగింతలార్చియే
భావజకేళిఁదన్పకయె పంపుదు రర్థమునాఁచి రోఁచెలుల్

* * *

అట్టిపురోత్తమంబున.

కలఁడొక పంటకాఁపు కలకాలముఁ దాతలనాఁటి యాస్తులై
వెలయు మణీకలాపములు వేసవినేన్ వరిపండు నైదువం
దల యకరాలమళ్ళు, దగుధాన్యపుగాదులు పాడియావుఁలుం
గలిగి సమస్తసంపదలఁ గ్రాలుచునుండెను బెద్దకాఁపునాన్.

[ఈపెద్దకాఁపున కొకపుత్రుఁడుద్భవించి క్రమముగ బాల్యంబు గడపి విద్యలనభ్యసించి యౌవనప్రారంభసమయమున కామాయత్తచిత్తుఁ డాయెను.]

కన్నులువాల్చూపు కడలొత్తె; వక్షము
కాంక్షించె ఘనసార కర్దమంబు;
బాహువుల్ ప్రియురాలి పరిరంభమాశించె,
ముద్దు సౌఖ్యముఁగోరె మోవిచివురు;
చన్నుగుబ్బలిపైకిఁ జననుబ్బె నఖశశి;
రదనముల్ జిలగొనెఁ బెదవినొక్క;
కర్ణయుగ్మముఁగోరెఁ గంతు కయ్యపుఁబలుకు;
నాస యపేక్షించె శ్వాసతావి;

అంగమంతయుఁ గైసేత నభిలషించెఁ;
జెలులబొమవింట వాల్చూపు ములికిదొడిగి
మరుఁడుగాంచ గోవాడి మనమునోచ్చె
లలిత యౌవన సౌభాగ్య లక్ష్మిరాఁగ.

[ఆయెమ్మెకాని సదనంబునకు కతిపయదూరంబున రో వెలందుల వాడగలదు. అందు కనకాంగియను కన్యసౌందర్య రాశియై యొప్పారుచుండెను.]

అంతనా కలహంసీయానకు.

కన్నులాడలఁ జేరఁగావలెననుకొన్న
నరచూపు చూచె నీ యన్నుమిన్న;
యురమున సుఖసుప్తి మఱిఁగియుండెదనన్న
నిక్కుగుబ్బలరాపు లుక్కుమీఱె;
కౌను పేదఱికంబుఁగాంచి యాశ్రియలాభ
మేమి యటంచట కేఁగ నైతి;
నాభిపజ్జనునుండ నాభీల కూపమై
వెఱపు నబ్బురమును గఱపె మిగుల;
కన్నెపుట్టిన దాదిగాఁ గన్నుతెప్ప
మైత్రి గల్గిన యాయేణనేత్రఁబాసి
యెట్లు సైచెదనని బాల్య మెంతొ వనరి
యరిగె నెట్టన యౌవనం బడుగువెట్ట.

కనకాంగి మోవికి నెనగాక కాఁబోలు
పల్లవంబొక సుప్రవాళ మయ్యె;
పూఁబోఁడి నాసతోఁబోల్పు చెందకయేమొ
కలికి సంపెగమేలి కనకమయ్యె;
నుత్పలేక్షణ కౌను కుద్దిగాకనో యేమొ
యంతరిక్షము శూన్యమై రహించె;
పాటలాధర కటి సాటికి నిల్వక
వసుధవెలసెను కువలయమనఁగ;

కన్నులకు నోడి లేళులు కానఁదిరిగె;
పాదములకోడి జలముల్ పడెనునీట;
మాఱుపేరులతోనైన మఱఁగియైనఁ
బడఁతి సౌందర్యమునకోడి బ్రతికెనవియుఁ.

తేఁటిదాఁటు నీటుఁబాటి సేయవు కురుల్;
మీల నేలఁజాలు వాలుఁ గనులు;
కెంపు పెంపుఁజంపు సొంపు నింపెడుమోవి;
మించు మించు నొంచు మేనిసంచు.

పున్నాగము రోమావళి;
పున్నాగము నాభి; చనులుఁ బున్నాగములే;
తన్నాగంబుల గెలువఁగఁ
బెన్నాగంబగుచుఁ దనరె వేణి సుదతికిఁ.

శ్రోణియందముదాచఁ బ్రిసూనశరుఁడు
మింద తుమ్మెద తెక్కలకాండపటము
గట్టెనోయనఁ జికురాళి కలికి పిఱుఁదు
లంటిజీరాడుఁ జీఁకటులావరింప.

వక్షమనుకాంతిసరసి యౌవనపుదేభ
మీఁద, హరిమధ్యమేఖల హేతుకలన
బిట్టుగర్జింపఁ గుంభముల్ భీతినెత్తె
ననఁగఁజనుదోయి రాజిలు నబ్జముఖికి.

* * *

ఇట్లు సకలజనానురంజకంబై యొప్పువసంతంబున నొక్క నాఁటి సాయంసమయమున కాపుఁకోడెగాఁడు ఉద్యానవనంబునఁ దీవచప్పరంబునఁ గూరుచుండి మన్మథార్తుఁడై వారకాంతా యత్తచిత్తంబున నిట్లుచింతించె:

* * *

మత్తమతంగయాన మధు మత్తతఁ గన్నరమోడ్చి యుబ్బిపై
కొత్తెడుపూపచన్మొనల నోరగఁబయ్యెద జాఱఁదీసి మే
ల్పుత్తడి కీలుబొమ్మవలెఁ బొల్చునొయారముగాంచనామరుం
డెత్తడె మీనకేతనము, నేడ్తెఱగుప్పడె పూవుటమ్ములన్?
అరయఁగలేదె మాకొలపుటంగనలం బదివేలసారు; లె
త్తఱిఁ దలదువ్వి కొప్పెవ్వదను దండిగఁ బూవులువెట్టిపట్టుటం
బరములుగట్టి వల్లభులభావములన్ హరియింపఁబోరు; రో
తెఱ వలయట్లు నాణెమును తీరును పోదిరియొనర్పరీసతుల్.

మనకులకాంతలా చెలులమాదిరిగా; రదియెట్లులన్న నే
వినయము లేదు, మన్మథవివేకముశూన్య, మటుండ గానముం
బనుపడఁబోదు; పల్కరొకపాటిరసోక్తు; లవెట్టులుండినం
గనఁబడఁబోవుగా వెదకికాంచినఁ జేఁతకుమాటుసేఁతలున్.

సొగసులుచేసికొన్నఁదఱుచుం దలదువ్వినఁ బాటపాడినన్
మగల మనంబులాఁకగొను మాదిరి సల్ప సతీత్వధర్మముల్
విగళితమౌనటంచు విలపింత్రుకులాంగన లేమిసెప్పు; నా
మగువలు పేడతట్టలటు మాఱఁ బతివ్రతలౌదు రేమొకో!

ప్రాజ్ఞులాడిన "శయ్యనేపురంభ" యనెడు
సూక్తి కులసతి యెఱుగని సుద్దిసూవె!
అట్టి నైపుణి వెలయాలినాశ్రయించె;

* * *

నిగనిగల్ నగఁజాలు తొగఱాల పోగులు
నిద్దంపుఁ జెక్కుల ముద్దుగురియ;
మగఱాలు పగడాలు నగపాలు జిగులారు
తారహారము లెదఁ దళుకులీన;
పాలడాలును జాల నేలఁజాలిన మేలు
వింత దువ్వలువపై వెల్లివిరియ;
జిలుగు కస్తురిక్రొత్త కలపముల్ వలపుల
వాయుపోతములకు వడ్డికీయ;

అంగుళుల ఊాల యుంగరాల్ రంగు మీటి
కుండలంబుల కాంతితోఁ గూర్మి సలుప;
వెఁల వెలందుల వాడకు వెడలె నంత
రామకృష్ణుండు రెండవ కాముఁడనఁగ.

వినని యట్టుల వినువారి వింత నుడులు;
చూడనట్టులఁ జూచు నా సుందరులను;
నడచి నట్టుల నడచును గడవఁ డొక్క
బాఱెఁడైనను దన్మయ భావమంది.

అప్పుడా పల్లవుండుల్లము పల్లవింపఁ బల్లవపాణులంగని యిట్లు చింతించు:

కన్నుసన్నల నాయింతి కన్నువిల్తుఁ
బిలిచి ననుజూపి చిత్తము బిట్టునొవ్వ
వేగఁ జనుదెంచె నొకవంక వీథిదాఁటి
గబ్బిగుబ్బల వ్రేగునఁ గాను వడఁక.

వలపు గుల్కెడు క్రొత్త కలపమలఁదెనేమొ
కమ్మ కస్తురితావి గ్రమ్ముకొనియె;
విటుని పుక్కిటనున్న విడెమందుకొనెనేమొ
ఘనసార గంధంబు గడలుకొనియె;

పటుబాధ నిపుణత విటులఁ దేల్చినదేమొ
భామయూరులు తోట్రుటఁబాటునొందెఁ;
సురతాంత తాంతమై సొక్కిపోల్చినదేమొ
చెక్కులమకరికల్ చెదరిపోయె;
క్రమముదప్పిన చుంగులు గదలియాడఁ
బైట సవరించు నెపమునఁ బట్టిడేసి
చనులు చూపియుఁ జూపక సగము మూసి
కాంత ననుగాంచె నెవతెయో సంతసమున.

ఇప్పుడె వత్తునంచుఁ దన యిక్కకుఁగాంతుఁడు సేరకుంటవాఁ
డెప్పుడువచ్చునో యనుచు నెవ్వరుపోయినఁ బుల్కుపుల్కునం
దప్పక పైగవాక్షమున దామరసేక్షణ తొంగిచూచె; నే
నిప్పుడెదాని బారిఁబడియేఁగెద నన్ను వరించిరమ్మనన్.

జవ్వని యెవ్వతో తెలియఁజాలనుగాని తదీయ వేణితీ
రెవ్వనికైనఁ దెల్పదె మృగేక్షణ భోగినియంచు; మించుకొ్రం
బువ్వుల సెజ్జపై స్మరవిభూతికిఁ బట్టముగట్టుకొన్న నే
జవ్వను పుట్టువైన భువి సంతతసార్థకమాట వింతయే!

* * *

ఈతని నడక యొయ్యారము,
ఈతని తెలివాలుచూపు, లీతనియందం
బీతని వెడఁద యురంబును
బ్రీతిగనే యువతిచూడ వీడునె మరుఁదున్.

సిబ్బిగుబ్బలు గలుపాటు చెందివడఁక
జాఱుపయ్యెదను సవరించకయ మఱచి
కాఁపు బొజుగును గాంచుచుఁ గదలకుండె
నతను పడుకింట వ్రాసిన ప్రతిమవోలె.

*　　　　*　　　　*

దైవవశమ్మున నప్పుడు
పూవులు గోయఁగ నేఁగు పూఁబోఁడి నవిం
దో్రివకు నడ్డంబల్లిన
తీవనుసరియొత్తి మరలఁ దిరిగెడునప్పుడున్.

*　　　　*　　　　*

కులుకు మిటారి గబ్బిచనుగుబ్బలఁ జేసి తదీయభారముం
దెలిసి, లతాంగికౌను గడతేరదటంచుఁ బెఱుంగు భాగమున్
బలితపుమూలబంధనము భాతినొనర్చె యు నారుకమ్మినిన్
వళులనుత్రాఁటితోనడుము పైబిగియించెనొయే మొ బ్రహ్మయున్.
ఎచ్చట నైనఁగాంచితినె యిట్టిమనోహరరూపు? కాంచినన్
మెచ్చుగడించు క్రొందళుకు మీలకనుంగవయున్నె; యుండినన్
బొచ్చెములేని చంద్రికళఁబోలెడి నెన్నుదురున్నె; యుండెఁబో
యచ్చపలాయతాక్షి దరహాసము చాలదె గెల్వనంతయున్.

*　　　　*　　　　*

ఎయ్యదియూరు, మీరిచటికేగుటకుం గత మెద్దియయ్య యిం
కెయ్యెడనుందురే సతము; నెవ్వరుబంధులు, సమ్మదప్రదం
బయ్యెనె వాడసొంపు; పనులన్నియుఁ దీరెనె; యొప్పుడేగుటల్;

*　　　　*　　　　*

గానాలాపము వింటిరే, నటనముల్ గాన్పించెనే, హార్మొనీ
వీణానాదము మోదముం గొలిపెనే, వీక్షించితే మాడుకుల్,
కానంగల్గినె వారకామినుల నాకస్త్రీసమానాంగులన్
దేనన్ విరాకీటుఁ దృప్తిగ్గొనుదికిం దెప్పంగరాదే ప్రియా.

* * *

వార కాంత మాత వచ్చి దగ్గఱ నిల్చి
యింపు కానిఁ జూచి యిట్టులనియె;
నెప్పుడైన మీర లీవాడ కేగరు
వెలవెలందు లంత వెకలివారొ?

* * *

కాలము చెల్లెకొంత; యలకమ్మల వెల్లిచిగిర్చె; మున్ను నే
జాల విటాగ్రిగణ్యులను జాతురిమైఁగవగూడి యుంటి; నే
వేళను నిట్టినాకు వెలబిత్తరి భాహ్యముసేయు; రింతకున్
మూలకమింగిలీషు; ముమమున్నిటువంటి కలాఢ్యులుండరే.
ఎట్టోవిద్యల నభ్యసించి తుద బి. య్యే. ప్యాసుగావించి, తా
రెట్టోప్లీడరులయ్యు వేదికలపై నింగ్లీషుభాషించి మా
పొట్టల్మాడ్చెదు సంఘసంస్కరణముల్ బోధింత్రులోకంబునన్
గట్టా! గోప్యముగాను వారు గణికం గామింపకేనుంమరే,

తహసీలుదారుఁడు దంపూరు శివరావు
మీనాక్షితోఁగూడి మెలఁగలేదె;
అగ్రహారీకుఁడు హరిహరశాస్త్రిలు
ఇందిరమ్మకు ధన మీయలేదె;

పించెను కలకటేర్ పెద్దిచిన్నయసెట్టి
నన్నుఁజేపిడెనే మొఁన్న దనుక;
ప్లీడరు వినుకొండ పిచ్చి మాధవరావు
విజయలక్ష్మి గృహాన విడియలేదె;
చక్కనయ్యలు వేదిక లెక్కినిక్కి
చేయుత్రిప్పుచు లెక్చరుల్ చెప్పనవియు
నేతిబీరకాయలుగావె! నేఁతలేవి?
పలుకవచ్చును నోటికిఁదలుఁపు గలదె?

*   *   *

గురువునైనఁగాని కుంభినీ ధవునైన
గణికనైనఁ బేర్మిఁ గాంచునపుడు
రిక్తకరములఁ జన యుక్తముకాదండ్రు
ధర్మవిదులు; గాన, ధనమునిపుడు,
తెచ్చితిఁ నూటపదారులు
పొచ్చెములేకుండ కూర్మి బోటికి; నిదిగో
ఇచ్చెదఁగొనుమా, విను, నీ
వెచ్చట ననఁబోకు గోప్యమిది యన వినియున్.

*   *   *

విను మొకమాటఁ జెప్పెదను వీరలవారలరీతి మమ్ములన్
మనమున నెంచఁబోకుఁ; డతిమాన్యతనొందెను నామతల్లి; మే
మనయముబూజ్యులలౌ విటులకాతతసౌఖ్యముగూర్చు టొండెఁ;
యా।ధనమతిముఖ్యమౌ, రసికతల్ సుగుణాలు ప్రధానమౌసఖా

ఇటుసుతపలికిన వినియా
మటుమాయల వేశ్యమాత "మనసిరియెల్లన్
విటునిది కాదే, యిరువుర
కిటుభేదములున్నె బేలవీవు మృగాక్షీ.

తీసిపెట్టుధనము తిరిగి యీయనొప్పు
వలసి యడుగ నీయవచ్చుమనము;
అనిన రొక్కమంది యానంద కలితయై
యినుప పెట్టెయందు నిడియెఁ జెడిప.

* * *

ఇటులొక సంవత్సర కాలము సంతోష తరంగితాంత రంగులై వెలవెలందియు కాఁపుకోడెగాఁడును కాలము పుచ్చుచుండ నొక్కనాఁడు వేశ్యమాత ధనాకర్షణ యంత్రియో యాయన ఆతని సమీపమున నిలుచుండి యారోపిత వినయావనత వదనయై యిటులవిన్నవించె:

దాదాపబ్దంబయ్యెను
నిదాపునఁజేరి తనయ, నీవెఱుఁగవొకో,
నాడాఁచిన ధనమంతయు
నీదినమున కఱుగుముట్టె నిఁకమీఁదెటులో.

నీవిటుఁ జేరిన దాదిగ
నే విటులును నొంత విత్తమిచ్చినఁగానీ

నా వాకిలిఁ జొరనియ్యను;
నీ వెఱుఁగవె దాని ప్రణయ నిశ్చలవృత్తిన్.

* * *

కోకలు ప్రీతవైచినిగేఁ గోరిన పట్టుగులాబిరైకలం
జాకలి పాఱవేసె; నిఁకఁ జాయమఱాగిన చీఁకిగాఁగరా
రేకులు చీకువట్టెరు సరే, ఘనసార మృగీమదంబులున్
లేకగదా నెలంతయు విలేపము మేదుటలేదు రొమ్మునన్.
దినమును జెప్పనెంచి నిను ధీరతఁ జేరుటకాని చెల్లరే,
మనమెటు లాయిచేసినను మాటలురావుగ! జంకిగొంకి నిన్
గనుఁగొని యెట్టకేలకును గష్టములన్నియుఁ దెల్పికొంటి; దీ
నిని మనకన్యకుం దెలియనీకుఁడు; చూడుడు కార్యపద్ధతిన్.

* * *

అంతట నొక్కనాఁడు తల్లి రామకృష్ణారెడ్డిని జేరఁబిలిచి యిట్లనియె.

జనకుఁడు వృద్ధుఁడయ్యె; వ్యవసాయముభారము; కూలివారలన్
దినమును బిల్చి సేద్యము నుదీర్ణతఁ జేయఁగ లేఁడు; తోడు నీ
వనిమది నమ్మియుంటిఁ గొడుకా, ముదిప్రాయపుఁదండ్రి కూఁతవై
పనుల నొనర్చుకున్న నిలవారలు పుత్రులఁ గోరు టేలొకో.
ఎన్నోనోములునోచి తుట్టతుద కెంతే ప్రీతి నిన్ గాంచి నా
నన్నా, పుట్టిననాఁటఁగోలె ధరపైనాస్పంగ నేమౌనో యం
చెన్నోదృష్టులు దీయుచున్ దినము నీదేచింతగాఁ జూచుచుం
గన్నారం గనుచుంటినయ్య తనయా, గారాము తోరంబుగన్

పుట్టునొ యొక్క బిడ్డ యటుపోవుట వచ్చుటఁ జూచు భాగ్యముల్
గట్టునొ యంచు నాకడుపు గల్గినదాదిగ నెంచికొందు; నీ
యట్టికు పుట్టి చందనకుజాళికి నల్లిన ముండ్లతీవె నాఁ
గట్టడి బిడ్డవైతివిగ కాఁపుకులానకు మచ్చవెట్టఁగన్.

తనయుఁడు గల్గునా, కులముధన్యతఁ గాంచున, పేరునిల్పునా,
యని మదినెంచి యుంటి నవురా, యిదియేమిర, చేటుగాల మీ
వనయము వారకాంతల గృహంబునఁ బొద్దులుపుచ్చి పెద్దవా
రిని రవసడ్డసేయక చరించెదు సోమరిపోతువై యిసీ!

కులమును శీలముం గలుగు కోడలు నా కుపచర్యసేయరాఁ
గిలిచెడు భాగ్యమబ్బునని ప్రీతిమెయిం దలపోయుచుంటి; నేఁ
డెలియక పోతి నీకసటుఁ దెక్కలి చెయ్వులు; మాన వేర యా
కలికి పిసాళి పచ్చిపలగాకులఁ గూళల రోసెలంతలన్.

కంటెని నీకు చైదములు, కంటెని నీకయి డబ్బుపోకడల్;
తుంటరివారిఁ జేరి వెలతొయ్యలి నెయ్యము దెచ్చికొంటె; వా
ల్గంటులు లేరె కాఁపుల కొలంబునఁ బెండిలి చేసికోఁగ; పా
ల్వంటి కులంబు నీటఁ గలుపన్ గమకించితె యోరిమూర్ఖుఁడా.

* * *

[శ్రీ తిరుపతి వేంకట కవుల శ్రవణానందమును చదివిన వెనుక అటువంటి కథనే కల్పించి కావ్యము వ్రాయవలయునని దీనిని వ్రాసితిని. ఇది నాలుగాశ్వాసముల ప్రబంధము. 550 పద్యములు.]

ఋతుసంహారము.

వేసవిరాత్రులందు నలివేణుల యూర్పులకుం జలించు న
వ్యాసవముం గరంబు కుసుమాస్త్రక దీపనమౌ విపంచి గీ
తాసదుపాయముం గలిగి దర్పక బాధితులంత ధూప స
ద్వాసిత రమ్యహర్మ్యముల పైతలమందు సుఖింతు రగ్మిలిన్.

సారసుగంధ సమ్మిళిత చందన లిప్త పయోధరంబులన్
హారి తుషార గౌర సముదంచిత హారములన్ ఘటించి యిం
పారు నితంబసీమను సువర్ణపుఁగాంచి నలంకరించు శృం
గారవతీలలామఁ గనఁగాఁ బ్రియమారదె నెట్టివానికిన్.

కరము నసహ్యమౌ పవనకాండము రేణుక మండలంబు స
త్వరగతి రేఁప, భూమి ఖరభాను కరావళి సంతపింప దు
ర్భర వనితా వియోగశిఖి ప్రజ్వలియింప హృదంతరంబులం
దిరుగు ప్రవాసులిద్ధరణిఁ దేఱి కనంగ నశక్యమయ్యెడున్.

మలమలఁగాయునెండలకు మ్రగ్గుచు జింకలు కానయందు దా
డలు వసివాడ నత్యధికదాహమునం జరియించి భిన్న క
జ్జల నిభమౌ నభంబు పలుసారులు నీరను భ్రాంతి నాతురన్
బలు పరుగెత్తుచున్నయవి పైఁబయి నట్టుల నెత్తిచూచుచున్.

మిక్కుటమైన యెండలకు మిక్కిలి తాపముఁ బొంది విక్రమం
బెక్కుడలేక వక్త్రము మఱింతగ విప్పుచు వ్రేలు కేసరాల్
నిక్కవిదిల్చి నాల్కఁ గదలించుచుఁ బెగ్గడఁగ సింహపుచ్చటం
బ్రక్కలనేఁగుచుండెడు నిభంబును సైతముఁ జాపమద్దతిన్.

నురుగులు మాటిమాటికిని నూల్కొన నాల్కలు సాఁచి నోళులం
దెఱచుచు మోరలెత్తుమను ద్రిప్పుచు దాహముపుట్ట నీటికిన్
దెరువులు సూచుచున్ బడలి నెట్టన భూధరగహ్వరంబులన్
బరువిడె బల్త్రితండములు బారులు గట్టి తదగ్రిభూమికిన్.

చిటపటదావదాహముచఁ జెట్టులు చేమలు గాలిపోవ, ను
త్కట పవమానవేగ పరికంపిత శుష్క పలాశ సంచయం
బటునిటు పైకిరేఁగఁ; గమలా ప్తవిత ప్తజలంబులొట నా
యటవులు భీతిదంబులుగ నయ్యెను నెత్తుననుండి చూడఁగన్

అనిల వివృద్ధ వహ్ని నికటాద్రి గుహాంతర సీమమందుచున్
ఘన నినదంబునన్ విరియఁ గాననఁ గాలిన శుష్కవంశముల్,
కనులటు మూసియెత్తఁ దృణకాండముసంజొరి వృద్ధినొందుచున్
వనమృగ వర్గముం గడు వనారిలఁ జేయును భ్రాంతలగ్నమై.

జ్వలనము శాల్మలీమహిజ సంతతులం బ్రభవించి ధాత్రిజం
బుల పెనుకోటరంబులఁ బ్రభూత శిఖాజిత హేమవర్ణమై
తళతళ మండుచున్ బరిణతచ్ఛదసంకుల వృక్షజాల శా
ఖల కెగఁబ్రాఁకుచుం బవనకంపితమై భ్రమియించు నంతటన్.

* * *

భిన్న ఖగేంద్రరత్నములపెంపును నింపు దృణాంకురంబు, లు
త్పన్న శిలీంద్రకందళ వితాన మనోజ్ఞత, యింద్రగోపకా
భ్యున్నతి మీఱుభూమి యసితోజ్జ్వల రత్నవిభూషితాంగియై
చెన్నలరారు కాంతవలెఁ జెల్వగు నెల్లెడఁ బాఱఁజూచినన్.
కమ్మని తేనెఁద్రావి తమకమ్మున జుమ్మనిపాటపాడి ప
త్రిమ్ములులేని తమ్మివిరి తండముపీడి సముత్సుకమ్ములై
యిమ్మగు నల్లగల్వలని, యెమ్మెగ నెమ్ములు నృత్యమాడ భృం
గమ్ములు పింఛచక్రములఁ గ్రమ్మెదు; మూఘులెకా మలీమసుల్

* * *

ఒకయెడ శంఖపాండురత, యొక్కెడ బాలమృణాళకాంతి, వే
ఱొకయెడ వెండి నిగ్గులనునొప్పి, విముక్తజలంబులౌట వే
శకలములై లఘుత్వమున సాగు పయోదము లొప్పఁ జామర
ప్రకరముచేత వీవఁబడు రాజనఁ గ్రాలు నభంబు మిక్కిలిన్.
ఆకాశంబు విమర్ధితాంజన నిభంబౌ కాంతి దీపింప, బం
ధూకంబుల్ వికసించి శోణరుచులన్ దోఁపింప ధాత్రిన్, నవా
స్తోకాంభోజవనావృతోర్వ్యలగుచున్ సొంపార వప్రంబులున్
లోకంబందు నిఁకెట్టి యౌవనునకే న్నాలోఁల్పవే వేడుకల్.
ఫలభారంబున వ్రాలుశాలితతులం బల్మాఱునూఁకించి పు
ష్పలతాభారవినమ్రముల్ తరువులం బ్రాపించి యూఁగించుచున్
విలసత్ఫుల్ల నవారవింద నలినీవీధిం బ్రవేశించి గం
ధిలవాతంబు బలాత్కృతిన్ యువమనోధీరత్వమున్ దుల్పెడిన్

మదనుఁడు,నృత్యకృత్యములు మాని చరించు మయూరసంతతిన్
వదలి రసార్ద్రగీతములు పాడెడు హంసల నాశ్రయించెదున్.
హాదనని పుష్పలక్ష్మిఁ, కుటజార్జున సర్జ కదంబ నీపముల్
వదలి సమాశ్రయించె సుమవార మనోహర సప్తపర్ణలన్.

* * *

మదిరను గ్రోలినట్టి బలుమత్తడగంగ నిశీథిఁగాంతుఁడుం
గాదనుపిసాళి గబ్బిచనుగుబ్బలఁ గాఁగిట నొత్త వత్తలై
మెదగఁగఁ, దెల్లవాఱ నొక మేచకకుంతల కేళివాసమున్
వదలి మఱొక్కెడన్ గదికిఁ బాఱుఁ దనుంగని తానెనవ్వుచున్

* * *

వనితల తనువుల నియ్యెడ
మనసిజుఁడు విపాండురముగ, మంథరముగ, జృం
భణ తత్పరముగఁ, గృశముగ
ఘనలావణ్య విలసితముగా వర్తించున్.

ప్రేంకణపుఁ బూవు కస్తురి
కుంకుమ కస్తూరిపసుపుఁ గూర్చి మెదిపి యే
ణాంకముఖులు కలపంబును
బొంకపుఁ దెలిగుబ్బచనులఁ బూయుదురిపుడున్.

సరస రసాలసాల నవ సారకిసాల రసాసవంబునం
బరభృతరాజమొంతయును మత్తిలి రాగరసాంతరంగమై
నిరతము నాఁడుకోయిలలను నిక్కము ముద్దిడుఁ; దేఁటి పద్మమం
దిరమున నర్మకృత్యములఁ దేల్చుఁ బ్రియన్ మధుపానిపాడుచున్

తరుణుల చిత్తపేటికల దాఁచిన కాముకపాళి మానసాం
బురుహములన్ శుకాస్యములు వోలు పలాశసుమాళి చీల్పవే?
ఖరముగఁ గర్ణికార సుమకాండము కాల్పదె? యంత బోక బం
ధుర కలకాకలీధ్వనులఁ దూర్ణము నొంచుట యేల కోయిలల్.

[ఈకావ్యము సంపూర్ణముగ నాంధ్రీకరింపఁబడియుండినది.]

పుష్పబాణవిలాసము.

అనువుగ గోపకాంతలు స్వయమ్ముగఁ గౌఁగిల గబ్బిగుబ్బ పో
టున కొకయింత చందనముడుల్లియు సౌరభమొల్లు కాయ మొ
ప్ప, నిశి నసుప్తిమైఁ గనులఁ బాటలమారఁ బ్రభాతవేళ శో
భనువహించిమించు విటవర్యుఁడు మిమ్మనిశమ్ముఁ బ్రోవుతన్

అన్నులవేనవేల మదిహాయి జనింపఁగఁ గూడియాడు నా
వెన్నుని చిత్రమౌ చరిత విత్ధములోకమునందుఁ; దత్కథా
భ్యున్నతి నాశ్రయించి సరసోజ్జ్వల కావ్యము వ్రాయనున్న నా
కెన్నఁగఁ దల్లి భారతి యహీనకృపామతిఁ బల్కుతోడగున్.

కన్నులుగొప్పవాయెఁ బ్రియకాంతుఁడు దృష్టిపథమ్ము నొంద; నా
కన్నియ మేన నొత్తెఁ బులకల్ విజనాలయమందుఁ గాలిడం;
బ్రన్నని చన్నుగుత్తులను బట్టు నెడం దనువల్లి కంపిలెన్;
గ్రన్నననూడెఁ దానయయి కంఠముఁ గౌఁగిలువేళ నీవియున్.

అరవిందప్రతిమానమై నగవుతో నాస్యంబు రంజిల్ల; సుం
దరవక్షోజ తటాంతలగ్న పట మత్యంతంబు జాఱంగఁ, జె
చ్చెర నాసన్నజనప్రతారణమతిం జేచాటుగావించి బి
త్తరి దూరంబుననుండి కాంచు నను మోదంబార సాకూతయై.

పడఁతిరో చూచితే నిబిడమాధవి మధ్య నికుంజసద్మముం?
బుడమిని రాలి చల్లినటు పూవులు శోభిలు; నిందు బాళిమై
పడఁతులు కాముకేళి సలుపన్ మణితంబుల శబ్ద మేరికె
వ్వఁడు వినరానియట్లు గొలుపుం బికముల్ కలకాకలీధ్వనుల్.

కీరము బింబమంచుఁ గొఱికెన్ బెదవిం; బరుగెత్తె వీఁడె నీ
భారపుఁ గొప్పు; మోము శ్రమవారికణంబులఁ దోఁగెఁ; గంటకాం
కూరము మేనఁ గాటు లిడెఁ గోమలి, కంకణమార్భటింపఁగన్
బాఱెద వేల చిల్కకయి భ్రాంతి, ననందయుఁ బూలుగోసెడిన్

జాఱిన పయ్యెదం గరకిసాలము చేఁ జనుదోయిఁ జేర్చుచున్
వేఁఱొకముస్తుకేల ముడివీడిన క్రొవ్వద దిద్దికొంచు నో
యొయ్యారి సుగంధకర్దమకణాంకిత దేహముఁ బాటలోష్ఠ మొ
ప్పారఁగ వెల్వడుం బ్రియునిహర్మ్యము కంతుని జైత్రలక్ష్మినాన్

కాంతుండేఁగుఁగదా విదేశమని యోకాంతా, మదీయాత్మయాం
దెంతో చింతయొసంగె; లోకహితుఁడౌ యిందీవరాప్తుండు దుః
స్స్వాంతుండై కలహించుఁ; గోకిలల రమ్యాలాప సంగీతముల్
వంతం గూర్చు; వనానిలంబులకటా! ప్రాణంబులందీసెడున్.

కన్నులవిల్తు కీలల వికారము పేర్చినఁ దాపశాంతికై
పన్నిన మావిలేఁ జివురుఁ బాన్పునఁ దొయ్యలి చేయినాన్చినం,
గ్రొన్నన లెల్లమాడె; సుమకోమలగాత్రి యనంగసంజ్వరం
బెన్నఁగ నింత యంతయని నెవ్వరికేనియు శక్యమే ధరన్.

లలనారత్నము నవ్వుమోము విధునిన్ లజ్జాంకితుం జేయ మం
జుల కీరాలపమున్ వచః ఫణితి యస్తోకంబు నిందింపఁగన్,
జలజామోదభరానిలంబులను నిశ్వాసంబు గ్రేణింప నా
ర్తిలి యుండాకను వేచి కాంత నవి గాఱించున్ వియోగంబునన్

కన్నియ పాడినన్ శ్రుతివికారము గొల్పు విపంచినాదముల్;
వెన్నెల చీఁకటట్లు గనిపించును దెల్లనినవ్వు నవ్వినన్;
గన్నులముందుఁ గ్రొత్తదగు కల్వయు వాడినయట్లుదోఁచు;మై
వన్నియచెన్నుఁజూడఁగ వివర్ణములోఁ దొలుకారు మించులున్.

చిరము, నభూతపూర్వము విశేషసఖీజన దోషజంబునై పురి
గొనురోషమున్ విడిచి మోమిఁటు చూపుము, నేత్రజాడ్యముల్
కరఁగుత; కర్ణపేయముగుఁగాతఁ త్వదీయ రసార్ద్రవాక్యముల్.
తరలుత తాపబాధ వనితా, వెదఁజల్లుము చల్లచూపులన్.

కాంతుఁడుమ్రొక్కనించుకయుఁగాంచ;దతండునుగిన్నఁబోయిసం
జింత నిరంతముం బొగులుఁ; జెచ్చెర నెచ్చెలులంత వల్లభుం
జెంతకు బల్మిఁదేమఱలఁజెల్వయుమానముఁబూను;గ్రమ్మఱన్
వంత నతండుఁ బోవఁ జెలి ప్రాణము కంఠమునాశ్రయించెడిన్

కన్నియ కన్నుదోయికడఁ గన్నులుమూసినమేల్ కురంగముల్;
విన్నను బల్కు, వీనులకు వేదగుఁ గోకిల కాకలీరుతుల్;
పొన్నరిమోముఁజూచుటకుఁబూర్వమెలోకముగోరుఁజంద్రునిన్
మన్ననపొందు హేమలత మానినిఁ జూడని యంత కాలమున్.

అహల్యానురాగము.

పూలగుత్తులుదేవ పూజార్థమనియన్నఁ
జనుకట్టు క్రిందికి జాఱనొత్తు;
జలజంబులైనను సంతరించితె యన్న
వెడఁద వాల్గన్నులు విప్పిచూచు;
కుందంబు లొకకొన్ని కోసితేవే యన్న
దరహాసమొనరించి తలనువంచు;
పున్నాగమల్లదో పూచెఁ గైకొమ్మన
నెఱినాభి క్రిందికి నీవి దిగుచు;

యజ్ఞవేదిక సమిధలు నాజ్యపాత్ర
పెట్టవేయన్న హృదయంబు తట్టిచూపి
భావజానల ధూమంబు బయటి కూర్చు
యౌవనారంభమున నహల్యాలతాంగి.

* * *

అలరుల్ చల్లనితావులం జిలుక,స్విన్నాంగశ్రమల్ వాయువుల్
దలఁగింపన్ సెలయేళ్ళుకోయిలలు పంతాలాడి పాడంగ వె
న్నెలపర్వన్ విలసత్సమాధి పదవీ నిష్ణాతు నాగౌతమున్
జెలి కౌఁగింటనుబట్టె ఆప్రతిమఁ బుంజీభూత కామార్తయై

[ఇది 110 పద్యముల కావ్యము పుస్తకము ఎప్పుడు ఎక్కడ పోయినదో తెలియదు. ఈకావ్యమును వ్రాసిన కొన్ని దినములకు పిసుపాటి శేషాచలశాస్త్రిలవారికి కొన్ని పద్యములు చదివి వినిపించితిని. వారు పై రెండు పద్యములను మెచ్చుకొనిరి. ఆపద్యములను మరల మరల చదివి కంఠగతము చేసికొంటిని. అవి నేటికిని జ్ఞప్తియున్నవి.]

శ్రీకృష్ణుని రాయబారము

శ్రీరాజిల్లెడు స్వర్గదేశమును దోర్వీర్యంబునన్ గెల్చి వృ
త్రారిం గానలపాలుచేసి నరకుం డత్యంత గర్వోన్నతిన్
మీఱన్ సంగరమందు నయ్యసురునిం బిల్కార్చి దేవేంద్రునిన్
స్వారాజ్యంబున నిల్పినట్టి హరి నిచ్చల్ మాకు సౌఖ్యంబిడున్.

ఫాలయును గోత్రినెత్తురులు పొల్పసలార యకాలసంధ్య ది
క్తలముల నించు మత్తగజదానవచర్మము వల్లెవాటు చుం
గులు కటిసీమ జాఱ, శివఁగూడి ముదంబునఁ దాండవించు న
వ్వాలిమల యల్లువాని రిపుభంజకశూలము మమ్ముఁగాచుతన్.

బలయుతులైన దైత్యులకుఁ బ్రాభవమొందఁ వరంబులిచ్చి వా
రల రణశక్తి ధాటికిఁ బరాజితులైన నిలింపకోటి యు
మ్మలికముదీఱఁ గొండొక సమంచిత కార్యవిధంబుఁ దెల్పు నా
జలజభవుండు మాన్పఁ జక్రనిబ్రాతలు వ్రాయుగావుతన్.

*　　*　　*

భారత కావ్యరాజమున భావరసోదధి తిక్కయజ్వ శో
భారమణీయ కల్పనల వాకొనెఁ గృష్ణుని రాయబారమున్
నే రచియింతు నేఁడు, దగునేర్పున నద్దియె కాలపద్ధతుల్
మాఱుటఁ జేసి నూత్నగతులన్ సమకాలికు లెంతొ మెచ్చఁగన్

*　　*　　*

అని యిష్టదైవ ప్రార్థనంబును, సత్కవి ప్రశంసయు విష్ణులీలా బహుళత్వంబును గణించి పఠితల కభ్యుదయ పరంపరగ నాయొనర్పంబూనిన శ్రీకృష్ణుని రాయబారంబను ప్రబంధంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన:—

కురురాజేంద్రుని పేరుటోలగమునం గొల్వుండి శాస్త్రార్థముల్
పరతత్త్వంబులు లోకవృత్తములు నుల్లాసంబుగన్ భీష్ముఁడున్
గురుఁడున్ ద్రోణియు సంజయుండు కృపుడుంగుందేద బోధింప ని
ర్భరమోదంబున సభ్యులెల్ల శిరముల్ పంకింప నత్యంతమున్.
దరహాసోల్లసితాస్య పద్మమున కుద్యద్దంతకాంతుల్ తదం
తరజాతామల కేసరంబులన విన్నాణమ్ము గొల్పంగ భీ
కరసంగ్రామకళోక్తులం బలుకుచుంగర్ణుండు దుర్యోధనా
ది రసాకాంతుల మెప్పులంబడసి యుత్తేజంబునన్ మీఱఁగన్.

* * *

అతులమణిమయ హేమసింహాసనమున
నధివసించి యిట్లనియెను నంధనృపతి
సంజయునిఁగాంచి హృదయంబుసంచలింప
వదనబింబము దీనత వాడువాఱ.

* * *

అర్జునుఁడేల శత్రువిజయాంకము గాండివ మూననేల య
త్యూర్జితబాహువీర్య సమరోద్ధతుఁడా మరుదాత్మజుండె వే
కర్జముఁదీర్పఁబూని లయకాలకృతాంతుని లీలరేఁగ క
ర్వార్జితబుద్ధిమాంద్యులగు నయ్యలుకొంచొక లెక్కయేంయిటన్

*　　　*　　　*

అనవుడు ధృతరాష్ట్రునివంక మొగంబై ద్రోణసుతుం డిట్లనియె.

పాండునృపాలసూనులు స్వభావకృపామయులౌట నీర్ష్యమై
గండుతనమ్ముఁ బూనకయ కానల కేఁగిరి; కాకయున్న, నా
ఖండలసూతి గాండివముఁ గైకొన నొక్కఁడు నిల్చువాఁడె త
ద్భండన కౌశలోద్ధతి విధానము గోగ్రహణానఁ జూడమే.

పాఱులెవారు "దేహి"యని పాండుమహీశుని రాజ్యభాగముం
గోరుట, కెమ్మెయిన్ విమతకుంజరకేసరులై రణావనిం
బోరి సమస్తసంపదలు బొందకయుందురె? యీయమన్నవా
రూరకపోదురే భుజబలోగ్రులు సంగరమన్న భీతిచే.

అనవిని యింతదనుక సభ్యుల యభిప్రాయంబు గనుం గొన నెట్టులో కోపము బిగఁబట్టి వేచియున్న దుర్యోధనుండు దండతాడిత భుజంగప్రాయుండై వీరావేశంబునఁ గనీనికలు రక్తగోళంబులై చూపఱకు వెఱపుం గఱప నిట్లనియె:

వెలితి ప్రసంగముల్ సలిపె వృద్ధమహీపతి; యంతఁ బోక పెం
జలమున సంజయుండు తనచాతురిఁ జూపెను ధర్మవేత్త నా
వలఁతుల యట్లు ద్రోణకృపవక్తలు వాకొనిరేమొ పద్ధతుల్
పలికెను ద్రోణపుత్రుఁడును పాండుతనూజుల శౌర్యగాథలన్.

కురురాజేంద్రుని సత్సభాగరిమ యెగ్గుంబొందఁగా మీరు సి
గ్గఱిగాజుల్ధరియించు కొన్నటుల వికారింతిర్ విసర్జించి సం
గరమన్నన్ వెఱగొందు పందలయి పల్కన్ వింటి మీనాఁడు,
చూ। డరమమ్మైనను; మేటులంచునిటులాడన్ బాడియే దీనతన్.

పాండుతనూజులంట! బలుపాడి చెలంగెడు వారలంట! తా
మొండనలేక ధర్మరతి నోరిమి రాజ్యమువీడి కానలన్
భండన మొల్లకే చనిన బాహుబలాఢ్యులటంట! యింతకా
ఖండలసూతి గాండివముఁగైకొన నిల్వరటంట కౌరవుల్!

పరదోర్వీర్యము వందులట్లెపుడు గైవారంబులం జల్పుకొం
చు రణంబాతఱి నీతిశాస్త్రముల హెచ్చుల్ మాకుబోధించి ని
ర్భర శౌర్యాత్మనకేని పందతనముం బట్టించు పాండిత్య బం
ధురులౌ పాఱులు మాకుసాయపడనెందున్ లోటు వాటిల్లునే?

కరమున గాండివంబుగొని కవ్వడి చివ్వకుఁ గాలుదువ్వఁ బెం
పఱి వెఱఁబూని కౌరవులు పాఱులువోలె వడంకి యార్తురే?
నరుఁడననేమి యాతనికి నాయన నాకవిభుండు వచ్చినన్
గురుధరణీశు శాతశరకోటులు పాపపుబుద్ధినెంచునే.

పెనుగదఁదాల్పనేల, యనిఁబేర్చగనేల విభీషణంబుగన్
ఘనసమరారవంబులు వికత్తనముల్ రవణింపనేల మ
ద్ధనురతిముక్త హేమకలిత ప్రదరోద్ధతి కాఁగినంగదా
యనిలతనూజు సంగరవిహారపుమాటలు మున్నయేటికిన్.

కపటపు ద్యూతముం గొలిపి కన్నులురెండునుగప్పి పాండుభూ
మిప సుతుల౯ వనంబులకు మేమనిపించితిమోటు? వారు ము
న్నె పణముగాఁగ భార్య ధరణీతలభాగము నొడ్డిమాకు నో
డి పురమువీడిపోయిరి; కడింది మగంటిమి గల్గఁ బోరరే?

బలముఁ బ్రతాపమున్నఁదమపాలు చలంబున నాలమందు వే
గెలిచి గ్రహింపరే, వనులఁ గీడ్పడియుందురె వీరులైన నం
దుల నోడఁబాటు పై సమయధూర్వహత౯ నటియింపనేల ని
చ్చలు నిజధర్మవృత్తియను ఛాయను డాఁగిరిగాక పాండవుల్

బలము గలిగినపుడె బవరమ్ము సలుపంగ'
హక్కుగలదు; సమయహాని యనెడు
మిషయె మాటుగాఁగ మెలఁగిరి యెట్టులో
పాండుసుతులు ధర్మవర్తులటుల.

అనవిని చెవులకు ములుకులవలెసోకు దుర్యోధనుని వచఃప్రహారంబుల మనంబు గలంగి రక్తరూక్షేక్షణుండై భీష్ముఁడు మేఘనిర్ఘోషంబుల ననుకరించు పలుకుల నిట్లనియె:

ధర్మబద్ధులౌట ద్రౌపది చెఱనాఁడు
నూరకుండిరకట, యొప్పుదఱిగి
కుంతిసుతులు; పోరు గూడినయపుడైన
మీ పరాక్రమంబుఁ జూపినారె?

సమరమందు వైరి సమ్ముఖంబుననిల్చి
యుద్ధరాస్త్రచయము లోర్చుకన్న
నోలగంబునను రణోక్తులు వచియింపఁ
గొంతమెప్పుగాదె కురుకులేశ.

నిర్జరనాథపుత్త్రునొకనిన్ మనమందటు మాలముట్టునాఁ
డూర్జితబాహుగర్వమున నొప్పదొలంగఁగఁ జేసినారమే?
తర్జన భర్జనాకుల నుదాత్తత సూపెదుగాని పోరునం
దర్జును నొంచినాఁడవె శరాసన పాండితి మేరమీఱఁగన్.

పందతనాన నుత్తరుఁడు పాఱఁగ సారథిగాఁగ దేరిపై
ముందలబెట్టి పార్థుఁడు సముజ్జ్వలసారశర ప్రకాండముల్
గ్రంముకొనంగ నేయఁగ వికత్తవముల్ దెగనాడు నేఁటివా
రందఱు లేరొ, సంగర విహార మనోరథముల్ సెలంగవో!

నాఁడు నరుండుకైవడని నాటిన తూఁపుల పోటుగంటులీ
నాఁడును గ్రొత్తనెత్తురులనానెడి; మానఁగ లేద; యింతకే
పోడిమిమాలి యాలమునఁబోటరులంచుఁ దలంపనేల మీ
రాడిన పోటుమాటలు రణావనిఁబల్కినఁగాదె దీటగున్.

అబలయౌ ద్రౌపది యార్తయై కుయ్యిడ
నోలగంబునఁ జీర లొలిచినట్లు;
కపటపు ద్యూతంబుఁ గల్పించి పాండుపు
త్రులపాలి రాజ్యంబు గెలిచినట్లు;

లక్కయింటనుమే నలసి నిద్ర వోయెడు
కుంతిపుత్రులఁ గాల్పఁగోరినటులు;
విషసంయుతాన్నంబుపెట్టి భీమన్నను
జంపుయత్నంబులు సలిపినట్లు;
అంత తేలికయే రణమందునిల్చి
పార్థబాణాసనోన్ముక్త పరకఠోర
కంఠలుంఠన లీలాప్రకార ఘోర
శరపరంపర కోర్వంగఁ గురుకులేశ.

బెట్టిదముగ గంధర్వులు
ముట్టగనిన్నపుడు పార్థభుజవీర్యం బి
ట్టిట్టిదనుచు నీమదికిం
దట్టదె రవయేని? యింతదాపటికంబే?

అనవుడు కోపంబురూపంబుదాల్చిన తెఱంగున నుగ్రుం డై పలుకంబోవు, దుర్యోధనుని వారించి సటాలుంచనంబున గర్జించుపంచానన కిశోరంబువరవడి కర్ణుఁడిట్లనియె.

యుద్ధము గల్గినప్పుడు బలోన్నతి చూపక ధర్మశాస్త్రసం
బద్ధమనస్కులై పనికిమాలిన సుద్దులు పల్కుచుందు; రీ
బుద్ధులవేలకో? పరచమూ కరకంఠ మృణాలహంస చం
చూద్ధతి మీఱు క్రూరవిశిఖోత్కరముం బఱపింపలేనిచో.

నరుఁడడుగో రథంబుపయినా మనముబ్బఁగఁ జెంగలించి య
త్తఱిని నమస్కృతీషువు నతండొకఁడేయఁగలొంగిపోయి, ని
ర్భరగతివచ్చెఁ బార్థుఁడిఁక భండనమేల యతండు భర్గునిన్
దురమున గెల్చెఁగాదె యనదో కపికేతనుఁడంట లెస్సయే?

వీరుల యట్లు గోగ్రహణ విశ్రుతలీలకువచ్చి యర్జునుం
డేరిపయిం గనుంగొని యుదీర్ణపరాక్రముఁ డాతఁడంచు మీ
బీరము పారముందొలఁగ బెల్చనఁ గౌరవసేనముందఱం
గాఱులు వల్కమేలె పతిగాతియవొందగ శంకపుట్టఁగన్

పరమాన్నంబులు* భక్ష్యముల్ పులుసులుం* బప్పుడంబుల్* తెరల్
వరుగుల్ గారెలుసుష్ఠుగామెసవుచున్ వహ్వాయటంచున్ రుచుల్
హారువుల్ పలుకుచు బ్రాహ్మణార్థములఁ బిండాసక్తివర్తించుమీ
మెఱుఁగండే ముసుయోధనుండనిసహాయేచ్ఛన్ గడున్ వేడఁగన్

అనవుడు కోపసంక్షుబ్ధ చిత్తుండయి యంగంబున రోమాంచంబు లుప్పతిల్ల దిగ్గని గద్దియనుండి లేచి యశ్వత్థామ యిట్లనియె.

ఓరీకర్ణుఁడ, కండకావరము నిన్నూఁకింప మాబోఁటి స
ద్వీరశ్రేష్ఠుల వ్రేలుచూపి పలుకన్ దీటైతివే యారా! నీ
బీరంబున్ సహియింపనోపనిఁక దోర్వీర్యంబు శూరత్వ మే
దీ రా చూతము; చాపపాండితి బలోదీర్ణత్వమున్ సత్త్వమున్

కులము కొఱంత యట్టులొనగూరెను బల్కులు, రాజరాజు ని
చ్చలు నిను బెద్దఁజేయఁగొనసాఁగెనుడంబు, పవిత్రవంశ పూ
జ్యుల మముబోఁటి యోధుల విశుద్ధయశంబును మాపునీవు పె
గ్గల నటు గట్టిపెట్టి రణకేళికి రమ్మిట సూతనందనా.

అరయండెక్కెములో, రథాంగములో పల్యాణంబులో కోలలో
తురగ శ్రేష్ఠములో కరీంద్రఘటలో తోత్త్రంబులో గాక భూ
వరుల్ బ్రాహ్మణయోధులున్న సభలో భాషింతువే ధీరున్
బరరాజన్య గళాబ్జనాళ దళన ప్రావీణ్య ధుర్యుండున్.

అని సజ్యంబునుజేసి కార్ముకము నత్యాకుంచిత భ్రూకుటిన్
మునుకో, భీష్ముఁడునాఁగుమాఁగుమని తాముంజేయిసారించి యా
తనిఁ బీఠంబునఁ బెట్టఁ జిత్తమునఁ గ్రోధజ్వాల ధూమంబు పై
కొనెనో నాగురుపుత్రుఁడూర్చెను సభాకూటంబు వేండ్రంబుగన్

* * *

జననీ కంఠలతానికృంతన గళత్సారాస్రధారాముఖం
బునఁ గెంజాయలు చల్లు గొడ్డలి తృషన్ భూపాస్రసంతర్పణం
బునఁ జల్లార్పడె క్షత్రియాన్వయము రూపున్ మాపి యా రేణుకా
తనయుం; డాతఁడు బ్రాహ్మణుండొ పరుఁడో తథ్యంబు యోచింపుమా

కురుసభనుండు సర్వాత యకుంఠిత గౌరవమేఁగె; నింక ని
త్తెఱఁగున నిల్వనేల, ఘనదీక్షనురందు మహీసురుల్, వృథా
భరమొక కౌరవేంద్రునకు; భండనమెల్లియ కాకమాన, దం
దొరసెడి కర్ణపార్థవిశిఖోద్ధురతం గనుగొందుమే గదా!

సూతసుతుండ నయ్యెదనొ సూర్యతనూజుఁడనౌదునో రిపు
ద్యోతిత కంఠనాళ రుధిరోదధిలో జయలక్ష్మిపోత ము
ఖ్యాతలువోవ నెట్టుకొని యుద్ధతి నేఁగెడువాఁడు సూతసం
జాతుఁడొ క్షత్రియాన్వయ నిశాపరిపూర్ణసుధామయూఖుఁడో
తేరకుఁ గౌరవేశ్వరునిఁ దిట్టుచుఁ దిమ్మిచు వాలుబొజ్జలన్
శేరులలీలఁ బెంచికొని పెద్దతికంబు భరింపుడన్న నిం
కేరును నోరులెత్తనటు లెంతయు మాటకు వేయిమాటలన్
దూఱుట కబ్బసంబయిన దూబలతో సరిపల్కవచ్చునే?

అవనిసురుల కొఱకు సమవస నిలుచునా
పుంజులేక పొద్దువొడవకున్నె!
చూతమింక రణము చొప్పడునప్పుడు
నర్జునుండు శరము లడరునపుడు.

* * *

బలవంతులైన వైరుల
మెలకువఁ దప్పించుకొనుట మేలగు; మధురో
జ్జ్వలవాక్పూర్ణుఁడు, కార్యం
బులవిజ్ఞుఁడు సంజయుండు, పోఁగ నతనిన్.

కుంతీపుత్రులపాలికంపి యట నెగ్గుల్ పుట్టకుండం గదుర్
శాంతోక్తుల్ నుడివించి సంధివిధముల్ చర్చింపఁ జేయించి దు
ర్దాంతాభ్యాగమలీల మాన్పి ధరణీరాజ్యంబు నేలుండు మా
స్వాంతంబుల్ ముద మొందఁ బాండవకురుక్ష్మాపాలకుల్ నెమ్మిమై

లేరే పూర్వులు కీర్తిధన్యులు ధరాలేఖ ప్రభుల్ సద్గుణో
దారుల్ శూరులు వారితోడ నొకచింతాకైనఁ గొంపోయిరే,
పేరుంగీర్తియె కాదె నిల్చినది, నీవేయెంచుమీ, దుష్టచే
ష్టారక్తిందగు రాజులం బ్రజలు విశ్వాసంబుతోఁ గొల్తురే?

సరసిజబాంధవుండు విలసత్కరపంక్తి దొఱంగి రక్తవ
ర్ణ రమనుదాల్చి పశ్చిమధరాధర శృంగముపైకిఁ బ్రాకఁ, ద
ద్గిరి విలసిల్లె సల్లలితదీప్తిని కాలవరుండు సంధ్యకున్
సరసతఁగూర్చు హేమకలశస్ఫురితంబు గుడారమో యనన్.

కాంతాకాంతుల సౌఖ్యవల్లరులు చక్కంబూయ నిండారు పై
కాంతుల్ నాఁగ సుధామయూఖుఁడుదయగ్రావంబునందోఁప న
త్యంతం బభ్రచరద్ధునీ సలిల భంగాభోగడిండీర ఖం
డాంతః స్వచ్ఛసితప్రభాకలితమై వ్యాపించెడిన్ వెన్నెలల్.

మారుని యుద్యోగంబిఁకఁ
దీఱిక యగుననుచు ముందుఁ దెలిపెడి ధవళా
కారపు టాజ్ఞాపత్రము
నా రాజిలె నింద్రదిక్కు నలుపు వదలుచున్.

లలితానేక సుమప్రకాండ లతికాలాస్యంబులన్ మీఱి యు
జ్జ్వల చంద్రోపల సంస్రవత్సలిల మిచ్చం గ్రుంకి యామీఁద గం
ధిల శీతామలవాతపోతములు ప్రీతింజొచ్చె శయ్యాగృహం
బులఁ గాంతామృదుగండ ఘర్మకణికాపూరంబులం ద్రావఁగన్

*　　　　　*　　　　　*

కులుకుంగత్తెలు నీటిబిందెలు భుజాకూలంకషస్ఫూర్తిఁదా
ల్చలతాంతాయుధుచిహ్నముల్ గలుగులేఁజెక్కుల్చనుల్వ్రాతెఱ
ల్గొనలపున్నెన్నడలుం బరస్పరము నాలోకించి హేలావచో
విలసత్స్వాంతతఁ బోవుచుండిరి సరోవీధిన్ మిటారించుచున్.

*　　　　　*　　　　　*

అంతధృతరాష్ట్రుండును దక్కుంగల సుతహితామాత్య బంధువర్గంబులు సభామందిరమున నోలగంబుండి సంజయుని రావించుడు ఆతనిదిక్కు మొగంబై యంధభూపతి యిట్లనియె:

సుమతివి, మధురాలాప
క్రమచాతురిగలదు; రాజకార్యజ్ఞుఁడవీ
వు మతిఁదలంచిన యత్నము
సమకూరు నిరస్తవిఘ్నసముదాయంబై.

అవ్యయసంగరాంగణవిహారులు పాండుతనూజు లాయుప
ప్లావ్యపురంబునన్ మురవిపాటను గూడి వసించువారలీ
వేవ్యతిరేకభాషణములెత్తక యుక్తిఁ దదీయచిత్తచిం
తావ్యయముం బొనర్చి యమితకుధ్రదీఱు వచోమనోజ్ఞతన్.

కనఁబఱచి వననివాసం
బునఁబొందిన ఖేదమును సమూలంబుగ నూ
డ్చి నయముసెప్పి రణంబున
కనుమతిలేకుండు తెఱఁగు నరసి పల్కుమీ.

*   *   *

నాపూర్వపుణ్య ఫలములు
దీపించెనొ నాఁగ మిమ్ముఁ దేజోమయులన్
బాపవిదూరుల సుమతులఁ
బ్రాపించుట గల్గె నంధపతి మూలమునన్.

మీర లుపప్లావ్యంబునఁ
జేరుటవిని వృద్ధనృపతి చిత్తంబున బొం
గారెడు వాత్సల్యంబునఁ
గోరి ననుంబంపె మీదు కుశలంబడుగన్.

వనవాసాయాసంబులు
ఘనమగు నాపదల నెల్లఁ గడపి యుపాయం
బును బొరయక మీవచ్చుట
మనమున ధృతరాష్ట్రపతి ప్రమదముం బొందెన్.

*   *   *

అనవుడు సంజయుఁగని ధ
ర్మనందనుఁడు పల్కె గూఢమతియై మేమా
జనకుని వాత్సల్య భరం
బునఁగాదే కానఁ గష్టములు పుచ్చుటయున్.

సేమమే వృద్ధనృపతికి శ్రీసమృద్ధి
యుతమె రాజ్యంబు ధృతరాష్ట్రసుతశతంబు
జనకునాజ్ఞ నడపుచున్నె, సర్వజనులు
నాయురారోగ్య విభవంబు లందువారె?

గురుకృపభీష్మ ద్రోణులు
నిరతముసౌఖ్యంబు లంది నెగడుదురే, యా
కురురాజువారి మతి పొం
దరసి నటించుచునె సగౌరవాంచితరీతిన్ !

సూతసుతుఁడు కర్ణుఁడు వి
ఖ్యాతరమాపూజ్యరాజ్య కలితుఁడు కురుభూ
మీతలపతియును సౌఖ్య
స్ఫాతిఁ బరస్పరముఁ గలసి వర్తించెదరే

*   *   *

అనవిని సంజయుండించుక దైన్యము మోమునం దులా
కింపఁ గౌంతేయాగ్రజున కిట్లనియె:

ధార్తరాష్ట్రులు సతము మత్తద్వేషంద్రి
ముల తెఱంగున స్వాతంత్ర్యమునఁ గడంగి
కార్యభారము వహియింపఁ గలదె వృద్ధ
కురుపతికి గుండెలొక్కటఁ గుదుటపడుట.

శకునికర్ణదుశ్శాసన వికటమతులు
ధారుణీపాలనాది సందర్భములను
దోడుపడఁ గౌరవేశుఁడు దుష్టబుద్ధి
గాని తెఱఁగు కొండొక్కఁడు గలదె చెప్పుఁడ.

*   *   *

అనవిని ధర్మనందనుండిట్లనియె:

ఎపుడైనన్ గద పోరుగల్గునెడ నెంతే మోదమేపార భూ
మి పతుల్ భీముగదావిహారరచనాతోన్మేషంబుఁ జింతుంతురే?
కృపభీష్మాఖిల వీరయోధులు సభం గీర్తింతురే విద్విష
త్తపనాపాదకగాండివంపుఁ బస నుత్తాలత్వమున్ సంజయా.

అడుఁగో పాండవ కల్పశాఖి కరుణాస్వాంతుడు దైత్యాంతకుం,
డడుగో భీముఁడు, వాడె యర్జునుఁడు నల్లారే కవల్ వారి వెం
బడియున్నారదె చూడు బాంధవహితామాత్యుల్మహారాజులున్.
గడఁకం జెప్పుమ వార్తలున్నిచటన్ గౌతూహలంబొత్తగన్.

వారువినంగరాని యెటువంటి రహస్యములేని మాకు బం
గారమువచ్చినన్ వినుటగాదు; సభాస్థలమందు నియ్యెడం
జేరినవారలెల్లరును శ్రేష్ఠులు శిష్టులు మిత్రబాంధవుల్
శూరులు పండితుల్ గురుయశోధరులౌట నెఱుంగుమీమదిన్.

కావున ధృతరాష్ట్రుఁడు ని
న్నేవిధి వచియింపఁబంపె నింపుదొలఁక నీ
వావార్త లుగ్గడింపుమ
మావారలు మేము ముద మమందతఁగాంచన్.

అనిపాండుక్షితిపాలకాగ్రతనయుండాడంగ సూతాత్మజుం
డును దద్గర్వవచో విధానమునకొండుం బల్కకే యోలగం
బునఁ గూర్చుండిన వారికందఱికి సమ్మోదంబుగన్ మ్రొక్కియి
ట్లనియెం దేనియసోనలం జిలుకురమ్యాలాపముల్ భక్తిమై.

కాలమువచ్చెఁగృష్ణ, కలకాలముఁ బాండవకౌరవేశ్వరుల్
బాలురనాఁటినుండి యెదఁబాటిలు నీర్ష్యనడంప, బంధువుల్
పోలఁగ సర్వసౌఖ్యములు పొందఁగ, నెయ్యముభోగభాగ్యముల్
చాలఁబరిగ్రహించి ప్రజసంతసమొందఁగ శాంతిమీఱఁగన్.

శాంతాకారుఁడవీవు కృ
తాంతాత్మజుఁడును క్షమాపరాత్ముఁడు మీర
త్యంతముఁ జేరినయెడ నొ
కింతి జనక్షోభ మెత్తునే శ్రీకృష్ణా!

శరమునకున్ ధనుస్సు సంధియొడంబడ దుర్నిరీక్ష్యమై
పరఁగువిధానఁ గౌరవు పాండవులుండఁగఁ గూడియున్న నె
వ్వరికిని వారిఁదేఱి కనవచ్చునె? శాత్రవకోటి సంగరో
ద్ధురభుజగర్వ నిష్ఠురత దొల్గదె వెల్గదె దోఃప్రతాపమున్.
మారుత పుత్త్రుఁడొక్కఁడె యమానుషశక్తి గదాప్రహారదు
ర్వారత వైరివీరనికరంబుల నెత్తుట లోల్కమొత్తి పు
ష్పారుణవర్ణజుళ మ్రిమము లట్లొనరించి జయేందిరన్ వసం
తోరువనీవిహారమున నుల్లమురంజిలఁజేయఁడే, నృపా.

సవ్యాపసవ్యకరముల
నవ్యయశరముల్ నిగుడ్చి యర్జునుఁడు రిపూ
గ్రవ్యథ యను మూల్యంబున
భవ్య విజయలక్ష్మి గొనఁడె భండనవిపణిన్.

ఐన నజాతశత్రుఁడు నయంబునఁ దితిక్షయు ధర్మరక్తియుం
బూనిన సాత్త్వికుండగుట బుద్ధివిహీను లొనర్చుచేఁత యొం
డేనియుఁ దప్పుగాఁ దలఁచి యేయపకారము సల్పనోపఁడెం
తే నియతాత్మతం బవర మెంచు జనార్తికి మూలమౌటచే.

* * *

ధరణిన్ క్షత్రియఘస్మరుండయి భుజాదర్పంబునం జాప వి
ద్య, రణావేశమునం బ్రతాపగరిమన్ ధైర్యంబునం దుద్ది యె
వ్వరు లేకుండెడు జామదగ్ని సమరవ్యాపార పారీణతం
బోరినొప్పించిన భీష్ముఁడాహవమునం బోరంగ మాఱుండు నే?

చాపాచార్య శరప్రయోగ విలస[illegible] సంకీర్తనం
బేపారన్ రణమందు నీల్గు పరభూమీశ[illegible]న్ వరింపంగ నా
రా! పాఱుండు దలాలి మాకనుచు స్వర్గస్త్రీలు పానాత్తమం
దాపాంగంబులఁ గాంతులంగనఁగ నేనా తాదృశుం బల్కుటల్!

గురుసుతుఁడైన నేమి, తనకున్ రణమబ్బినఁ బూర్వపుణ్యమం
చురుసముఁ బొందుశౌర్యనిధి; యాతఁడు చివ్వకు రేఁగియాశుగో
త్కరముల నుద్ధతిం బఱపఁ దచ్ఛర ఝుంకృతి హెచ్చరించు ని
ర్భరకులిశాయుధాగ్రముల వాడిమి పోఁడిమిమాలు వైరికిన్.

కర్ణుఁడు వైరివీరలయకాలుఁడు కార్ముకమంది శౌర్య సం
పూర్ణతఁ గ్రోధమూర్తియయి పోరఁగడంగి నిశాతబాణముల్
ఘూర్ణిలు సేననేయ రిపుకోటి శివుండొ రమాధవుండొ యా
కర్ణుఁడొయంచు నిర్ణయముగాక గణింతురు నాకమేగుచో.

రాధేయుండు సమస్తగర్విత రిపువ్రాత ప్రతాపోద్ధతిన్
బాధింపంగ సమర్థుఁడంచెప్పుడు సౌభ్రాత్రంబు వాటించు చా
యోధాగ్రేసరు గౌరవించుఁ గురుభూపోత్తముఁ డత్యంతమున్
మేధాయుక్తునిఁ గర్ణునిం బొగడఁగన్ నేనెంతవాఁడన్ నృపా.

అంగపతి సూత సుతుండని యుపాలంభించుటయేగాక దాననేమి శౌర్యంబునకు లోటు వాటిల్లెనే?

సూతసుతుండ యాటయది సొంపెగదా, కదనోగ్రబాహు క
ర్వాతత సైన్య మత్స్యనిచయాంతక శాతకలంబ కల్పనా
ద్యోతిత జాలమొప్ప సమరోదధి స్యందనపోతమెక్కి ప్ర
స్ఫీతవిహారతన్ ధరకువ్రేఁగగు ధీవరమాన్యుఁడుర్విపా!

* * *

కావునఁ దుల్యబలులైన యిరుతెగలవారు నెమ్మిమై నుంట శ్రేయంబు నావుడు కర్ణదుర్యోధన శౌర్యోత్కర్ష కథనంబు సహింపనోపక యీసడించి భీమసేనుండు వెక్కసముగ నిట్లనియె.

ఔరౌ సంజయ, కర్ణబాహుబల విఖ్యాతిం బ్రశంసించె దీ
వీపాండుక్షితిపాలసూనులకడన్ హెచ్చింపుగన్, సౌబలే
యీపుత్రుల్ నినుఁజేరఁబట్టిన ఋణంబీగంగ వర్తించి తౌ
రా! పార్థహరినైనఁ జూడవలదా రాధేయుఁ గీర్తించుచో

* * *

మీఁదుర్యోధను శౌర్యసాహసములఁ మేమెల్ల వీక్షింపలే
దే దెల్లమ్ముగ ఘోషయాత్ర, మఱి యుం కేలా నుతింపంగ వా
గ్వాదంబుల్ గలియాగ నేమిటికి వక్కాణింపుమీ వృద్ధరా
జాదుల్ పల్కిన తేరమాటలను మాయన్నయ్య శాంతింపఁగఁ.

* * *

[ఈకావ్యము అసంపూర్ణము. 215 పద్యములు వ్రాయఁబడియుండినవి.]

సింహాపరిబోధము

సమ్మోదంబున వన్యసత్వములు నిన్ సామ్రాజ్య భారమ్ముఁగై
కొమ్మంచున్ బ్రతిమాలుచుండ దినముం గుంభీంద్రఫాలాస్రమాం
సమ్ముం ద్రావుచు మెక్కుచుం దిరుగు నీశౌర్యమ్మదేమాయె సిం
హమ్మా, కాననరాజ్య మేలఁ జనుమా యత్యంత స్వేచ్ఛారతిన్

కమ్ముల్దాపిన బోనునన్ నిలిపి సౌఖ్యమ్ముల్ దొలంగించి రా
పొమ్మంచున్ వినయంబు నేర్పి, తుదకుం బూర్వంపురోషమ్ము శౌ
ర్యమ్మున్ లేమిని నైజముం జలిపె నాహా! కాలచక్రమ్ము, సిం
హమ్మా, కాననరాజ్య మేలఁ జనుమా యత్యంత స్వేచ్ఛారతిన్

సొమ్ముల్ వాటెడు నీ మొగంబు గనినన్ శోకంబు పెల్లుబ్బు; బీ
రమ్ముల్వల్కు వృకంబు లీవెసఁగి దుర్వారాత్మ వీర్యమ్మునన్
హుమ్మంచున్ వడిబోను వ్రిచ్చి చనఁగుయ్యొయ్యాయంచుబోనే మొసిం
హమ్మా, కాననరాజ్య మేలఁ జనుమా యత్యాంత స్వేచ్ఛారతిన్.

వమ్మా నోజతనంబటంచు నిరసింపం బోకు యత్నమ్ము; నై
జమ్ముల్ మార్పులు; స్వీయమా బలము సచ్ఛౌర్యమ్ము మేధాప్రకా
రమ్ముల్ శంక యొనర్చి దీనతఁబడన్ రంజింపె యోచింపు సిం
హమ్మా, కాననరాజ్య మేలఁ జనుమా యత్యంత స్వేచ్ఛారతిన్

చుమ్మల్ చుట్టగఁ బొట్టగట్టుకొనిహుస్సులావ్వేయుచుఁ మేకఁమాం
సమ్ముంబెట్టఁడు దింపువో, పలలమిచ్చంగాన భక్షింతు వో;
కమ్మల్ గిమ్ములు స్వప్నబాధములువీఁకన్ బోనులంఘింపు సిం
హమ్మా, కాననరాజ్యమేలఁజనుమా యత్యంతస్వేచ్ఛారతిన్.

కవి

సరసకవీశ, నీయశము సర్వదిగంచల చంచలేక్షణా
వరకుచ చందనాంకమయి పండితచిత్త చకోర చంద్రికో
త్కరమయి, కాలపత్త్రమున గట్టిగ వ్రాసిన వర్ణపంక్తియై
ధర వెలుఁగొందుతన్ జనవితానము సన్నుతియింప నిత్యమున్

నీయాశయంబులే నిఖిలలోకమునకు
మార్గదర్శకములై మహిమఁ దాల్చు;
నీమహాసూక్తులే నిర్ణిద్ర విజ్ఞాన
పటిమ సంపాదించుఁ బ్రజలకెల్ల;
నీసరసోక్తులే నీరసాత్మునకైనఁ
గరుణాంకుర స్ఫూర్తి గలుగఁజేయు;
నీ నీరవాక్కులే నిర్బలాంగునకైనఁ
గరవాలు దూయించుఁ గలనుసలుప;

నీవు గలుగని సంఘంబు నిర్మానంబు;
నీవు పుట్టని దేశంబు నిష్ఫలంబు;
నీవు దలఁపని యూహాలు నీరసములు;
నిన్నుఁ బొందని వాక్తతి నిందితంబు.

సత్యమ్ము ధర్మమ్ము శౌర్యమ్ము వీర్యమ్ము
మూర్తీభవించె నీమూలముననె;
సాంఘికాచార సంచయము శాశ్వతముగ
మూర్తీభవించె నీమూలముననె;
దృగ్గోచరముగాని దివ్యభావములెల్ల
మూర్తీభవించె నీమూలముననె;
భూతకాలైక భూభుజుల చారిత్రముల్
మూర్తీభవించె నీమూలముననె;

నీమహత్త్వము నేమని నేనుతింతు;
నీవు వచియించు నదియెల్ల నిత్యమగును;
సమయభేదావరోధంబు సమసిపోవు;
సకల సజ్జన సన్నుత సత్కవీంద్ర.

సంక్రాంతిపండుగ

గరుడ స్తంభము చేతఁబట్టి చలికిం గాయంబు కంపింపఁగన్
స్వరముల్ గద్గదమొంద మేలుకొలుపుత్సాహంబుగం బాడుచున్
దరమున్ భోమ్మనియూఁదుచున్ ఘణఘణధ్వానంబుగన్ జాగటం
బొరివాయించుచు దాసరయ్య దిరిగెం బ్రోలెల్లడన్ వేకువన్
చలికప్పున్ సడలింపలేక ప్రణయస్పర్ధన్ రహశ్శయ్యపై
నలుకంబొర్లుచుఁ బ్రత్యూషంబున గవాక్షాయాత సూర్యాంశువుల్
దళుకున్ బంగరు నిగ్గులం జిలుకఁ గాంతా, లేనెయంచత్తయుం
బలుకన్ లేచెను గాఁపుకోడలెఱకల్ పయ్యంట బాగొత్తుచున్.

అలరు సుమావరోధమును నల్లఁ గ్రమించి కవోష్ణదీధితుల్
చిలుకుచు లోకబాంధవుఁడు శీతలతన్ హరియించి చెట్లకొ
మ్మలఁ జిగురాకు జొంపములు మాదిరి మీఱఁగ నెత్త్రడాలుపూఁ
తలఁ బచరించెఁ గల్యరమతాఁగయిసేసెనొ నాఁగఁ బండుగన్.

సరసిజలంబులాడి వెనుజాఱిన క్రొవ్వెద వారిబిందువుల్
దొరఁగి సువాసినీ వితతి తోయములం గొనిపోవుచుండఁగా
నరుణ మయూఖపాళి నిటలాలక సంతతులన్ మెలంగి కే
సరయుత పద్మ విభ్రమము సంధిలఁ జేసెను ముద్దుమోములన్.

పూవులు కొప్పుముడించుటేమి భూషణరాజి మెఱుఁగ ధరించి శో
భావహమైన పట్టుజరీపయ్యెదలం గయిసేసి ద్వారబం
ధావళిఁ గామినీమణు లుదంచితరీతి నలంకరించుచుఁ
హా! విలసిల్లి రెంతయు గృహాంగణముల్ నవదీప్తిశోభిలఁ.

భారతమాతృ ప్రబోధము.

లెమ్మా మాతరో యీప్రభాతరుచులన్ లీనమ్ములై యంధ కా
రమ్ముల్ వీడఁగె; మనః ప్రబోధక కలారావంబుగం బక్షులన్
సమ్మోదమ్మునఁ బాడె నీచరితముల్ శౌర్యమ్ముపొంగంగ; లే
వమ్మా, స్వాప్నికశయ్యవీడి,కనుమా యాదండస్వారాజ్యాంశులన్

ఫలభారంబు ధరింపనున్న మొగడల్ వాసంతమందానిలం
బులకుం బూచి భవిష్యదద్భుతఫలస్ఫూర్తిం బిసాళించు చి
హ్నలసూచించెఁ, దదీయవాసనలకైనన్ లేచి యోతల్లి, నీ
తళుకుంగన్నులఁ గప్పుముంగురులఁ జిత్రంబారఁ బైకొత్తవే.

మును గంగా లహరీతరంగతతులన్ భోకొట్టు స్వాతంత్ర్యగా
న నినాదంబులు నేఁడు త్వత్ప్రియసుతానాదాత్మ వీణారవ
మ్మున సమ్మేళనమంది నాగరకతా పూర్ణత్వసంధాన సూ
త్రనినాదంబయి మిన్నుముట్టె జననీ, తల్పంబు వేడిగ్గవే.

కాళిందీ సికతాప్రదేశముల మున్ గల్యాణ కృష్ణుండు స
ల్లీలన్ వేణురవ ప్రబోధములఁ దల్లీ నిన్ను మేల్కొల్పె ని
ద్రాలోకమ్ముననుండి; నేఁడును సుధాధారాభినిష్యందగీ
తాలోలమ్ముగ నారవీంద్రకవి నిన్నగ్గించెఁ, గన్నెత్తవే.

నీపుత్రుల్ గనుచున్న స్వప్నశతముల్ నిండారు సత్యమ్ములై
దాపుం జేరెడు మూర్తిమంతములుగా ధైర్యమ్ముఁ బ్రేరించుచున్
మాపుణ్యంబు ఫలోదయంబగు నెడన్ మమ్మొల్ల దీవింప ని
ద్రా పర్యంకము వీడిరమ్ము జననీ రాగంబవార్యంబుగన్.

విమర్శకుఁడు.

విను: కవితావిమర్శకుఁడ, పెద్దటీకంబును మానుమింక, నీ
మనము శిలామయంబొ, యభిమానమనంతమొ, కోమలాశయం
బణఁగెనొ, సత్కవిత్వపరమావధి నందితొ, శబ్దలోక జీ
వనమగు భావసృష్టి సలుపన్ గమకింతువొ, పూవుఁదేనెకున్
మునుకొని మూఁగు తేఁటి పెనుమూఁకలఝుమ్మనుకమ్మగీతితో
నెనయగు శబ్దరత్నము లనేకము సుందరభావసూత్రమం
దొనరఁగఁగూర్చుచుందువొ, రసోజ్జ్వలయాకవితావధూటి మో
హాసముగ నిన్వరించునొ, యహర్ముఖమందు హసించుపూవులం
దొనుఁకు తుషారబిందువులు దోఁచిన మోదరసాంకితాశ్రు సం
జననము గల్గునో, వివిధసాంధ్యవిలాసము లంకురింప మిం
చినతమిఁ బశ్చిమాశఁగల చిత్రములం దిలకింతువో ఘనా
ఘనములు నంతరాళమున గంతులు వైవఁగఁ జూచుచుందువో,
వనభృతకాకలీ కలరవంబులు విందువొ, భూధరంబులన్
వనుల వయాళి సల్పెదొ, స్రవంతి నిపాతముఁ గాంతువో నిశీ
థినిఁజని యొంటిగా నిసుకతిన్నెల మేనరమోపి తారకా
స్వనమున గర్భితంబయిన భావరహస్యముఁ గందువో మదిన్.
తనివి సనంగవ్యాకృతియుఁ దక్షినలక్షణ లక్ష్యముల్ మనం

బునఁ బెనుజిడ్డు గట్ట నెగఁబోసి యజీర్ణవు గాలిత్రేఁచుచున్
మనియెడినీకుఁ గావ్యరససమాధురి నాని యథార్థలోక సీ
మ నొకత్రుటిం గ్రమించిక్షణమాత్రముస్వర్గముచూఱగొట్టఁబో
లునె? సరసాత్మ కోమలత లోపముచేసెను నీకుబ్రహ్మ! కా
దనియెదొ? యట్టులేని మధురామృత శీకరముల్ వెలార్చుమో
హన కవితాసుమంబులను నగ్గి రగుల్తు వదేల? పుట్టు మ
చ్చను దొలఁగింపనెంచి నవసారసనేత్రి కపోలఫలకమున్
ఘనముగ గంధకామ్లమునఁ గాల్చినరీతిఁ బటంబునందు బొ
మ్మను దిలకించి నేత్రములమాదిరి దప్పెనటంచు దబ్బనం
బునఁ దెగదిద్ది కన్నుఁగవ పోడిమి నూడ్చెదు పోల్కి కావ్యముం
గొని వివిధావయంబులనుగోసి కసాయిబజారుఁ బెట్టెదో?
కనుఁగొనవోయి మున్ గవియగాధ హృదంబుధి గర్భగుప్త ర
త్ననిచయమున్ బదింబదిగఁ దత్తటమందుఁ జరించిచూచి; భా
షను నెఱసుల్ గలంచ సరసంబగు పద్ధతి దిద్దుచుంటివా
చనుటయె! యెవ్విమర్శనమునైన విమర్శక దృష్టిఁజూడ ఈ
సును వెలిగ్రక్కుచుండు; గడుసుందనమెంతయు భాషసేవసే
యనుదగు సాధనంబొ,మదియందునెదోయనుమానమున్న యో
చనమెయిఁ జర్చసేయ కవిచారతఁ దప్పులటంచు దిద్దు నీ
యనుభవ మేమిసెప్పను! మహాశయులేవెడ సేఁతఁగాంచి ప
క్కన నగరే? మహాకవి నకుంఠితరీతి సడింప గౌరవం
బొనరు నటంచునెంచెదవహో! యిదిధర్మమె? చిత్రకారుఁడున్

అనుదినముం బ్రయత్నమున నద్భుతచిత్రములన్ లిఖింప ఈ
సున నొకడట్టి లేఖ్యములఁజూచి మషీజల సేచనంబుచే
సిన నదియౌనె నైపుణి? కుశేశయపత్రవిశాలనేత్ర నొ
క్కనెలఁతఁ గూడుచెలికారము చొప్పడ నెన్నొ యత్నముల్
పొనరిచియుం గృతార్థతను బొందక తత్ప్రణయంబు నీర్ష్యగా
నొనరిచి కొంతనేచు నొక యున్మముభంగిఁ బికస్వరస్ఫుట
స్వనమును హంసికాగతియు సారవచో విభవంబుముగ్ధమో
హన తనువల్లిగల్గు కవితాంగన కౌఁగిలి గోర నాకె ఛీ
యనుచుఁ దిరస్కరింప రదనాంచలముల్ పొడిగాగగీటి క
న్గొనలను గెంపులూర "నిదిగో కనుఁగొమ్ము విమర్శనాస్త్రముం
గొని దినపత్రికాధనువుఁగూరిచి నిన్నొగిలింతు" నం బ్రతి
జ్ఞను నెఱవేర్పఁబూని కడఁకం గువిమర్శనకార్యదీక్షఁ జే
కొనెదవు; పండితోత్తములకుం గవివర్యులకుం బరస్పరం
బును నెవియో విరోధములు పుట్టిన యడ్డె విమర్శనంబు పు
ట్టును;నటులౌటఁ జిత్తము పటుక్రుధతోఁజ్వలియింపనొప్పులుం
గనఁబడు తప్పులట్లు; లోకకావ్యమునందున నొప్పుదప్పులం
గని రసముల్ గణించి, యొసకమ్మగు భావములం దలంచి శో
భను గమనించి, శిల్పకళపద్ధతిఁగాంచియు నౌచితిం గనుం
గొని, కవిచిత్తమారసియు క్రోధముఁ బాసి విశేషశాంతభా
వనియతితో విమర్శనము వ్రాసిన నయ్యది మార్గసూచియై
తనరును గాని పండితుఁడు తప్పులనే యొక కొన్నిచూపి యొ

ప్పును గమనింపకుండుట పరిపూర్ణవిమర్శన శక్తియౌనె? చిం
తన మొనరింపుమయ్య, కవితాసుమంజరి కమ్మతావులం
గొని సువిమర్శనానిలము గూరిచి మానవపాళికెల్లఁ బం
చిన నది మేలు సేతయగు; శ్రేయము కీర్తియు నీకుఁ జేకుఱున్;
మునుపటినుండి నీవచన ముద్గరసంహతి నెందఱో కవుల్
మన మొఱియంబొకారిరి; కుమారికలౌ కవితాలతాంగులే
యనలముఁ జొచ్చిరో, రసమయంబుగ నేటికిఁ గైత సెప్పఁజా
లిన కవులెందఱో తొలిమలిం గుటివెట్టు విమర్శతాఁకునన్
దినదినముం గృశించి యతిదీనత నీకవితోద్యమంబె మా
నినసుఖమంచు నెంచిరో, వినీతి నిఁకం గవిమారకాస్త్రలీ
లను నుపసంహరింపుమి కళాపరిపూర్తికి దారిచూపుమీ.

దేశమాతృస్తవము.

ఏధీరహృదయకు నింపారు హిమవద్ధ
 రాధరంబు కిరీటరాజమయ్యె;
ఏపుణ్యచరిత కహీన గంగాసింధు
 వాహినుల్ తోమాలె వలె రహించె;
ఏమహాసాధ్వికిఁ గోమలతరులతా
 బృందమ్ము పులకలచందమయ్యె;
ఏవీరమాతకు దేవారిపురిలంక
 పాదపీఠంబుగఁ బరిఢవిల్లె;

అట్టితల్లిని నిన్ను జేపట్టి యెపుడు
భక్తిసేవింతుమమ్మ నీపాదమాన;
మమ్ము నీపుత్త్రికులఁ గావుమమ్మ కరుణ;
దివ్యశక్తిపవిత్ర యోదేశమాత.

కోఱలు ముప్పదిమూడుకోట్ల కోటీరముల్
 నక్షత్రచయములై నభము ముట్ట;
ఘోరారి మదకుంభి కుంభశోణితధార
 లేఱులై సెలవులఁ బాఱుచుండ;

వజ్రిప్రభావ నిర్భరత శాసించెదు
　　శాతత్రిశూలంబు చేతమెఱయ:
నీలకంధరవర్ణనిబిడమై దేహంబు
　　భూనభోంతరములఁ బూరటిల్ల
దుర్నిరీక్ష్యప్రతాపంబుతోడఁ దాండ
వంబు సల్పెదు నీస్వరూపంబు మాకు
దర్శనంబీయఁ గొల్తు నితాంతభక్తి
దివ్యశక్తిప్రపూత యోదేశమాత!

వేదాంతవిద్యా వివేకస్వరూపకుం
　　డల వివేకానందు నాత్మ శక్తి;
ప్రకృతివిజ్ఞానశాస్త్ర ప్రవీణుఁడు జగ
　　దీశచంద్రుని బుద్ధిపేశలతయు;
కవితారసాస్వాదకలనశీలకంఠుండు
　　కవిరవీంద్రుని కావ్యగానరక్తి;
చిత్రకళాప్రభా శేముషీ ధుర్యుండు
　　రవివర్మ తూలికారత్నమహిమ
మాకుదయచేసి విద్యావివేకఘనులు
గా నొనర్పుమ వాత్సల్య గరిమ మమ్ము;
కనుమ పూర్వస్మృతిని కొంత మనమునందు
దివ్యశక్తి ప్రపూత యోదేశమాత!

దుర్వారశత్రు సందోహమ్ము మర్దింపఁ
దొడరునట్లుగ శౌర్యదోర్బలంబుఁ;
నీమహావిఖ్యాతి నిత్యంబు వినుతించి
చెలఁగునట్లుగ మాదు జిహ్వలతయుఁ;
స్వాతంత్ర్యబలివేది సన్నిధిఁ గానుక
లర్పించునట్లుగ నాత్మదృఢతఁ;
కావింపఁ దలపెట్టు కార్యాళి సాధింపఁ
గడఁగు నట్లుగ వీరకార్యదీక్ష

అమ్మ ప్రతిపక్ష వీరసంహార ఘోర
భీకర కరాళ రూపిణీ, ప్రీతిమీఱ
మాకు దయసేయుమమ్మ నిన్మహిమలెల్ల
దివ్యశక్తి ప్రపూత యోదేశమాత!

పుణ్యస్రవంతికా పులినభాగంబుల
వేద ఋక్కుల ఘోష వెలయవలయుఁ;
హైందవ యువకుల యాత్మదర్పణముల
నీమనోహరమూర్తి నెగడవలయుఁ;
ఆరణ్య విశ్వవిద్యాలయమ్ములయందు
విద్యార్థులను జదివింపవలయు;
భారతీయులొనర్చు ప్రతికార్యమునయందు
జాతీయతావ్యక్తి చాటవలయు;

ఎట్టు దిద్దెదో పుత్రుల నింకమీఁదఁ,
బూర్వశోకమ్ము విడనాడి పూనుకొమ్ము
గౌరవాస్పదానల్ప సత్కార్యదీక్ష
దివ్యశక్తి ప్రపూత, యోదేశమాత!

జలజము.

సంతమసావరోధమున సన్ననిమంచు చెఱంగుఁగప్పి నీ
వెంతయు వంతలంబొగుల నింతకురాదు మయూఖమాలి తా
నెంత కఠోరచిత్తుఁడొ సహించునొకో ప్రణయప్రవాహ సం
క్రాంత మనస్కవై చెలఁగు కాంత హృదీశుఁ డుపేక్ష చేసినన్.

కడు గర్భస్థ మిళిందబృందము మిషన్ గగ్గోలుగా నేడ్చి సం
దడిసేయంగ నిఁకేల వారిజమ, యుద్యద్ధాళధళ్య ప్రభం
బుడమిన్ముంచుచువచ్చు మిత్రుఁడనుచున్ బోధింపఁ బెన్వేచు లం
బడి నిన్ జేర రథాంగదంపతులు ప్రేమన్ వచ్చె వీక్షింపుమా.

అరుణుఁడువొల్చె శీర్షమకుటాగ్రమణీమయకాంతి పుంజముల్
వఱలఁగ; వందిమాగధుల భాతి ఖగంబులుగూసెఁ; జీఁకటుల్
దొఱఁగెను; నింకనైన మది దుఃఖమువాసి ప్రసన్నచిత్తవై
కరుణ ననుగ్రహింపు బలుకౌఁగిటఁ గాంతుని; నల్కమానుమీ

ఆశీర్వాదము.

లోకోజ్జీవన కరమయి
ప్రాకట రసభావ శిల్ప భరితంబయి నూ
త్నాకారంబుల వెలసెడు
నీకవిత చెలంగుఁగాత నిత్యము సుకవీ!

శారదచంద్రికా స్ఫురిత శర్వరులందు నదీతరంగ ఝం
కార రవానుకారియయి కమ్ర రసాభ్యుచితప్రచారియై
సారస నిర్యదంబు ఘనసార సుశీతలతం జెలంగి సొం
పారునుగాత! నీకవిత యాంధ్రకవీ, రసికోపభోగ్యమై.

ఆలఁ గరంది ప్రమోదుల సరాళకిసాల చయంబులొత్తి శో
భాలలితార్ద్రభావ రసభంగులకుం దలిదండ్రులైన వా
గ్జాలముగూర్చి గీతముల సత్కవిశేఖర, పాడిపాడి యాం
ధ్రాలి చిరప్రసుప్తమగు నాత్మను నిద్దురలేపు మియ్యెడన్.

బంభర శుకకీట సంవాదము.

శుకకీటంబునుగాంచి బంభర మహాశా! చోద్యంబు! నీపక్షవ
ర్ణకళాచిత్రము లెట్టిపుర్వునకు నైనం గల్గునే? యింద్రచా
ప కణంబుల్ నవరత్నఖండరజముల్ పక్షంబులం జెక్కి తా
నొక కీటంబు రచింపఁగోరి విధి నిన్నొప్పార నిర్మించెనో!

నిను గాంచంగనె యెట్టి జీవులకునేనిం బ్రేమ చిప్పిల్లు; న
న్ననిపూరేకులఁ బోలు నీగఱుల సౌందర్యంబు కొల్వొందెడిన్,
అనయంబున్ బువ్వుఁదేనెలాని రమణీయంబైన నీరూపమున్
ఘనఝుంకారనిబద్ధ గీతముల నే గానంబుఁగా వించెదన్.

అనవిని సీతాశోకము
తను బొగడుచునున్న షట్పదంబును గని, నీ
వనునది యెల్ల నిజంబై
నను, సంతాపాంకితంబు నాబ్రతుకు సఖా!

నను గనినంత బాలురు మనంబున సంతస ముప్పతిల్లఁ జ
క్కని పురువియ్యదే యనుచుఁ గాలుకుఁ గాలుమెదల్పకుండ మె
ల్లన నను బట్టి ముద్దిడుచు, లాగుచు, నొండొరు చేతికిచ్చుచుం
గొనుచు గఱుల్ వడల్చి తుదకుం బడరువ్వుదు రేమిసెప్పుదున్ !

అర్భకుల కాటయయ్యె నయ్యయ్యో! నాకుఁ
బ్రాణ సంతాపకరమగు బాధయగును;
నాదు సౌందర్యగరిమయే నాకు మృత్యు
వగును బంభరమా, యిఁకేమని వచింతు?

కమ్మఁదేనియఁ ద్రావి ఝుంకారములను
శ్రుతి సుఖమ్ముగఁ జేయుచు సొంపుమీఱు
నీరజాగారమున నుండు నీకు నెపుడు
సాటియౌదురె మాబోంట్లు షట్పదంబ?

అని శుకకీటమాడ విని యౌవనపు నందపు రూపుగల్గి తా
ననయముఁ బ్రాణసంశయమునందుచుఁ బ్రిమ్మరుకంటె, నల్లరూ
పున మసిబొగ్గులా గలరి పువ్వుల తేనియలాని తమ్మిగీ
మున నివసించుటే సుఖము మోదమునించును;బోయివచ్చెదన్

అనివచియించి మిళిందము
ఘనవర్ణ గరుద్ద్వయంబుఁ గదలించుచు ఝు
మ్మని గానము లొనరించుచుఁ
దనదారిని బోయెఁ బుష్పతరువాటికకున్.

మాతృశతకము.

శ్రీకళ్యాణనిధాన మాశ్రితజనాశ్లేషానుభావ్యంబు ప్ర
త్యేకానందకరం బరాతినృపమూర్ధన్యస్త ముద్యద్యశో
వ్యాకోశీకృత దిఙ్ముఖంబు కరుణావాల్లభ్యపూతంబునై
మాకుంగూర్చుత దేశమాతృపదయుగ్మం బర్థమారోగ్యముల్!

తల్లీశారద, మాతృదేశమును శ్రద్ధాభక్తి సేవింప నే
దుల్లాసంబుగ సన్నుతుల్ సలుప నేనుంకించితిన్, నీవు నా
యుల్లంబందు దయామతిన్నిలిచి యుద్యోతించి, మందాకినీ
కల్లోలార్భటి నించు పల్కు రసనం బల్కింపవే, నింపవే.

కలవుంగాలమనాక బిడ్డలను నెక్కాలంబునందైన స
త్కరుణా దృష్టులఁ బ్రోచి కట్టఁగుడువం గల్పించి పోషించి యా
త్యురుకష్టంబులు సైచు నీకుఁ దులయే యోచింపఁగన్ దేవతల్
గురువుల్ బంధులు పుత్రమిత్ర ధనముల్ కోట్లైన నోమాతరో
తళుకుం జెక్కులుఁ గబ్బగుబ్బలును నిద్దంపున్ లలాటంబు ను
జ్జ్వల శంపాలతఁ గేరుమేననుచు నిచ్చల్ స్త్రీలవర్ణింప నే
మిలభించున్ వెత దక్కఁ? నిన్నుఁదలఁచన్ మించుంగదే సద్యశో
విలసత్ సౌఖ్యసమస్తసంపదలు నిర్వేలాకృతిన్ మాతరో.

ఘనముల్ కుంతలపాళిగాఁగ హిమవద్గ్రావంబు హీరప్రభా
ఖనియౌ దివ్యకిరీట మల్లసఁగ గంగాసింధువుల్ బాహు లై
యొనరన్ వింధ్యము మేఖలావలయమైయొప్పార భవ్యాకృతిన్
మును గన్పట్టిన నీస్వరూప మిపు డింపుల్ వాసెనే మాతరో

సరసీజాప్తమయూఖముల్ కిసలయచ్ఛాయన్ విడంబించి క
ల్యరమాకంఠమునన్ సుమస్రజము లీలంగేరు వేళన్ సరో
వరతీరంబుల మౌనులాగమవచః ప్రాగల్భ్యముం జూపుచుం
బరగన్ స్నానము మున్నొనర్తు రిపుడవ్వా రేడనే మాతరో.

హరిణుల్ నిర్భయలీలఁ బచ్చికలనాహారింప వన్యోర్వి, ని
ర్భరమోదంబున గిండ్లు గైకొని ఝరింబ్రాపించి సల్లాపముల్
జరుపం దాపసకన్యకల్ ఋషులుసంజన్ మ్రొక్క, నానందమం
దిరముల్గా మునిపల్లెలొప్పెఁగద మున్ నేఁడేవియో మాతరో

హోమోద్భూత పవిత్రధూమచయ సంయోగంబునం బుష్పితా
రామంబుల్ ఘృత సౌరభాంచితములై రాగోల్లసత్పల్లవ
స్తోమంబుల్ మసిపూతలొంద, మృగసందోహంబు క్రీడింపఁగన్
గోముం జిల్కువనంబు లిత్తఱిని రంగుల్వాసెనే మాతరో.

సెలయేటుల్ శిలలం దొరంగి రవముల్ సేయంగ వాసంత శా
ల లతావాటులు తావులం జిలుక నుల్లాసంబుగం గోయిలల్
పలుకన్ మావుల నీడ శిష్యతతికిం బాఠంబులం జెప్పు నొ
జ్జలు నావన్య పవిత్రసంస్థ లిపు డేజాడయ్యెనే మాతరో.

తిలకింపం జిత్రముగాదె బౌద్ధుల నలందావిశ్వవిద్యాలయ
స్థలమున్ ముప్పదివేల శిష్యులట శాస్త్రంబుల్ పఠింపంగ ని
చ్చలు వాణీనిలయంబులై వెలయు నాస్థానంబు లేమయ్యెనో?
తలఁ జింతించిన యట్టులాయెఁగదె యుత్కాలంబునన్ మాతరో.

జలకంబాడి త్రియామాప్రయుక్తవిధులన్ సాంగంబుగం దీర్చి వి
ద్యల నభ్యాసము సల్పుఁదాపసుల చైత్యంబుల్ సమీపించు శి
ష్యులు లేమింగద భావదాస్యపరతన్ శుష్కించుచుం గ్రుంగె దే
బలవత్కాలజలప్రవాహభయదావర్తావళిన్ మాతరో.

సుతులత్యంత భుజాబలాఢ్యులగుచున్ శూరత్వమేపార వి
శ్రుతసంగ్రామకళాధురంధరత శత్రువ్రాతముం ద్రుంచి సం
తత కీర్తిన్ వెలయింపు నీనయన పద్మంబుల్ ప్రమోదాశ్రుశో
భితముల్ గావొకొ మున్ను; నేఁడవి యెటుల్ పెంపేదెనే మాతరో.

* * *

అవనిన్ వాఙ్మయమందు క్షత్రియపద వ్యాప్తిం దొలంగింప భా
ర్గవరాముండు ప్రతిజ్ఞవట్టి తరుణక్ష్మాపాల కంఠాంకు రా
స్రప్రవదస్రోత్కట నిర్ఝరిం బరశు మత్స్యం బీఁద నేర్పించి సం
స్తవనీయుండయి మించె నట్టిసుతు నెంచన్ లేవటే మాతరో.

* * *

ఖరరక్షో ముఖులైన నాల్గుఁబదివేల్ క్రవ్యాదులన్ ధైర్య సు
స్థిరతన్ దా నసహాయశూరుఁడయి నిశ్శేషంబుగం గూల్చి, రా
గ రమం గ్రక్కున నశోకశాఖవలె రక్తప్లావితాంగంబులో
ధరణీజాతను డాయు దాశరథి సందర్శింపవే మాతరో.

వనధిన్ గోష్పదమట్లుదాఁటి యసుర ప్రాకారంబుఁ జెండాడి సీ
తను దర్శించి యశోకవాటిక సముద్ఘాటించి పౌలస్త్యు చెం
తను నిర్భీతిగ రామునాజ్ఞపలుకన్ దర్పించి లంకం ద్రుటిం
గనదగ్నిన్ రగిలించు మారుతి కిఁకం గైమోడ్పునే మాతరో.

కురువంశస్థులు పాండవుల్ సమరనిర్ఘోషంబులం జేయుచున్
ధరణీచక్రము దిద్దిరందిరుగ యుద్ధక్రీడ నన్యోన్యమున్
శరకౌశల్యముఁ జూపఁ గాంచి మది నుత్సాహంబు పొంగంగ నీ
మురువుంజూపిన కాలమిప్డు కలయైపోయెంగదే మాతరో.

మును చంద్రార్ధకళా కిరీటు శివునిం బోరన్ బడాయించి యా
తని మెప్పించి గడించి పాశుపతమున్, ధర్మతుమాజానికిన్
ఘనరాజ్యంబును గట్టి కౌరవపతిం గాఱించి శౌర్యంబు చూ
పిన గాండీవి శరాలు త్రుప్పుదినెనే పృథ్వీస్థలిన్ మాతరో.

గురుకర్ణాఖిలయోధ సంఘటితమై ఘోరారి దుర్భేద్యమై
స్థిరమై యొప్పెడు తమ్మిమొగ్గరము దోఃస్థేమంబునం జీల్చి వై
రి రసాకాంతులు సైతముం బొగడ నిర్నిద్రోగ్ర సంగ్రాముఖం
ధురతం జూపిన పార్థపుత్రుఁడు మదిందోఁతెంచునే మాతరో.

విజయా, నీతలగాచికొమ్మని రణావేశంబునం దేరులుం
గజముల్ సేనలు పీన్గుపెంట లటులం గావించి గర్జించి, యం
బుజనాభుండును జక్రమెత్తునటు లేపుంజూపి గాంగేయుఁడా
ధ్వజినీకాంతుని యంపశయ్యఁ గనుమా భావంబునన్ మాతరో.

గురుశాపంబును విప్రశాపమిపుడే గూడెంగదా, యస్త్రముల్
పరువిం దాఁకవటంచు నర్జున శరవ్రాతక్షతిన్ రొమ్ము నె
త్తురుఁబైఁజిమ్మఁగ, నేలఁగ్రుంగు రథమున్ దోర్దండముల్ మోపియే
త్తెఱఁ బైకెత్తెడి కర్ణయోధ రణశక్తిం జూడుమీ మాతరో.
సెలవుల్ సాంధ్యరమన్ వహింపఁగఁ గురుక్షేత్రంబునన్ ధార్తరా
ష్ట్రుల కీలాలము దోయిలించి దగగొట్టుల్ దీఱఁగాఁద్రావి, తూఁ
పులగంటుల్ విరఁబూయు కింశుక కుజంబుల్ గ్రేణిసేయన్ జగం
బులు భీతిల్లగ ద్రౌపదిం దరియు భీముం గాంచుమో మాతరో.

* * *

గురువృద్ధాంచిత సైన్యముం గనుచు నీగోడేల నాకంచు సం
గర వైముఖ్యముఁజూపు పార్థునకు వీకన్ గీత బోధించి ని
ర్భర శౌర్యంబును గొల్పి తేరికిని సారథ్యంబుఁగావించి భూ
భరమున్ డించిన సూత్రధారిని మదిన్ భావింపవే మాతరో.
కంసోర్వీశుఁడు క్రూరుఁడై నిజభుజాగర్వంబునన్ లోకమున్
హింసింపన్ గతియేమిలేక పను లెంతేఁ గుయ్యొ మొఱ్ఱోయనన్
కంసాపాత్రుఁడు కృష్ణుఁడా నృపతి మస్తంబూడ్చె; నవ్విక్రమో
త్తంసున్ దుష్టనికృంతనున్ నిరతమున్ ధ్యానింపవే మాతరో.
శరదిందూదయవేళ యామునతటిన్ సంగీతనాదంబు లం
బరహంతస్థమిళింద ఝంకృతులలోఁ బూర్ణత్వముం బొంది యిం
పు రహింపన్ మురళీరవాంచిత సుధాపూరంబు వాఱించి యే
కరమాత్మన్ జడిల మేలుకొల్పె, సతనిం బ్రార్థింపుమా మాతరో.

* * *

ఆలీసాందరువంటి శూరుని రణవ్యాపారముల్ మాన్పి సై
న్యాళిం బీనుగు పెంటలంజలిపి కయ్యంబందుఁ బ్రాచ్యావనీ
పాలుర్గండర మిండలంచుఁ దలవంపన్ గ్రీకుసర్దార్లు దో
ర్లీలం జూపిన చంద్రగుప్తు మదిఁ శేర్మింగాంచవే. మాతరో.

* * *

ఢిల్లీరాజ్యధురంధరుంగదిసి దండిన్ బోర జృంభించి శుం
భల్లీలన్ జయలక్ష్మిఁ గైకొని రిపువ్రాతంబులంజీల్చి పే
రుల్లాసంబున రాజపుత్ర యశముద్యోతింపఁ జిత్తోడ్ క్షమా
వాల్లభ్యంబు భరించె; నట్టిపురిశోభల్ మాసెనే మాతరో.

ఆర్యావర్తమనార్య సంఘపద విన్యాసోగ్రపాపంబునన్
శౌర్యౌదార్యపవిత్రవేదవిధులం బాసెంగటా! లెండు మీ
స్థైర్యస్ఫూర్తియొకింతచూపుఁడనిప్రోత్సాహంబుఁగొల్పన్ యశో
ధుర్యుండా మహారాట బెబ్బులి మదిందోతెంచునే మాతరో.

* * *

శ్లాఘా! గౌతమి తీరముల్ యవనపాలానీకినీ స్పర్శచేఁ
గూరెం గల్మష, మాంధ్రదేశయశ మెగ్గుంబొందె, నేమున్నదిం
కోరాయా, యని పౌరులాడఁ బరరాడ్వ్యూధంబులన్ గెల్చిపా
ట్నూరన్ నిల్పడెకృష్ణరాయఁడుజయాంకోత్తంసముల్ మాతరో.

పరరాణ్మత్తగజేంద్ర కుంభదళన ప్రారంభనిర్యాత భా
స్వరముక్తాఫలహారముల్ నిజయశః సాధ్వీగళాలంక్రియ
స్ఫురణన్ మీఱఁగనాంధ్రశౌర్యముఁబరాసుల్ మెచ్చఁబోరాడ
భూ। వరుఁడాబొబ్బిలిబెబ్బులిం గనుమ పాపారాయునిన్ మాతరో

* * *

వీరుగఁ దుగ్ధము ఖడ్గతిక్తనయు “సఖ్యే! పాలిదేమే?” యనఁ
“ వీరుగఁ నీవె రణంబునం దిఁకన్నా బాల్ విడ్గ న్విచిత్రింబె” యం
చరిత్ర్యములన తెల్పికిం దనయు డాయంజేయు వీరప్రసూ
త్తరయింకొక్కతె లేదెయాంధ్రమహినిద్రింబాపుఁగఁ మాతరో.
“ఇటనీరాడెదు చోట సిగ్గుపడిపోనేలా? తమాంబపు మి
చ్చట నీవుప్పుర మాఁదువార” మను చుఁ సంగ్రామమం దోడి ని
ష్కుటముంటోచ్చివ భర్తహేళనములఁ శూరత్వముఁ రేఁపి యు
త్కటయుద్ధంబున కంపినట్టి సతికిం గైమోడ్పవే మాతరో.
పరమత్తేభఘటాంకుశంబయి రణప్రౌఢిఁ విజృంభించి భూ
భరముందాల్చిననాగమాంబికయశఃప్రాగల్భ్యమాంధ్రాంగనా
భరణంబై చెలువారు, నట్టిసుత సంభావించి నేఁడైన సం
బరముఁ ముచ్చటముద్దు దీర్చుకొనవే భావ్యమ్ముగఁ మాతరో

* * *

గిరికుల్ మూఢత నుండ, జంతువులటుల్ క్రీడింపరోమన్లు, ఘో
రాకారంబుల నీలిరంగుల శరీరాద్యంతముంబూసి కొం
చే కాంతారములందొ యాంగ్లజనముల్ హేయంబుగానుండ నీ
కాకాలంబున ఖించె నాగరక విద్యాసంపదల్ మాతరో.
ధరనెచ్చోటనుగాని విద్యలు విధుల్ ధర్మంబులుఁ శాస్త్రముల్
సరసత్వంబును లేని నాఁటను మనోజ్ఞంబైన చిత్రంబులా
బరతత్త్వ ప్రకృతి ప్రభావముల నుత్పాదించు వేదంబులం
బొరి వాక్రుచ్చిరి కారె నీకొమరులింపుల్ మీఱఁగఁ మాతరో

* * *

ఇలనే దేశమునందు నిట్టికళ నెందేఁగాంచమంచున్ జనుల్
పలుకం, జంద్రశిలావళీరచితమై ప్రత్యగ్రరత్నాంకురో
జ్జ్వలమై తాజమహల్ నిలింపపురినా సంధించు నాశ్చర్యమున్
గలరే నేఁడును నట్టిశిల్పులు ధరాకాంతాగ్రిణుల్ మాతరో.

దేవాగారవిహారమంటపములన్ దీపించు చిత్రాళి ప్రా
ణావిర్భావముఁగల్గఁ బల్కవె త్వదీయానల్పశిల్పక్రియా
సేవాసక్తి "నజంత" చిత్రరచనా శిల్పోన్నతిం గన్న నేఁ
డేవారల్ నినుసన్నుతింపరు ముదంబెచ్చన్ మదిన్ మాతరో.

యవనోర్వీశుల ధాటికిన్ మిగిలి యర్ధానర్ధరూపంబులం
దవులన్ నిల్చిన దేవతాలయములన్ దర్శింపఁ దత్పూర్వశి
ల్పవిధానంబుల యస్థిపంజరములన్ భావంబుదోఁతెంచు; నిం
క వివేకింపుమ పూర్వశిల్పమెటులం గాంతిల్లెనో మాతరో.

మును మంత్రంబులశక్తిచేఁ బ్రతిమలైపోయెన్ శిలల్, లేకయుం
డిన నింకెట్టుల నిట్టివిగ్రహములన్ నిర్మించు నేశిల్పియై
నను నాఁగన్ రమణీయ శిల్పముల ధన్యంబైన "యెల్లోర"సృ
ష్టినిగావించిన సిద్ధహస్తుల కళల్ జీర్ణించెనే మాతరో.

హరినీలంబులు పద్మరాగములు వజ్రాంకూరముల్ పచ్చలుం
బరగన్ నవ్యతఁ బొందఁ జూపు సుషమా ప్రాగల్భ్యముం గేరు శే
వ రహించెంగదె నెమ్మిగద్దియ కళావాల్లభ్యముం జాటు చా
వరపీఠం బిపుడేడనున్నదొ మదిన్ భావింపవే మాతరో.

అస్వల్పమ్ముల మచ్చరించి సకలం బర్థంబు వేఁజొక్క పు
ల్లన్నన్ నమ్మి వృథాగఁ దుట్టతుద కయ్యర్థంబుఁ గోల్పోవు రీ
తి న్నీవారితయుఁ దెల్లవాఱె; బకభక్తిన్ నమ్మి మత్స్యంబులా
పన్నత్వంబున డిందవే కపటముం బాటింపమిన్ మాతరో.

గంగోత్తుంగ తరంగ పాళులకు నాల్కల్ గల్గినం బూర్వ రా
జ్యాంగ ఖ్యాతి పరాక్రమక్రమరణ వ్యాపార పారీణతన్
రంగారన్ వచియింపవే వనజ నిర్యద్బ్రాంభరీ డింభకా
భంగోద్యన్ మృదులార్భటుల్ శ్రుతులుగా భాసిల్లగన్ మాతరో.

పోయెన్ శౌర్యము, పోయె వీర్యము రమాభోగంబులుం బోయె వే
ఱాయెం గీర్తికి నీకు దుర్యవన సైన్యాంభోధి కౌర్వానల
ప్రాయంబా యసి తుప్పుపట్టెఁ; బదముల్ బంగారుసంకెళ్ళలో
రాయన్ భూషలటంచు సంతసమునన్ రాజిల్లితే మాతరో.

* * *

పారావారములెల్లదాఁటి మునుపుం బాశ్చాత్యదేశంబులో
బేరంబుల్ పొనరించి నావికులుగాఁ బేరొంది హిందూ వణి
గ్వరుల్ గాంచిరి కోట్లకున్ ధనము; నా తేంజంబు నీనాఁటి వ్యా
పారుల్ పొంద నుపాయమెందు గనుమా భావించియో మాతరో

హిమవత్పర్వత గహ్వరంబు డిగి మానీశుండొకం డిప్డు డా
శ్వ్యము హిం జొచ్చి యిదేమి దేశమన నార్యావర్తమం చేరు ధై
ర్యముతోఁ జెప్పఁగలారు? పూర్వమటులార్యౌన్నత్యమా యెక్కు
నా! రమణీయత్వము సట్టినీతి గలదే రాజ్యంబునన్ మాతరో.

పరవీరుల్ బెగడొందఁ ఖడ్గములఁ ద్రిప్పంజాలి యుద్ధంబులన్
శరముల్ గాడిన పోటుగంటులె తగన్ సమ్మానపత్త్రంబులై
యొరపుంజూపిన యార్యయోధులిపుడేమో కత్తిచేపట్టఁగా
నర్హుల్ గారట! యిట్టివింతగలదే, న్యాయమ్మటే మాతరో.

కనకాగారము, రత్నసంఖచిత మెక్కాలంబునం బండ్లు నిం
దునకేవచ్చును, బాజరంబయిన వింమంగల్గు సౌఖ్యమ్మటం
చను రాచిల్కవిధాన నూఁటె; విఁకనే నానందముంబొంద ముం
జని స్వాతంత్ర్యనభో విశాలతను విచ్చల్గాంచుమీ మాతరో.

చెఱకా బెల్లము, బియ్యమా కబళ,మో చెట్లా ఫలంబిడు మి
మ్మరుభక్తిన్ భజియింతునన్నిదునాయుప్పొంగివాంఛార్థముల్
పరగన్ గానుగ రాచకున్న, ననలహ్యాహారమీకున్నఁ, గ్రి
చ్చుఱఁగోలంగొని రాల్పకున్న; నిదినైజంబెందు నోమాతరో

* * *

గమనాయాసమునన్ హయంబులొఱగెం గపించెఁడెక్కెంబు; క
ర్దమనిర్మగ్నములాయెఁ జక్రములు; చేరన్ లేదు గమ్యస్థలం
బ, మహింజుట్టెను జీఁకటుల్, రథమువోఁబైకెత్త నీపుత్రులన్
గుమిగూడింపు ప్రబోధగీతములదిక్కుల్ మ్రోవఁగన్ మాతరో

"తరుణార్కుండిదెవచ్చువాఁడు, తమముల్ తల్గాడి,పాల్పెదెమీ
హారువుల్" నా వచియించు శుకు్రినటు భక్త్యావేశనత్పుత్రి మీ
తరుణంబాదుఁ, ద్వదీయపుత్రహృదయాంతర్వర్తియై శోభిలన్
పరగన్ స్వాప్నికబాధముం జదిపి స్వేచ్ఛన్ లెమ్మిఁకన్ మాతరో

తిమిరాంధీకృతశయ్యపైఁ గలగనం దెల్వేది స్వీయస్పృహా
సమతంబాసి, తమిస్రైతినని యెంచంబోకు సూర్యాంశువుల్
రమణీయంబగు నీశరీరగరిమల్ రాజిల్లఁ జూర్ క్రొంతలం
దెమలన్ లేదొ స్వరూపబోధకరుచిం దీండ్రించుచున్ మాతరో.

* * *

మదవేదండము శృంఖలందునుప, దిఙ్మాతంగ కర్ణోత్థ భీ
ప్రదఝంఝానిలమట్టెపివఁ; దటఘుర్ష స్ఫూర్తి నంభోధిశుం
భదనంతోర్మి కరాళదంష్ట్రిల ధరన్ భక్షింప నెవ్వారు కా
దిదియానాం చెదుఁగొట్టువారు ప్రకృతిస్వేచ్ఛావిహారిన్ మాతరో
ఆకుల్ ద్రుంచియుఁ దీవలంజదిపి యాయావాపముంబూడ్చి పై
పోకల్వాపఁగనల్లుదించి యెటులోపాకించియుం జైత్ర షే
రీకళ్యాణరవంబు లేగఁ గళికల్ రెక్కొవెప్పూఁదోఁట; నా
యాకాలంబున కవ్విగూడును నయత్నావాప్తిగన్ మాతరో.

కడుపుంగాల్చెడు శోకమేమొ! పలుకంగారాదు వాకట్టు చే!
నోడలెల్లన్ వసివాళ్ళువాడె, నిఁకఁ గుయ్యో మొఱ్ఱచే నెల్గురా
పడె, ఝాళంఝుళరత్ననూపురమిషన్ బల్మారునమ్మ్రించియున్
దోడిగెన్ శృంఖల నీకభాగ్యరమ సందుంజూచియో మాతరో

* * *

తనయులే మేమట! మానిరాజ్ఞీకరపాదస్పర్శఁబూతాత్మపా
వినుబూజించెడివారమంట! రణనిర్భిద్దోర్గ్రశౌర్యప్రధా
ఘనులౌ వీరులు పూర్వులంట! యిఁకనిక్కాలంబునన్ నీవు భో
జనహీనంబుగఁ బొట్టగట్టికొన నిచ్చల్ సూతుమే మాతరో.